
# కథామంజరి

## పది కథల సమాహారం



అక్టోబర్ 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**అక్టోబర్ 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 10

# బాలకథ

జులై నెల సంచిక నుంచి ప్రతీ నెలా కథామంజరిలో, పిల్లల కథలు రెండు ప్రచురింపబడతాయి! ఈ కథల విషయమై చిన్న సూచనలు:

- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్‌లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: **submit@kathamanjari.in**

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!

* * *



**కథామంజరి బృందం**





# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**

**కృపాకర్ పోతుల**

**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**

**కొచ్చెర్ల వి.ఆర్.**

**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## ‘గళ’ సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ప్రకటన

మాతో కలిసి "కథామంజరి" లో సేవలు అందించడానికి ఔత్సాహికులైన కథాప్రియులు కావాలి. తెలుగు భాష మీద పట్టు, సాహిత్యాభిలాష, సాంకేతికపరంగా మంచి అవగాహన, ముఖ్యంగా కథా సాహిత్యంపై మక్కువ ఉంటే ... మీ పేరు, ఫోన్ నెంబరు మా మెయిల్ కి పంపండి.

***submission@kathamanjari.in***

మేమే ఫోన్ చేసి మాట్లాడతాం!

కథామంజరి ఎంపిక చేసుకున్నవారిని ప్రచురణ, సంపాదకత్వం, సాంకేతిక శాఖలలో గల కార్యాలకు వినియోగించడం జరుగుతుంది.

నెలలో ఒకట్రెండు రోజుల సమయం మీరు కేటాయిస్తే చాలు.

'కథామంజరి'బృందంఅంతాస్వచ్ఛందంగాసేవలుఅందించేవారే. సమాజ సేవాదృక్పథంతో నడిపిస్తున్న 'కథామంజరి' కి అందించే సేవలకు పారితోషికాలు ఉండవని గమనించగలరు.

కథామంజరి




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథామార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| కథాపుస్తక పరిచయం | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| జ్ఞాపకాల మణిపూసలు | సీతా సుస్మితా | 1 |
| కొత్త నీరు | డా. దారల విజయకుమారి | 7 |
| చేయీ చేయీ కలిస్తే... | డా. మజ్జి భారతి | 14 |
| పైరగాలే నా శ్వాస | శ్రీమతి వేలూరి ప్రమీలాశర్మ | 20 |
| సంక్షేమం | వి. రాజారామమోహనరావు | 25 |
| ద గ్రేట్ ఇండియన్ మిడిల్ క్లాస్ | అంగర శ్రీనివాస రవిశేఖర్ | 28 |
| జంబూక వనంలో ఒకరోజు | కె.వి. లక్ష్మణరావు | 33 |
| అపాయంలో ఉపాయం | రాచపూటి రమేష్ | 37 |
| రిక్షా ప్రయాణం | అర్నాద్ | 40 |
| మడతపేచీ | కీ. శే. భమిడిపాటి కామేశ్వరరావు | 54 |


Cover Page Credit : Gianluca Grisenti, Trento IT

# కథాకీయం

"అయ్యా.. మీ సంపాదకీయంలో సమకాలీన రాజకీయ విషయాలు గాని, మన చుట్టూ జరుగుతున్న ఇతర విషయాల మీద గాని ప్రస్తావన ఉండదు.. ఎందుకనీ? సాధారణంగా పత్రికల్లో వీటి మీద, వారి వారి అభిప్రాయాలను సూటిగా గాని, పరోక్షంగా గాని సంపాదకీయాల్లో చెప్తారుగా, మీరెందుకు వాటి జోలికి పోరు? ఆ మాత్రం సామాజిక స్పృహ, బాధ్యత ఉండాలిగా" అంటూ ఈ మధ్య కొందరు పాఠకమిత్రులు అడిగారు. "ఆ విషయాలు మా కథారచయితలు చూసుకుంటారులెండి!" అంటూ నవ్వుతూ అన్నాను. అర్థం అయినట్టు "అవును కదూ" అంటూ తలాడించి సమ్మతి తెలిపారు.

పురాణకాలం నుండి నేటి వరకు... ఆయా కాలాలలోని స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, దురాచారాలు, సమాజ పరిస్థితులు, ఉద్యమాలు, ఉపద్రవాలు, ప్రభుత్వాలు, వాటి తీరు.. వీటన్నింట్లోనూ ఉన్న మంచీ చెడులను తమ రచనల ద్వారా సమాజానికి తెలియచేస్తున్నది మన రచయిత(త్రి)లే. ఆ అక్షర నిక్షిప్తం వలననే ఆనాటి విషయాలు ఇప్పుడు తెలుసుకోడానికి, అవసరమైన విషయాల్లో జాగ్రత్తలు తీసుకోడానికి వీలవుతున్నది. వాటికి వార్తాపత్రికలు ఉన్నాయిగా అని అనొచ్చు! అయితే వార్తలు వేరు, కథలు వేరు! వార్త విషయాన్ని తెలియచేస్తుంది... కథ హృదయాన్ని కదిలిస్తుంది! గుండెల్లో గూడు కట్టుకుని ఉండిపోతుంది. కథ గురించి మన పెద్దలు చెపుతూ.. "మన ఎదురుగా కనబడుతున్న ఎన్నో సమస్యలపై ఆలోచించి, వాటి మీద కథ వ్రాయాలి. చదివే కథ ఏ కాలంలో జరిగిందో, అప్పటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను కథలో చూపగలగాలి. దేశచరిత్రని చెప్పగలగాలి. చూసిన ఓ సంఘటననో, అనుభవాన్నో ఉన్నది ఉన్నట్లు రాసేస్తే, అది రిపోర్ట్ అవుతుంది. వార్తాపత్రిక చదివినట్టు ఉంటుంది. ఒక్కొక్కసారి అవి చిక్కులు కూడా తెస్తాయి! అందుకే నిజజీవితానికి, సాహిత్యానికి మధ్య సన్నని గీత అనేది ఉండాలి!" అని చెప్తారు.

గడిచిన కాలంలోని విషయాలను, ముందు తరాలవారికి బట్వాడ చేసేది సాహిత్యమే! అది కథ, కవిత, నవల, నాటకం.. ఏదో ఒక రూపంలో మన కళ్ళ ముందు గతాన్ని సాక్షాత్కరింపజేస్తాయి! శతాబ్దాల వెనక్కి వెళ్ళక్కర్లేదు... శత సంవత్సరాల క్రితం, అంటే ఆధునికశకం ఆరంభం నుంచి మొన్న మొన్న సంభవించిన కరోనా ప్రకంపనల వరకు, భూమ్మీద జరిగిన ప్రతీ విషయం ఏదో ఒక సాహితీరూపంలో మన ముందుకు వచ్చింది. నిరక్షరాస్యులు కూడా ప్రతీ విషయాన్ని తెలుసుకోడానికి అవకాశం ఇచ్చాయి! ఎన్నో సమస్యలు ప్రజల ముందుకు తీసుకొచ్చి, వాటికి పరిష్కారాలు కనుగొనటానికి ఈ సాహితీ ప్రక్రియలే సాధనాలుగా పని చేసాయి. ఉద్యమాల నిర్మాణం, తిరుగుబాట్లు, చైతన్యం.. వీటికి సాహిత్యమే ఆయుధంగా పని చేసింది, పని చేస్తుంది కూడా!

అందుకే.. సాహిత్యానికి పెద్దపీట ఉండాలి. కథ, కవిత, పద్యం, గద్యం, నవల, నాటిక, వ్యాసం, విశ్లేషణ.. ఇలా అన్ని ప్రక్రియలకు ఉన్నత సింహాసనమే ఉండాలి!

చివరిగా.. రావిశాస్త్రిగారి మాట జ్ఞాపకం ఉంచుకోవాలి. "రచయిత అన్నవాడు తను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం కలిగిస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉంది! మంచికి హానీ, చెడుకు సహాయం చేయకూడదు!"

రండి.. అందరం కలసి, వచ్చే తరానికి నేటి సమాజ స్వరూపాన్ని అక్షర నిక్షిప్తం చేసి పదిలంగా అందిద్దాం!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



## శ్రీ అర్నాద్

కొందరిని చూడగానే వారి గొప్పదనం ఇట్టే కనబడుతుంది. వారి ప్రవర్తన, మాటాడే తీరు, నడవడిక.. ఇవన్నీ వారి, వారి రంగాల్లో వారి గొప్పతనాన్ని తెలియచేస్తే, మరి కొంతమంది లేని గొప్పతనాన్ని ఈ గుణాల ద్వారా ప్రకటించుకోవడానికి ప్రయత్నం చేస్తారు. బహు కొద్దిమంది మాత్రం సాధారణమైన జీవనం సాగిస్తూ, నిగర్విగా నిరాడంబరంగా ఉంటూనే.. తన చూట్టూ ఉన్న సమాజం గురించి తీవ్రంగా ఆలోచిస్తూ తన పరిధిలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానే సమాజం పట్ల తమ విధిని నిర్వహిస్తూ ఉంటారు. ముఖ్యంగా మన తెలుగు సాహితీ రంగంలో.. సాధారణ జీవనం సాగిస్తూ, నిరాడంబరంగా, నిగర్వంగా, నిశ్శబ్దంగా.. ఎంతో విలువైన, పదునైన రచనలు అందించిన బహు కొద్దిమంది రచయితలలో "అర్నాద్" ఒకరు అని చెప్పాలి. 'ఈయన నిగర్వి, నిరాడంబరులూ. తన గురించి చెప్పుకోడానికి ఇష్టపడరు' అని కారా మాష్టారే కితాబు ఇచ్చారంటే, అర్నాద్‌గారి వ్యక్తిత్వం గురించి వేరే చెప్పనక్కరలేదు. సౌమ్యమైన మాట, నిరాడంబరమైన నడత ఉన్నా, నివురు కప్పిన నిప్పులా ఉంటారు, కాని ఆలోచనలు పేద ప్రజల గురించి ఉంటాయి, సమాజంలో జరుగుతున్న అన్యాయాల చూట్టూ పరిభ్రమిస్తూ, పరిష్కారం గురించి వెతుకుతూ ఉంటాయి.

1972 ఏప్రిల్ నెలలో అర్నాద్‌గారి మొదటి రెండు కథలు "వేలంపాట", "అన్యాయం" రెండు వేరు వేరు పత్రికలలో వచ్చాయి. అందులో "అన్యాయం" కథ చదివి, ఆయన పనిచేసే కంపెనీ యాజమాన్యం సహించలేక, అర్నాద్‌గారి ఉద్యోగం తీసేయడానికి ఉపక్రమించింది. అయితే వారి చీఫ్ ఇంజినీరు గారు సహాయం చేసి, ఉద్యోగం పోకుండా చూడటమే కాకుండా.. "నువ్వు రాయడం ఆపకు. ఉద్యోగం పోయినా సరే కథలు రాస్తూనే ఉండాలి. నీ కలంలో మంచి పదును ఉంది. నీకు మంచి భవిష్యత్తు ఉంది" అంటూ, ఓ పెన్నుని కూడా బహుమతిగా ఇచ్చారు. బహుశ ఆ సంఘటన వలన ఆ కథలో ఉన్న బలమేమిటో, ఆయన రచనలలో ఉన్న పదునేమిటో ఆయనకీ తెలిసింది, పాఠకులకు తెలిసింది.

చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం బాగా అలవాటు ఉన్న అర్నాద్‌గారు, ఓసారి కిరాణా కొట్టు నుంచి పటిక బెల్లం కొని తెచ్చారుట. దాన్ని పొట్లం కట్టడానికి వాడిన కాగితం పడేస్తే, అది తీసుకుని అందులో ఉన్న విషయాన్ని చదివారుట. అది రావిశాస్త్రి గారి 'రాజు–మహిషి' నవల్లోని వర్ధనమ్మ వర్ణణ ఉన్న పేజీ. అ పేజీ చదివిన తర్వాత ఉండబట్టలేక, వెంటనే లైబ్రరీకి వెళ్ళి ఆ పుస్తకం చదివారుట. అలా రావిశాస్త్రిగారి రచనలకు ఆకర్షితులయ్యారు. రావిశాస్త్రి గారి ప్రభావం అర్నాద్‌గారి రచనలలో ఉంటుంది. సాధారణంగా.. ఒంటరిజీవనం గడిపే అర్నాద్‌గారిలో కారా మాష్టారి పరిచయం కొంత మార్పు తీసుకొచ్చింది. మాష్టారి చూట్టూ ఎప్పుడూ సాహితీ వాతావరణం ఉండేది. ఆ వాతావరణం ఆయన్ని మార్చింది. "నా వలన నువ్వు చేడి పోతున్నావేమో నాయానా" అని మాష్టారు అంటే.. "మీరు చెడిపేయడమేమిటి మాష్టారు,

చెడు వైపు జారిపోకుండా నన్ను తీర్చిదిద్దారు” అని అర్నాద్‌గారు అన్నారుట. అలా ఇద్దరు ప్రముఖ రచయితల సాంగత్యముతో ఎదిగిన అర్నాద్‌గారు ఆణిముత్యాల్లాంటి, సుమారు డెబ్బయ్ కథలు వ్రాసారు. మూడు కథాసంపుటాలు, నాలుగు నవలలు వ్రాసారు. ఇప్పటికీ ‘మనసులో మాట’ అనే శీర్షికతో ఫేస్‌బుక్‌లో ఎన్నో విషయాల మీద వ్యాసాలు వ్రాస్తున్నారు. అర్నాద్‌గారి మొదటి నవల “చీకటోళ్లు”ని సినిమాగా ఎ.వి.యమ్. సంస్థవారు 1981 లో “వాడని మల్లి” సినిమాగా తీసారు. సినిమా ఆర్థికంగా విజయం సాధించకపోయినా, రష్యన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఎంపికయింది.

అవార్డులకు, పురస్కారాలకు దూరంగా ఉంటూ, కొద్దిమంది సమకాలిక స్నేహితులతో ముచ్చటిస్తూ.. తన ప్రపంచంలో స్వేచ్ఛగా ఆనందంగా, తను ఇష్టపడే సాహితీ సమావేశాలకు వచ్చి, ఓ మూల కూర్చుని తృప్తిగా ఆస్వాదించే అర్నాద్‌గారిలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. రావిశాస్త్రి గారి రచనల్లో కనబడే శైలి, కథనం, శిల్పం, మాండలిక ప్రయోగాలు రాయగలిగే అతికొద్ది రచయితలలో అర్నాద్‌గారు అగ్రగణ్యులనే చెప్పాలి. భావజాలాలకు, ‘ఇజాలు’ వంటబట్టని స్వేచ్ఛాయుత ఆలోచనలు, భాష మీద పట్టు, విషయ పరిశీలన, పాత్రలలో పరకాయ ప్రవేశం చేయగలిగే ఓ అనూహ్యమైన రచనా శక్తి.. అర్నాద్‌గారికి స్వతహాగా ఉన్నవే.. అవే ఆయన్ని ఓ ఇద్దరు దిగ్గజాల పక్కన నిలబెట్టాయి. వారి సాంగత్యం, సన్నిహితం, వారిని ఓ గొప్ప రచయితగా, అంతకంటే ఓ గొప్ప మానవతావాదిగా పేరు తెచ్చాయి. సాహితీ సంస్థలకు, సభా వేదికలకు దూరంగా ఉండే అర్నాద్‌గారు, అవార్డులు, పురస్కారాలను కూడా తిరస్కరించారు. తాను నమ్మిన సిద్ధాంతాలను స్వయంగా అమలు చేస్తూ, ముక్కు సూటిగా నడచుకునే అర్నాద్‌గారి జననం, బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం, విశ్రాంత ఉద్యోగ ప్రస్థానం అంతా విశాఖలోనే!

అర్నాద్‌గారి పూర్తి పేరు దుంప హరనాథ్ రెడ్డి. ఏ ఇజాలకు తావు ఇవ్వకుండా, తనదైన నిజాయితీతో తన సాహితీ ప్రయాణాన్ని సాగిస్తున్న అర్నాద్‌గారు, రచయితలకు, పాఠకులకు తనదైన “మనసులోని మాట” తో నిరంతరం విలువైన సాహిత్య సంగతులు అందిస్తూ, మంచి బాటలో పయనించడానికి సహాయపడగలరని ఆశిస్తున్నాం! ఈ సంచికకు విశిష్ట అతిథి విచ్చేసినందులకు అర్నాద్‌గారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



## కీ.శే.భమిడిపాటి కామేశ్వరరావు

నవ్వించడం ఒక యోగం!!!

హాస్యానికి ఆయుష్షు.. అతిస్వల్పం! ఒకప్పుడు మనసుల్ని గిలిగింతలు పెట్టి, మనుషుల మొహాలపైకి ఆహ్లాదకరమైన నవ్వు తెప్పించిన 'హాస్యం' కొంతకాలం గడిచాక దానిలోని ఎడ్జ్ ఎండ్ పంచ్... రెండూ కోల్పోవడం... అబ్సలీటూ, స్టేలూ కూడా అయిపోవడం జరిగిపోతుందేమో!

"ఏటీ అల్లప్పుడీ ఆసికం చూసి అంతలాగ పడీపడీ నవ్వీసింది మనవేనేటి" అని మనమే ఆశ్చర్యపోయి ముక్కున వేలేసుకోవడం జరుగుతుంది. దీనికి చక్కటి ఉదాహరణ పాత జానపద సినిమాలలో కనబడే 'అంజిగాడి' హాస్యం. 'కాంతారావు'గారి సినిమా ఏదైనా 'యూట్యూబులో' వెతికి పట్టుకొని, చూస్తే హాస్యం ఎలా ఉండేదో తెలుస్తుంది! సినిమాల్లో హాస్యమే కాదు, సాహిత్యంలో హాస్యం కూడా ఇందుకు అతీతం కాదు. కాలం యొక్క దాష్టీకాన్ని తట్టుకొని నిలబడగలిగే హాస్యరస ప్రధానమైన రచనలు... 'ఛార్ల్స్ డికెన్స్' రాసిన 'పిక్విక్ పేపర్స్' వంటి అద్భుతమైన, అజరామరమైన రచనలు, అరుదుగా అక్కడక్కడా మాత్రమే కనిపిస్తాయి. దానికి కారణం ఏమై ఉంటుందో ఇదమిత్థంగా చెప్పలేం కానీ, కాలం గడిచేకొద్దీ, ఆర్థిక సామాజిక స్థితిగతుల్లో మార్పులు వచ్చేకొద్దీ, ఆ మార్పులు ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసేకొద్దీ... పాఠకుల దృక్పథంలో... ముఖ్యంగా హాస్యాన్ని దృష్టించే విధానంలో సంభవించే మార్పులూ చేర్పులూ దీనికి కారణం కావచ్చని కొంతమంది విజ్ఞుల విశ్వాసం. ఇది ప్రపంచమంతా ఉందని చెప్పాలి!

అయితే, 'ఈ మార్పుల వలన హాస్యం త్వరగా ఉనికి కోల్పోతుందన్న సిద్ధాంతం పూర్తిగా నిజం కాదు సుమా...' అని నిరూపించిన రచయిత ఒకరు ఉండడం, వారు మన తెలుగువారే కావడం మనందరికీ ఎంతో ఆనందాన్నీ అంతకు మించి గర్వాన్నీ కలిగించే విషయం! సమకాలీన సాంఘిక సమస్యలను హాస్యరసానురంజకంగా మలిచిన ప్రజ్ఞాశాలి, పండిత, పామర భేదం లేకుండా అందరితోనూ 'హాస్య బ్రహ్మ' అని ఏకకంఠంతో కొనియాడబడ్డ లబ్ధప్రతిష్టులు శ్రీ భమిడిపాటి కామేశ్వర్రావుగారు.

భమిడిపాటివారు అన్నిటికంటే ముందుగా మంచి నటులు. తరవాత నాటకకర్త, ఆ తరవాత రచయిత. ఫ్రెంచి నాటక రచయిత 'మోలియే' (MOLIERE')చే ప్రభావితం కాబడి, అనేక నాటికలూ, నాటకాలూ రచించారు. తన అభిప్రాయాలకు అభిరుచులకూ అనుగుణంగా రచించిన నాటకాలను, వీరే దర్శకత్వం వహించి, ప్రదర్శింప జేసేవారు.

# కథామార్గదర్శి

20వ శతాబ్దపు పూర్వభాగంలో సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులనూ, ఎదుర్కొంటున్న సమస్యలనూ స్పృశిస్తూ లెక్కలేనన్ని ఆణిముత్యాల్లాంటి కథలు, వ్యాసాలు రాశారు!

ఆయన ఏ ప్రక్రియలో రచన గావించినా హాస్యరస ప్రధానంగానే గావించారు... ఒక్క 'త్యాగరాజు ఆత్మవిచారం' అన్న పుస్తకం తప్ప. ఇందులో మాత్రం త్యాగయ్య కీర్తనలకు చక్కటి తాత్పర్యాలు రాశారు. "ఆయన చేసిన పనల్లా కేవలం తాత్పర్యాలు రాయడమే. అటువంటప్పుడు ఆ పుస్తకం చప్పగా తయారయి ఉండాలి. కానీ అలా కాలేదు. గొప్ప జీవంతో కూడిన పుస్తకంగా తయారయింది. కారణం ఏమిటంటే కామేశ్వర రావుగారు ఆ కీర్తనలలోని భావాన్ని అనుభవించి, 'గొప్ప వాడుక భాషలోకి' అనువదించి రచించారు.ఆ వాక్యాలలో మంచి ధార, ఎంతో ఆర్తి ఉంటాయి" అని రాశారు వెంకటేశ్వర్రావు రెంటాల గారు భమిడిపాటి వారి గురించి రాస్తూ.

కామేశ్వరరావు గారి కథల శీర్షికలు ఎంత తమాషాగా ఉంటాయో అందులో పాత్రల పేర్లు కూడా అంతే తమాషాగా ఉంటాయి. 'ధుమాలమ్మ ఒగాయిత్యం' ఒక కథ పేరైతే ''దోమరాజా' మరో కథ పేరు. 'అయోమార్గం–అభినందనం' ఒక వ్యాసానికి తగిలించిన శీర్షిక అయితే, 'బలరామయ్యగారి ఇంగ్లీషు తమ్ముడు' మరోదాని పేరు. ఇకపోతే 'హోమియోపతీ–ఉమాపతీ', 'కథాకళి పోటీలో రోడ్డుకి మట్టి షీల్డు బహుమతిగా రావడం' "పడి చావడానికి వీల్లేదని ఒక నుయ్యి పూడ్పించేసి మరోదాన్ని (అవసరమైనప్పుడు దూకి చావడానికి వీలుగా) దింపించడం' ఇటువంటి ప్రయోగాలూ, వర్ణనలూ ఒకెత్తైతే కథల్లోని పాత్రలతో వారు పలికించిన సంభాషణలు మరో ఎత్తు. 'ధర్మానికి అధర్మం వచ్చినప్పుడు అధర్మాన్నే ధర్మం చేసుకోవచ్చు.' ఇదొక్కటి చాలదూ మచ్చుకి, అన్నం అంతా పట్టుకొని చూడాలా!

ఉత్తమమైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన మన భమిడిపాటి 1897 లో పిఠాపురంలో జన్మించారు. పాఠశాల విద్యను పూర్తి చేసిన పిమ్మట, పిఠాపురం రాజావారిచ్చే ఉపకారవేతనం పొంది, కాకినాడ పీ.ఆర్. కాలేజీలో గణితంలో పట్టా పొందారు. ఎల్.టి. పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రిలో వీరేశలింగంగారిచే స్థాపించబడిన ఉన్నతపాఠశాలలో గణితశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసి, చివరి రెండు సంవత్సరాలూ ప్రధానోపాధ్యాయునిగా కూడా బాధ్యతలు నిర్వహించి, పదవీవిరమణ గావించారు. వీరు 1958, ఆగష్టు 28 న పరమపదించారు.

అయితే, ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే... తన హాస్యంతో అనేకమంది పాఠకులనూ, ప్రేక్షకులనూ ఆనందసాగరంలో ముంచి తేల్చిన భమిడిపాటివారు మాత్రం పెద్దగా నవ్వేవారు కాదట.

"ఇంతమందిని ఇలా నవ్వించి చంపేసే మీరు మాత్రం, కొంచెమైనా నవ్వకపోవడం... ఎంత అన్యాయం మేస్టారూ?" అని ఎవరో చిన్నప్రశ్నా, అంతకంటే కొంచెం పెద్ద నిందా కలిపి సంధిస్తే, "నేను వడ్డించేవాడ్నే బాబూ! వడ్డించేవాడికి తినడం సాధ్యపడుతుందా, చెప్పు?" అని తిరిగి వాడినే ప్రశ్నించి, ఆనక మౌనం వహించేరట. అదీ పేరడాక్స్!!!

వారికి ఘనమైన నివాళి తెలుపుకుందాం!

**కథామంజరి బృందం**

## రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి కథ "వర్షం"

గాలివాన లాంటి ప్రకృతి వైపరీత్యాలు చాలా కథలకు మంచి నేపథ్యమయాయి. అవి మన మనుగడని ప్రశ్నించే పరిస్థితులను కలిగిస్తే, ఆ తీవ్రత మన ఆలోచనలలో కొత్త మార్పు తెచ్చే అవకాశం ఉంటుందా! ఆలోచనలను మథించగలిగే సమస్యలెదురైనప్పుడు ఒక తోవ కనబడుతుందా?

పాలగుమ్మి పద్మరాజు గారి 'గాలివాన' కథ, రావి శాస్త్రి గారి 'వర్షం' కథ ఆ కోవలోకి చెందినవే.

రాచకొండ విశ్వనాథశాస్త్రి(రావిశాస్త్రి)గారిని, ఆయన రాసిన కథలను గురించి ఎక్కువగా చెప్పుకోనక్కర్లేదు. ఎంతో మంచి సాహిత్యాన్ని అందించిన ఆయన రచనలను మరొక్కసారి మననం చేసుకోవడమే మనం చేయగలిగినది. కథలు రాసేవారికి అవి ఎలా రాయాలో తెలుసుకోవాలంటే రావిశాస్త్రిగారి లాంటి వారి రచనలను క్షుణ్ణంగా చదవాలి. అందులో మెలకువలను అర్థం చేసుకోవాలి. కథకున్న ప్రయోజనమేమిటో గ్రహించగలగాలి. అప్పుడే మరొక మంచి కథను సృష్టిస్తూ తనకంటూ ఒక కొత్త పథాన్ని ఎంచుకోగలుతారు ముఖ్యంగా కొత్త రచయితలు.

ఈ మధ్యనే ఎక్కడో ఒక ప్రముఖ రచయిత పోస్ట్ చూశాను. 'చలం, విశ్వనాథ, శ్రీశ్రీ, రావిశాస్త్రి ...ఈ చట్రంలో మాత్రమే తెలుగు సాహిత్యాన్ని ఇంకా చదువుతూ, చూస్తూ, చర్చిస్తూ వుంటే ఇదంతా పెద్ద కుట్ర అనిపించడం లేదా?' అని ప్రశ్న. అంటే ఆయనకు తనను, తన సమకాలీకులను ఎవరూ గుర్తించడం లేదని బాధా? అసలు కుట్ర అనడం ఒక కుట్రేమో అనిపిస్తుంది. ఆయన మాటలెలాగున్నా, ఆ పాత రచయితల గొప్పదనాన్ని తగ్గించగలరా? సాహిత్యప్రియులు తరవాత తరాల రచయితల సాహిత్యంలో విశిష్టతను గుర్తించడం లేదని ఎందుకనుకోవాలో అర్థం కాదు. పాత తారాన్ని తల్చుకోవడం కుట్ర కాదు. ఏ కథలలో అయినా మనం రచయిత చూపించగలిగే ఒక మథనం ఉంటే ఆ తీవ్రత పాఠకుడి మనసులో ఉండిపోతుంది. రావిశాస్త్రి గారి కథలలో మనం చూడగలిగేదదే.

'వర్షం' కథ ఆంధ్ర పత్రిక, 27–మే–1959 సంచికలో ప్రచురించబడింది మొదటిసారిగా.

'వర్షం దబాయించి జబర్దస్తీ చేస్తోంది' అన్న వాక్యంతో మొదలవుతుంది కథ. అలాంటి వాక్యాలు రావిశాస్త్రి గారి సొంతం. బలవంతాన పెళ్ళిచూపులకెళ్ళి తిరిగి కలకత్తా వెడుతూ ఆ చిన్న ఊర్లో తీవ్ర వర్షం వల్ల ఒక టీ పాకలో ఆగి, చిక్కుకు పోతాడు సిటీబాబు అనబడే పురుషోత్తం. రైలుకి టైమయిపోతోంది. వర్షం వల్ల పూర్తి రక్షణ ఇవ్వలేని ఆ పాక తప్ప ఇంకో ఆసరా లేదు. దుకాణం తాత చెప్పే మాటలు పురుషోత్తాన్ని ఇంకా నీరస పెట్టేస్తున్నాయి. ఓ మూడ్రోజుల వరకూ వర్షం ఆగదని, స్టేషన్ అక్కడనుంచి ఓ రెండు కోసుల దూరముందని అంటున్నాడు తాత.

ఆలోచనల్లో మునిగి పోయాడు పురుషోత్తం. తను చూసిన పిల్ల చూపుల్తోనే ఏదో ప్రశ్న వేసింది. అదేమిటో తెలీదు స్పష్టంగా. అసలు తను వెంకటాపురం వచ్చి పిల్లని చూడడానికి మేనమామ బలవంతం ముఖ్య కారణం.

బొగ్గుల కోసం వెళ్ళిన తన మనుమడు ఇంకా రాలేదు. తాతలో ఆందోళన స్పష్టంగా కనబడుతోంది. ఈ వానలో ఎలా వస్తాడో అని కలవరం.

పెళ్ళి చూపుల తరువాత తను రెండెడ్ల బండిలో వెడుతున్నప్పుడు ఆ పిల్ల వాకిట్లోంచి తనని చూసిన చూపులు ఇంకా తనలో గోతులు తవ్వుతున్నాయి. తను బక్కపల్చగా బరువు తక్కువగా ఉన్నాడనా? కొద్ది రోజుల క్రితం తను జబ్బు పడినప్పుడు ఆసుపత్రిలో నర్సు తన బరువు చూసి త్వరలో కోలుకుంటావులే అన్నమాటలు గుర్తుకొస్తున్నాయి.

పాకంతా కారుతోంది. ట్రెయిన్ రావడానికి రెండుగంటల వ్యవధి కూడా లేదు. బస్సులు రావంటాడు తాత. ట్రెయిను కూడా రాదేమో అంటాడు. తాతకు కూడా దిగులేస్తోంది మనుమడు రాలేదేమని. భీభత్సం చేస్తోంది వాన.

తన గురించి ఆలోచిస్తే ఏ గాలికి ఆ గాలిగా బతికాడు. కలకత్తా రమ్మంటే వెంటనే వెళ్ళాడు. 'పెళ్ళిచూపులకు పో' అంటే అడివిపాలెం వచ్చాడు. చిన్నప్పటినుండి చదువుకో అంటే చదువుకున్నాడు. బుద్ధిగా ఉండడం మంచిదంటే బుద్ధిగా ఉన్నాడు. తన జీవితమంతా ఒకరు చెప్తే తను చేసిందే. తనంతట తానుగా ఆలోచించింది లేదు. మరి తనిక్కడే ఉండిపోతాడా? కలకత్తా వెళ్ళలేడా?

అనుకునేంతలో తాత కేకలు వినిపించాయి. 'ఆ, వస్టాండు, హదిగదీ, రేసుకుక్కే! పొ్రా, పొ్రా' అంటూ. ఓ కుర్రాడు భుజాన ఓ మూట వేసుకుని పరుగెత్తి వస్తున్నాడు. వస్తూనే ఆ బొగ్గుల మూట కిందికి దించి 'ఒచ్చీసినా తాతా' అంటూ. 'వర్షంలో సస్తే ఏటి సేద్దునురా?' అన్న తాతకి సమాధానంగా ఆ పన్నెండేళ్ల మనవడు చెప్పిన సమాధానం 'ఒరసమా! మన సంగత్తెల్దేటి తాతా! ఒరసాన్ని సంపిడిసిపెడతాడీ పోతరాజు' అని.

ఈ మాటలు వింటూ నిశ్చలుడై నుంచిండి పోయాడు పురుషోత్తం. రచయిత మాటలలోనే 'అంతవరకూ వెంట తరిమిన పెళ్ళి కుమార్తె చూపు, ఆనాటి నర్సు నవ్విన లేనవ్వు, చిగిర్చిన మామిడి మొక్క, ఎగసిన కొబ్బరి చెట్టు; ఈదురు గాలి, హోరున వర్షం, నీటిలో నిప్పు, మనిషిలో జ్వాల — అన్నీ అతనికి అర్థమయాయి. అర్థయుక్తంగా స్పష్టంగా, తెర మీద కథలా అతనికి అంతా బోధపడింది.'

మనవడి మత్తు లోంచి బయటపడి పురుషోత్తం ఎక్కడున్నాడో చూసిన తాతకి అల్లంత దూరాన చీకట్లో ఈదురు గాలికి ఎదురుగా, వర్షాన్ని సరకు చేయకుండా, తెరల్ని ఛేదించుకుంటూ చకచకా ముందుకు వెళ్తున్నాడు పురుషోత్తం స్టేషన్ వైపు. అతన్ని చూసి 'సెబాసా' అని మెచ్చుకున్నాడు దుకాణం తాత.

అక్కడితో కథ ముగుస్తుంది. పాఠకుడికి రచయిత నీతులు చెప్పలేదు. తన పాత్ర ద్వారా, తన వ్యక్తిత్వాన్ని తానే నిర్వచించుకోవాలని చెప్పకుండా చెప్పారు. చాలామంది ఇంకోరిగా బతుకుతూ ఉంటారు.. వారి వారి మనసు పరిపక్వత ఆధారంగా! ఆ విషయం తమకే అవగాహనలోకి వచ్చేంతవరకూ అలా కొనసాగుతూనే ఉంటుంది.

ఇక కథలో సందర్భాలనూ, పరిస్థితులనూ కళ్ళకు కట్టేలా చెప్పగలగడం ఆయనకే చెల్లు. వర్షాన్ని, తడిసి ముద్దౌతున్న దుకాణాన్ని, కొత్త పంట్లాం, కొత్త చొక్కా వేసుకున్న పురుషోత్తమాన్ని, దేని గురించి చెప్పినా పాఠకులు ఆ వర్ణనలు అనుభవించేలా చేయడం రచయిత చేసే మ్యాజిక్! ఈ క్రింది ఉదాహరణ చూడండి. ఇది పురుషోత్తం చూసిన మునిసీబు గారి పిల్లను చూసిన సందర్భం.

## కథా పరిచయం


'......ఇంటివెనక మావిడి చెట్టొకటి చీకటిగా ఆకుపచ్చగా కనిపిస్తోంది. దాని పక్కనే కొబ్బరి చెట్టొకటి నిటారుగా గంభీరంగా మామిడిచెట్టు కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా. అస్తమించడానికి తటపటాయిస్తూ దూరాన్న సూర్యుడు ఆకాశంలో అవతల గుమ్మం దగ్గర నిల్చున్నాడు. అంతలో గది తలుపులన్నీ గప్పున తెరచి ఆకాశమంతటా కుంకాన్నెవరో కుమ్మరించేరు. అంతట చెట్టున మామిడిచిగుళ్ళు, చెట్టున కొబ్బరి కొమ్మలు, సంతోషంతో మూగనవ్వు నవ్వేయి. ఆరవేసిన తెల్లచీర.. వెలుగుని వరండా అంతటా ఎర్రగా గుప్పున వెదజల్లింది. మెరిసే ఇత్తడి గిన్నెలు రాగి రంగు కలుపుకొని బంగారంలా మెరిసేయి. తులసికోటలో తులసి మొక్క నర్తకిలా నిల్చొంది.'

ఈ కథలో ఇజాలు లేవు. మానవ నైజాలే ఉన్నాయి. కథావస్తువు, కథ చెప్పిన తీరు, భాష, అవసరమైన చోట వాడిన మాండలీకం, రావిశాస్త్రి గారివే అన్న స్ఫూర్తి పాఠకుడికి రాకుండా ఉండదు. ఎందుకంటే ఆయన మార్కులవి. 65 ఏళ్ళ తర్వాత కూడా ఈ కథ నిలిచిందంటే నిలవదూ?

ఇలాంటి మంచి కథకుల్ని తల్చుకోవడం ఆధునిక కథకుల్ని తక్కువ చేయడం ఎందుకవుతుంది?

'వర్షం' కథ కథానిలయం లో దొరుకుతుంది.

***పరిచయకర్త – శాయి రాచకొండ, హూస్టన్***




## మేడ్ ఫర్ ఈచ్ అదర్స్

ప్రముఖ రచయిత శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు గారి హాస్యకథలు – వివిధ పత్రికలలో ప్రచురింపబడిన 30 హాస్యకథల సమాహారం ఈ "మేడ్ ఫర్ ఈచ్ అదర్స్". ఈ కథలలో కొన్ని బహుమతులు వచ్చిన కథలు కూడా ఉన్నాయి. చాలా ఆహ్లాదపరిచే ఈ కథల సంపుటి సెప్టెంబర్ 11, 2024 విడుదల అయింది. వెల రు.150/–

ప్రతుల కోసం

సాహితీ ప్రచురణలు,
33–22–2, చంద్ర బిల్డింగ్స్,
సి.ఆర్. రోడ్డు, చుట్టుగుంట,
**విజయవాడ – 520002**
✆ 0866–2436642 | 8121098500
Email: sahithi.vja@gmail.com

## ఆంధ్రభారతి

*1910–15 కాలంలో అన్ని వాదాల రచయితల రచనలతో వెలువడిన సాహిత్యపత్రిక ఇది! నిజానికి పోషకులు, రచయితలే గాని ఈ పత్రికకు సంపాదకులు లేరు. ఆధునిక తెలుగు కథానికగా గుర్తింపు పొందిన గురజాడ వారి "దిద్దుబాటు" కథ ఆంధ్రభారతి 1910 ఫిబ్రవరి సంచికలో వచ్చింది. ఆధునిక సాహిత్యానికి పూర్తిగా మద్దతు ఇచ్చిన ఈ పత్రికలో అలనాటి "ముత్యాల సరాలు (గురజాడ), హృదయ శల్యం (మాడపాటి హనుమంతరావు)" ఈ సంచికలలో ప్రచురింపబడ్డాయి. క్రమక్రమంగా భాషలో వచ్చిన మార్పులో ఆంధ్రభారతి పోషించిన పాత్ర చాలా ప్రస్ఫుటంగా కనబడింది. భాషకి, దేశానికి సేవలందించాలనే లక్ష్యంతో ఆరంభింపబడిన అలనాటి ఎన్నో సంచికలు, దేశాన్ని జాగృతం చేయడానికి మార్గదర్శకాలయ్యాయి.*

# జ్ఞాపకాల మణిపూసలు

సీతా సుస్మితా

> ***"అమ్మ ఒడి నుంచి బయటకు దూకి ప్రపంచాన్ని చూడాలనే ఉత్సాహం వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతుంది. అసలు జీవితమంటే బాధ్యతలని తెలిసి, అవి నెరవేరుస్తూ ఒక స్టేజిలో ఏదీ మనకి సంతోషాన్నివ్వదు. అప్పుడు మనల్ని అక్కున చేర్చుకుని, అనునయించేది.. మన పల్లె తల్లి, ప్రకృతి,***
> ***'మన' అనుకునే కల్మషం లేని మీలాంటి నలుగురు!!"***

విమానాశ్రయంలో తన భర్త, పిల్లలకు ఆనందంతో చేతులు ఊపుతూ వీడ్కోలు పలుకుతూ మనసులోనే వారికి కృతజ్ఞతలు చెప్పుకుంది నీరజ.

గగనతలంలో విహరిస్తున్న నీరజకి, తన ఊరిలోనున్న వారందరితో గడపబోయే రోజుల్ని తలుచుకుంటేనే సీతాకోకచిలుకలు పరిగెత్తుతున్నట్టు గుండెలో గిలిగా, ఆహ్లాదంగా ఉంది.

బసవన్నపల్లి!!

ప్రకృతితో ఆప్యాయంగా స్వాగతం పలికే పల్లెటూరు! మధురమైన జ్ఞాపకాలను అందించి వీడ్కోలు పలికే అందమైన ఊరు!

నీరజ కారుకి డబ్బులు ఇచ్చేసి, ఊరి మొదట్లోనే దిగింది. ఊరికి మొదట్లోనే ఊగుతున్న చింతచెట్ల గాలి చల్లగా తాకుతూ సేదతీర్చింది. చిన్నతనంలో లేత చిగురు కూడా వదలకుండా దూసి తినేవాళ్ళు, ఆ పులుపు తలుచుకోగానే పళ్ళు జివ్వుమన్నాయి. అక్కడ నుంచి కాస్త ముందుకు నడిచిందో లేదో, దారికి కుడి పక్కగా కొన్ని అడుగుల దూరంలో ఒక బావి కనిపించింది. ఆత్రుతగా వెళ్ళి చూసింది, కానీ అదంతా ఎండిపోయిన ఆకులతో, మట్టితో నిండిపోయి ఇప్పుడు గుంట మాత్రమే మిగిలింది.

చిన్నప్పుడు మట్టి రోడ్డు కిందకుండి, బావి ఎత్తులో ఉండేది. మట్టి బావి కావడంతో అందులో నుంచి యంత్రకప్పలు, తేళ్ళు, తాబేళ్లు వస్తాయని దాని పక్కకు వెళ్ళనిచ్చేవారు కాదు. ఒక ఫోటో తీసుకుని, నడక కొనసాగించింది.

పసుపు చేలు, వరి నాట్ల మధ్య నడుచుకుంటూ జ్ఞాపకాల గని తెరిచింది.

రాంబ్రహ్మంగారి ముక్కుపుడక, సూర్రావు బాబాయితో కొనిపించుకున్న రేగు వడియాలు, సేమ్యా ఐసు, అల్లరి స్నేహితులు.. ఇలా ఒక్కో జ్ఞాపకంతో తను ముందుకెళ్తుంటే, దూరం తరిగి ఊరు దగ్గర పడింది. మొదట్లోనే అంతెత్తున ఠీవిగా నుంచుని అభయమందించే పవనసుతుడికి నమస్కరించుకుని, సరాసరి తన పిన్ని ఇంటి గేటు తీసింది.

ఎదురుగా బియ్యం చెరుగుతూ, 'ఎవరా' అనుకుంటూ, వెంటనే గుర్తుపట్టి ఆశ్చర్యంతో చూస్తున్న కుసుమ పిన్నిని అమాంతం హత్తుకుని కాసేపు అలా నిలబడిపోయింది.




నీరజ మనసెరిగిన కుసుమ పిన్ని, "మరేం పర్లేదులే" అన్నట్టు ఆమె వెన్ను ఆప్యాయంగా నిమిరింది. ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం, పిల్లల చదువులు, ఉద్యోగ బాధ్యతలు వీటన్నిటి వలన అమెరికా వెళ్ళిన పదేళ్లలో ఒకటి రెండుసార్లే వచ్చింది నీరజ. ఆఖరిగా తల్లి పోయినప్పుడు నాలుగేళ్ల క్రితం వచ్చింది, ఆ తర్వాత ఇదే రావడం. ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా తీరుబడిగా ఊరు రావడం మాత్రం కుదరలేదు. తను ఏడో తరగతిలో ఉన్నప్పుడు ఈ పల్లెను వదిలెళ్ళింది.

వారిద్దరినీ అలా చూసిన చంద్రంగారు, "ఏం తల్లీ! మనిల్లు ఇన్నాళ్ళకి జ్ఞప్తికి వచ్చిందా?" అంటూ నీరజ తల నిమిరారు.

"బాబాయ్!!" అంటూ ప్రేమగా ఆయన చేతిలో చేయివేసి ఇల్లంతా కలయచూసింది.

"మన ఇల్లు" అన్న ఆయన మాటలను, తాతయ్య ఉన్నప్పుడు ఎలా ఉందో ఇప్పటికీ అలానే చెక్కుచెదరకుండా ఉన్న ఆ ఇంటిని చూసి, 'జానకిరామయ్యగారి వారసత్వం నిలిచేది చంద్రంతోనే అని అందరనేది నిజమే కదూ' అనుకుంది.

★★★

కుసుమ పిన్నినడిగి చిన్నప్పటి ఆల్బమ్ తెరిచింది. పెరట్లో పండు వెన్నెల వెలుగులో నులకమంచం మీద కూర్చుని, పున్నాగపూల సువాసనలు ఆఘ్రాణిస్తూ, అవన్నీ తిరగేస్తుంటే, ఆ అనుభూతులన్నీ స్పష్టంగా కళ్ళముందు కదలాడుతున్నాయి నీరజకి. అందులో ఉన్నందరినీ గుర్తుచేసుకుంటూ, వారితో అనుబంధాన్ని, సరదా కబుర్లను పిన్నితో పంచుకుంది.

కాముడు మామ్మ ఫోటో చూసి, పిన్ని మౌనం గమనించిన నీరజ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏయ్ పిచ్చిపిల్లా! ఆవిడకి టైమయిపోయింది అంతే." అన్నది ఓదారుస్తూ.

"కాదు పిన్నీ! చిన్నప్పుడు మన పందిట్లో మంటలంటుకున్నప్పుడు అందరూ ఎవరి హడావుడిలో వారుంటే, భయంతో వణికిపోతున్న నన్ను కాముడు మామ్మే ఎత్తుకుని, పరుగున వాళ్ళింటికి తీసుకెళ్ళి తడిగుడ్డ పెట్టి, ఆ రాత్రంతా సపర్యలు చేసింది. పొద్దున్నే లేవగానే మెళ్ళో తాయెత్తు కడుతూ, 'అమ్మడూ! ఆపదొస్తే భయపడకుండా శివంగిలాగా ధైర్యంగుండాలి' అని చెప్పింది. నేను బదులుగా, 'నీకేం ఇవ్వను మామ్మా?' అనడిగితే, నా బుగ్గలు పుచ్చుకుని, 'రేపెప్పుడైనా నేను మంచంలో ఉంటే నన్ను పలకరించడానికి రా అమ్మడూ' అంది!" అంటూ కుసుమ పిన్ని ఒడిలో తల పెట్టుకుని ఏడ్చింది నీరజ.

కొంతసేపు సేద తీర్చుకున్న తర్వాత.. "మామ్మలానే నా బాల్యంతో ముడిపడిన కొందరు మెల్లగా నిష్క్రమిస్తున్నారు, అలా నా బాల్యం మొత్తం కనుమరుగవ్వకముందే అందరినీ కలుసుకోవాలి!" అంటున్న నీరజని చూస్తుంటే, కుసుమకి కూడా కన్నీరు ఆగలేదు.

★★★

ఉదయాన్నే వేడివేడి కాఫీ గ్లాసు పట్టుకుని వంటింటికి, పెరడుకు మధ్య గడప దగ్గర కూర్చుంది.

ఎంతో సుపరిచితమైన గోమాతల గణగణలు, పక్షుల కిలకిలరావాలు, ఇరుగు పొరుగమ్మల అరుపులతో కూడిన కబుర్లు.. అన్నీ వీనులవిందుగా ఉన్నాయి.

"బాగున్నారా అమ్మాయిగారూ?" మామిడి కాయలు అరుగు మీద పెడుతూ అడిగాడు చంటి.

"చంటివి కదూ, ఎలా ఉన్నావురా? అయినా అమ్మాయిగారని కొత్త పిలుపేమిటి?" ఆనందాశ్చర్యాలతో అడిగింది నీరజ.

"చాన్నాళ్ళ తర్వాత కనపడ్డారు, ఇప్పుడు ఎంతటి స్థాయిలో ఉన్నారో ఏమో!" అంటూ కిసుక్కున నవ్వాడు.

అతని జబ్బ మీద గట్టిగా చరచి, "అవునురా చాలా సమయమే పట్టింది, మళ్ళీ మిమ్మల్నందరిని కలుసుకోడానికి! అయినా నువ్వు పొలంనుంచి రావడమేంటి? చదువుకున్నట్టున్నావు, ఉద్యోగం చేయట్లేదా?" అడిగింది నీరజ.

"చదువా! మీరిక్కడనుంచి వెళ్ళిపోయినప్పుడే మా చదువూ అటకెక్కింది నీరజమ్మ. ఇంక ఉద్యోగం ఎక్కడనుంచొస్తుంది? చంద్రం అయ్యగారి చలవతో మన పొలాలే కౌలు చేసుకుంటున్నాను." బాయిలర్లో పుల్లలు సర్దుతూ చెప్పుకొచ్చాడు.

ఆ మాటలు విన్న నీరజ బాల్యంలోకి వెళ్ళింది.

"అమ్మాయిగారు నాకు ఈ లెక్కలన్నీ నేర్పిస్తారు కదూ!"

"నువ్వేం దిగులు పడకురా, నీకు అర్థమయ్యేలా చెప్పే పూచీ నాది."

ఈ మాటలు నీరజ చెవిలో పదేపదే వినిపిస్తుండగా, "మీరు దగ్గరుండి నన్ను చదివించినన్ని రోజులు బానే చదివానమ్మా, మీరెళ్ళిపోయారు, ఈ పల్లెలో మమ్మల్నంత శ్రద్ధగా పట్టించుకునేవారు లేక, నా నుంచి చదువు కూడా దూరమైపోయింది." వేడినీళ్లు తోడుతూ చెప్పాడు చంటి.

“అవునురా! నీకు చదువు మీద ఆశలు కల్పించింది, చదవమని దగ్గరుండి చదివించింది నేనే! కానీ అలా మధ్యలోనే వదిలెళ్ళిపోయాను!” లోలోపల బాధపడుతూ అంది నీరజ.

“నీ పిల్లలు?” అంటూ తానే మళ్ళీ అడిగింది.

“ఒక్కత్తే కూతురు, బళ్ళో వేసాను.” చెప్తుంటే అతడి కళ్ళు మెరిశాయి.

అతని వైపు మెచ్చుకోలుగా నవ్వింది నీరజ.

“సరే పద, అలా ఊరంతా పలకరించొద్దాం.” అని బయలుదేరింది.

అందరినీ కుశలమడుగుతూ, చిన్ననాటి స్మృతులతో కబుర్లాడుకుంటూ ఆఖరికి ఊరి గ్రంథాలయం దగ్గరికి వెళ్లారు. దాని పరిస్థితి చూసిన నీరజ మనసు చివుక్కుమంది.

నీరజ వాడిపోయిన ముఖం గమనించిన చంటి, “మనం సమయం మర్చిపోయి ఎన్నో కథల పుస్తకాలు, చరిత్రలు చదువుతూ కాలం గడిపిన గ్రంథాలయం!” అన్నాడు.

“అప్పట్లో చిన్న స్లాబు గదే అయినా చెట్లతో పచ్చగా, చూడముచ్చటగా ఉండేది. ఇప్పుడు వెలసిపోయి నల్లటి కప్పు మాత్రమే కనిపిస్తుంది!” అన్నది నీరజ.

“ప్చ్, దీన్ని పునర్నిర్మించడం కోసం ఎవరూ ముందుకు రావట్లేదు.” అని వాపోయాడు.

దాని గత వైభవాన్ని తలుచుకుంటూ ఇంటికి చేరింది నీరజ.

★★★

సాయంత్రం తన బాల్యస్మృతులలో ఉన్న ఆత్మీయుడిని కలవడానికి వెళ్ళింది నీరజ.

అదొక చిన్న పెంకుటిల్లు! ఏళ్ల క్రితం ఆ ఇంట్లో అడుగు పెడుతూనే పేడ వాసన వస్తూ పశువుల అంబాలు, కోళ్ల గంపలు, కట్టెల పొయ్యి దర్శనమిచ్చేవి. ఈనాడు ఆ ఇల్లు మాసిపోయిన పెంకులతో పల్చగా ఉంది. లోపలికి వెళ్తూనే, “సూర్రావు బాబాయ్!!” అని పిలుస్తూ వెళ్ళి, అతని పక్కన కూర్చుంది.

“ఎవరూ!!” అని కళ్లద్దాలు సరిచేస్తూ పరికించి చూశాడు.

“పది రూపాయిలు సంపాదిస్తే నాలుగు రూపాయిలు దాచుకోమన్నావుగా. ఇదిగో దాచుకుని నీ కోసం ఇది తెచ్చాను.” అని అతని చేయి పట్టుకుని, చేతిలో ఒక అందమైన పర్సు పెట్టింది.

“ఓ! నీరజమ్మా!!” అని ఆమె చేతి మీద తడుతూ, కళ్ళు తుడుచుకున్నాడు.

“మీ ఇంటి పాలేరుని కూడా ఇంకా గుర్తుపెట్టుకున్నావా నీరజమ్మ? తాతగారి గుణాలను పుణికి పుచ్చుకున్నావు, ఎలా ఉన్నావు తల్లీ? చాలా సంతోషం తల్లీ, చిన్నప్పుడెప్పుడో చెప్పిన మాటల్ని గుర్తుపెట్టుకుని ఇక్కడిదాకా వచ్చావు.” అంటూ పర్సుని ఆత్మీయంగా తడిమాడు.

“చిన్నప్పుడు నువ్వు చీటికిమాటికి బొడ్లో దోపిన సంచీలో నుంచి డబ్బులు తీసిచ్చేవాడివి, ఒకటే చుట్ట కంపు! అప్పుడు నా దగ్గరున్న డబ్బులతో కొనిస్తానంటే, నువ్వు సంపాదించిన తర్వాత కొనివ్వమన్నావు, నేనే చాలా ఆలస్యం చేశాను. పొదుపు పాఠాలు నేర్పిన నిన్నెలా మర్చిపోతాను బాబాయ్! అయినా ఇందులో నీ చుట్టలు సరిపోవు, జాగ్రత్త మరి!” అని నవ్వింది.

సూర్రావు బాబాయి కూడా పెద్ద పెట్టున నవ్వేశాడు.

★★★

మర్నాడు పొద్దున్నే ఇంటిముందు వసారాలో సర్పంచ్, మరో ఇద్దరు పెద్దమనుషులు కలసి చంద్రంతో కూర్చుని ఏవో ఊరి పనుల గురించి చర్చిస్తున్నారు.

“బాబాయి! మన గ్రంథాలయం బాగుచేయిద్దాం, పిల్లలు సమయం గడిపేది అక్కడే కదా!” అన్నది నీరజ.

“అంటే పాపాయిగారు అదీ... ఇప్పటికిప్పుడంటే కష్టం కదండీ! పైగా ఈమధ్యన పిల్లలు ఫోన్లట్టుకుని తిరుగుతున్నారు కానీ, పుస్తకాలు ఎవరు చదువుతున్నారమ్మా. మన పల్లెలు కూడా అభివృద్ధి చెందుతున్నాయి మరి!” జబ్బలు చరుచుకున్నాడు సర్పంచ్.

“అది అభివృద్ధి అనుకుంటే పొరపాటే మామయ్య. మన పల్లెల చదువులో మానసిక ఉల్లాసం ఉంటుంది, అది వారికి దూరం కానివ్వకూడదు. ఖర్చు నేను పెట్టుకుంటాను, అయితే దానికి లైబ్రేరియనుగా మాత్రం చంటినే నియమించాలి. దాన్ని సరిగా చూసుకునే తగిన వ్యక్తి చేతిలో పడితే పిల్లల భవిష్యత్తు బాగుపడుతుంది!” అని కోరింది నీరజ.

ఆమె మాటల్లో ఎంతోకొంత వాస్తవం ఉండడంతో, అందరూ “ సరే” అన్నారు.

★★★

రెండురోజుల్లో నీరజ ఆన్లైన్లో రంగురంగుల పెయింట్లు, పిల్లలకి ఆకర్షణీయంగా ఉండే బొమ్మల స్టిక్కర్లు, అలంకరణ సామగ్రి, ఇంకా కొన్ని తెలుగు, ఇంగ్లీష్ కథల పుస్తకాలు వగైరాలన్నీ తెప్పించి సిద్ధం చేసింది.

నీరజ, చంటితో పాటు ఇంకొందరు స్నేహితులు పూనుకుని గ్రంథాలయం లోనున్న పుస్తకాల బూజు దులిపి, వాటిని చక్కగా అమర్చి, దానికి పూర్వ వైభవం తెచ్చారు.

ఓనమాలు, ఆల్ఫాబెట్స్‌తో పాటు రకరకాల బొమ్మలతో పెయింటింగ్ చేశారు.

“ఎగిరే గాలి పటం నువ్వు... దానికి దారం చదువు!”

“రారండోయ్ రారండోయ్ బుజ్జాయిలు, చదవండి అబ్బురపరిచే పంచతంత్ర కథలు!”

“ఎదురుచూస్తున్న మహనీయుల గాథలు, తెలుసుకుని మీరంతా కావాలి బాధ్యతగల పౌరులు!”

ఇటువంటి చక్కటి సూక్తులతో, చూడగానే పిల్లలు ఆకర్షితులయ్యేలా కళాత్మకంగా మలిచారు గ్రంథాలయాన్ని!

★★★

మర్నాటి సాయంత్రం కంసాలి రాంబ్రహ్మం ఇంటి ముందు ఆగారు కుసుమ, నీరజ. పెద్ద పెద్ద దూలాలతో కట్టిన మండువా ఇల్లది. రెండువైపులా పెద్ద అరుగులతో, ఒక అరుగు మీద బరువైన లెడ్జర్తో రాంబ్రహ్మం గారుండేవారు. ఎంతో కళగా ఉండే ఇల్లు ఇప్పుడు వెలవెలబోతుంది. లోపలికి వెళ్ళగానే ఆయన చేతులు పట్టుకుని, “బాగున్నారా రామబ్రహ్మం గారు?” అనడిగింది.

గుర్తుపట్టని ఆయనకి, “ముప్పై ఏళ్ల క్రితం మీరన్నారని పంతంకొద్దీ ముల్లుతో ముక్కు కుట్టుకున్నాను, దానికి బహుమతిగా ముక్కుపుడక చేసిచ్చారు!” అని చెప్తుండగా... “మా జానకిరామయ్య మనవరాలివి కదూ! ఏ మాటకామాట చెప్పుకోవాలమ్మాయ్, నీ తర్వాత మళ్ళీ అంత సాహసం చేసినవారిని చూడలేదనుకో.” అంటూ నవ్వేశాడాయన.

“మీరు చేసిచ్చే నక్షత్రపు పుడక ముందు ఎంతటి సాహసమైనా తక్కువేనండి. ఆనాడు మీరు ఊరికే చేసిచ్చిన ఆ అమూల్యమైన అందానికి ఇప్పుడు బదులు తీర్చుకుంటున్నాను.” అని చెప్పి బాగ్లోనుంచి రేమండ్ కోటు తీసి ఆయన మీద వేసింది.

అది గమనించిన ఆయన, “ఆహా! నాకు ఈ కోటంటే ఇష్టమని సరదాగానే అడిగినా, భలే గుర్తుపెట్టుకుని తెచ్చావు. నిజంగా నాకు మహా గొప్ప బహుమానంగా నిలిచిపోతుందిది!” అని చిన్నపిల్లాడిలా సంబరపడిపోయాడాయన.

★★★

అక్కడనుంచి వచ్చిన నీరజ మనసు ఇప్పుడు కాస్త తేలికగా ఉంది. రాత్రి పిన్నితో మనసు విప్పి కబుర్లు చెప్పింది.

“నేనిక్కడకి రావడానికి కారణాలు ఇవే పిన్ని. అందరూ ఇంకా నన్ను జానకిరామయ్యగారి మనవరాలిగానే గుర్తుపెట్టుకున్నారు. ఎప్పటికీ మన ఊరు, మీరందరే నా మొదటి ప్రాధాన్యతలుగా ఉంటారనుకున్నాను, కానీ చదువు నెపంతో నాన్న నన్ను మనూరికి దూరం చేశారు! వయసు పెరిగేకొద్దీ కొత్తవి చేరి, ఇవన్నీ వెనక్కెళ్ళిపోయాయి. కానీ నా జ్ఞాపకాల దొంతరలో మాత్రం ఎప్పుడూ ముందున్నాయి! చిన్నతనంలో తెలిసి తెలియక చేసిన చిన్నచిన్న ప్రమాణాలు నెరవేరిస్తే, ఆ ఆత్మ సంతృప్తి ఎలా ఉంటుందో ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను!” అంటూ పిన్ని మెడ చుట్టూ చేతులు వేసింది.

నీరజ మాటలు విన్న చంద్రం, “మనసంతా కల్లోలంగా ఉన్నప్పుడు లాలించే మెత్తని ఒడి ఈ పల్లె తల్లి!” అన్నారు ప్రశాంత వదనంతో!

“అతిశయోక్తి కానేకాదు బాబాయ్. అమ్మ ఒడి నుంచి బయటకు దూకి ప్రపంచాన్ని చూడాలనే ఉత్సాహం వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతుంది. అసలు జీవితమంటే బాధ్యతలని తెలిసి, అవి నెరవేరుస్తూ ఒక స్టేజిలో ఏదీ మనకి సంతోషాన్నివ్వదు. అప్పుడు మనల్ని అక్కున చేర్చుకుని, అనునయించేది.. మన పల్లె తల్లి, ప్రకృతి, ‘మన’ అనుకునే కల్మషం లేని మీలాంటి నలుగురు!!” అంటూ తన పిన్నీ బాబాయి మధ్యన కూర్చుని వారి భుజం మీద తలవాల్చుకుంది.

తమ మూలాలు, బంధాల పట్ల నీరజకి ఉన్న దృక్పథం, జానకిరామయ్యగారి వారసత్వాన్ని బాధ్యతగా తీసుకున్న నీరజని చూస్తుంటే, చంద్రం మనసు ఉప్పొంగిపోయింది.

# కొత్తనీరు

డా. దారల విజయకుమారి

✆ 9177192275

> ***"మా నాయన సగినం చెప్పిస్తానన్నాడు"***
> ***"సగినం ఎందుకయ్యా"***
> ***"ఎందుకిట్ల ఏసిన పంట ఏసినట్లే నాశనం అయింది అని చెప్తారంట"***
> ***"పాపం శీనప్ప చెప్పేది ఎవురూ ఇనకపోతిరి, ఆయప్ప సదివేది సేద్యానికి సంబంధించిన సదువేనంట కదా. ఇంట్లో వాళ్ళే ఇననప్పుడు ఆ సదువు యాల సదివిచ్చల్ల"***
> ***"మా నాయనకు తెలుసా, నీకు తెలుసా.... ఆయన అన్నీ ఆలోచించే అనింటాడులే.***

వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఆడిటోరియం సాయంకాలం ఏడు గంటలు.

స్టేజ్ మీద మోనో యాక్షన్ చేస్తున్నాడు ఒక స్టూడెంట్. వెనుక వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఆ స్కిట్ పేరు "వైరల్ వీడియో...."

"ఎండ కాల్చకుండా నన్ను నేను గొడుక్కింద దాచుకున్నప్పుడు అతను ముండ్లను కొట్టి, రాళ్ళను ఏరి, బీడు భూములను ఇంగడిస్తున్నాడు. నేలను చదును చేసుకుని దున్ని విత్తనాలేసి ఎరువులేసి, నీళ్ళు పడుతున్నప్పుడు ఇక్కడ నేను ఫలహారం చేస్తున్నాను....

చాలా సార్లు తినడానికి తీసుకున్నాను, కాస్త తిన్నాను బోర్‌గా అనిపిస్తే విసిరి పడేసాను.

అతను కలుపులు తీస్తున్నప్పుడు రాగీమాల్ట్ వచ్చింది, వెగటుగా అనిపించింది పారబోసేసాను.

పాలకంకుల్ని పిట్ట లెగరేసుకు పోతాయని అతను గువ్వల్ని తోలుతున్నప్పుడు.... సహించక అన్నం ప్లేట్లోనే చేయి కడిగేసుకున్నాను.

అతను పంటను నూర్చి కళ్ళం చేసి తూరుప్పోసి, వానకు నాని, ఎండకు ఎండిపోతున్నప్పుడు అతన్ని వీడియో తీస్తూ.... నేను నీడ పాట్నే ఉన్నాను.

అల్పపీడనం ప్రభావంతో అకాల వర్షాలు కురుస్తున్నాయి, ధాన్యం తడిసి పోయింది. నాలుగో రోజు మొలకలొచ్చేసాయి. పంట మొత్తం నాశనం అయిపోయింది. అప్పులు భారమైపోయాయి.


నేను అప్‌లోడ్ చేసిన వీడియో వైరల్ అయింది. మిలియన్ల కొద్దీ లైకులు వచ్చాయి రేటింగ్స్ పెరిగాయి. ఆ రైతు పిరికివాడు.... ఉరేసుకున్నాడని తెలిసింది!

ఈవెనింగ్ స్నాక్స్ తీసుకుంటూ అంత జరిగిందా అని అనుకున్నాను.

ఇంటికోసం సరుకులు బుక్ చేసాను ఏవీ రాలేదు. ఎక్కడ కూడా బియ్యం అసలు స్టాక్ లేదు. పిండి కూడా దొరకలేదు.

రేషన్ కోసం కొట్టుకోలాటలు, దోపిడీలు, దారుణ హత్యలు జరుగుతున్నాయి. మా ఇంట్లోకి చొరబడి, ఉన్న కొన్ని బియ్యం ఎత్తుకుని పోతున్నారు.... చాలా ప్రతిఘటించాను నన్ను గాయపరిచి పారిపోయారు.

ఈ సంఘటనను.... ప్రాణంలేని నా దేహాన్ని వీడియో తీసారెవరో. వీడియో వైరల్ అయింది నేనూ అదృశ్యంగా చూస్తూ ఉన్నా!"



ఇండోర్ ఆడిటోరియం చప్పట్లతో దద్దరిల్లింది. కాలేజ్ డే కోసం కొన్ని పోటీలను నిర్వహించారు. అందులో ఫస్ట్ ప్రైజ్ "వైరల్ వీడియో" చేసిన శీనుకే వచ్చింది.

కదిరిలో ఉండే నాన్నకు కాల్ చేసి చెప్పాడు శీను... "తనకు మోనో యాక్షన్‌లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని, అందరూ మెచ్చుకున్నారని!"

అది విని "ఇవన్నీ కూటికి గుడ్డకు ఏం పనికొస్తాయి? నువ్వు బాగ చదివి బయట పడప్పా" అని చెప్పగానే శీను ఉత్సాహం చప్పబడిపోయింది. 'ఏదీ ఒక పట్టాన మెచ్చుకోడు నాన్న' అని కొంచెం బాధపడి, 'ఆయన అంతేలే' అని సర్దుకున్నాడు శీను.

★★★

"ఏం పాపమ్మా! మీ చేన్లో ఏమేసినారు ఈసారి?"

"అబ్బుడే యాడేస్తిమి, దుక్కి దున్ని పెట్నాము, వాన కోసం ఎగ జూస్తా ఉండాము పెద్దమ్మా"

"ఇత్తనాలు యావేస్తారో!"

"ఎవురో యాపారం చేసేవాళ్ళు టౌన్లో మామకు తెలిసినోళ్ళు ఉన్నారంట. చిన్న గుత్తికాయలే కావల్ల, అన్నీ మేమే

కొనుక్కుంటాము అంట్రంట. అందుకే మామ ఆ ఇత్తనాలే కొనుక్కొచ్చ!"

"యాల కొంట్రి పాపా! పొయినసారివి ఇత్తనాల కాయలు లేకపాయనా?"

"పొయినసారివి ఇంగా యాడుంటాయి పెద్దమ్మా? ఇత్తనాల కాయలకని ఒగ రెండు మూట్ల కాయలు ఎత్తి పెట్టింటిమి. మధ్యలో ఎండేసి గాదుల్లో పోసి మెత్తేసి పెడితిమి అంతే, వాళ్ళు వీళ్ళు వొచ్చినబ్బుడంతా మెత్తింది ఊడబెరికేది! ఒగ చాట కాయిలు ఏంచి పెట్టేది, ఇంగ ఇంట్లో కూరలకూ చెట్నీలకీ వాడేస్తిమి, ఇంగా ఇత్తనాలకు యాడ మిగల్తాయి!"

"అందరి ఇండ్లల్లోనా అంతేలే"

"ఇంగా చెప్పలా కదా... మా చిన్న మరిది తిరుపతిలో చదువుతాండాడు గదా, ఆయప్పకు ఆస్టల్లో తిండి ఇంపితమే కాదంట, అందుకని లీవుల్లో వొచ్చిపోయినప్పుడంతా చెనిగిత్తనాల కారం కొట్టి పంపిస్తాము, ఆడంతా 'బలే ఉంది, బలే ఉంది' అని అందురూ తలా కొంచెం ఏసుకోని తింటారంట!"

"ఆస్టలంటే అంతే! ఎవురు యాది తెచ్చినా అందురూ తింటారు!"

"మావాడు అంటాంటాడు 'మా చిన్నొదిన చేసిచ్చిన చెనిగిత్తనాల కారంలోకి మా ఫ్రెండు తెచ్చిన నెయ్యి ఏసుకోని అన్నం తింటే... ఇంగా ఇంత తినాలనిపిస్తుంది అని"

"పోనీలే పాపమ్మను చేసుకున్యంక మేం బాగుండాము అని వాళ్ళంతా అనుకుంటే చాల్లే, పాపం చచ్చి యాడుందో మీయమ్మ నీ గురించే యాస్ట పడేది!"

"మాయమ్మను తల్చుకునే దానివి నువ్వొక్కతే పెద్దమ్మా! ఇంకొన్నాళ్ళు ఉన్నింటే బాగుండు, ఏం చేద్దాం నా రాతింతే, పుట్నిల్లు ల్యాక పాయ!"

"ఏమన్నాగానీ... నిన్ను మెచ్చుకోని చేసుకుండ్య వెంకటసామి! చేసుకున్నందుకు భద్రంగా చూసుకుంటాడు అది చాలు"

"అవును పెద్దమ్మా పోయిన జన్మలో దేవుని కాడ రెండు పూలు ఎగేసి వచ్చింటాను అంటాడు మా నాయన"

"అంతే అంతే లే"

"పొద్దెక్కింది పోతా పెద్దమ్మా"

"అయ్యో నాతో మాట్లాడతా ఉండిపోతివి నిన్ను ఏమన్నా అనేరు పో యమ్మా బిరిన్నా పో"

"ఎవురేమంటార్లే గానీ, ఇదో ఈ సద్ది లేటైతుందని అట్లంటిలే. సరే పెద్దమ్మా"

"సరేమ్మా"

★★★

శీను అగ్రికల్చర్ బియస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తన చదువు కంటే ఎక్కువగా వ్యవసాయం గూర్చి చాలా పుస్తకాలు చదివాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శీనుకు వర్షాభావ పరిస్థితులు, నకిలీ పురుగుల మందులు,

ఎరువుల ధరలు, దళారీలు, గిట్టుబాటు ధరలు వీటన్నిటి మధ్యా నలిగిపోయే రైతుల ఇక్కట్లన్నీ తెలుసు. అందుకే తమ పల్లెలో చేస్తున్న వ్యవసాయంలో లోటుపాట్లను సరిచేసి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని అతని తాపత్రయం.

సెప్టెంబర్ రెండో వారంలో వేరుశెనగ విత్తుకుంటారని తెలుసు కాబట్టి, ఒక రెండు రోజులు సెలవు దినాలు చూసుకుని పల్లెకొచ్చాడు. ఒకరోజు తమ చేను పక్కనే దున్నే రైతులందరినీ ఒక చోట కూర్చోబెట్టి, వ్యవసాయంలో తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలను గూర్చి చెప్పటం మొదలు పెట్టాడు.

“పెద్దయ్యా, చిన్నాయనా, యాదన్న, మామా... మీకందరికీ సేద్యం గూర్చి నేను కొత్తగా నేర్పించేదేమీ లేదు. నేను అదే చదువు చదువుతున్నాను. కొన్ని విషయాలు మీకు గుర్తుచేద్దామనే మిమ్మల్ని రమ్మన్నాను! ఒక నిర్దిష్టమైన పద్ధతిలో వేరుశెనగ మొక్కలను పోషించాలి. మొదట విత్తనశుద్ధి... థైరామ్ లేదా క్యాప్టాన్ కేజీకి మూడు గ్రాముల చొప్పున కలిపి, మొదట విత్తన శుద్ధి చేయాలి. రెండవదిగా... కలుపు నివారణ కోసం అల్లాక్లోర్, పెండి మిథాలిన్ పిచికారి చేయాలి. మూడవ జాగ్రత్త విత్తనం విత్తేటప్పుడు వరుసల మధ్య 22.5 నుండి 80 సెమీ , మొక్కల మధ్య 10–15 సెమీ దూరం ఉండేలా... అంటే చదరపు మీటరుకు 44 మొక్కలు 5 సెమీ లోతులో విత్తుకోవాలి. నాలుగవ జాగ్రత్త ఏంటంటే ఎరువులు... ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 27 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను దుక్కిలో వేయాలి. ఐదవ సూచన ఏంటంటే జిప్సం 200 కిలోలు పూత ఊడలు దిగే సమయంలో మొక్కల మొదళ్ళ దగ్గర వేసి మట్టి ఎగదోయాలి. ఆరవ సూచన నీటి తడి... 8–9 తడులు విత్తిన 7–12 రోజుల వ్యవధిలో ఊడ దిగే దశ నుండి కాయ గట్టిపడే వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ఇలాంటి సూచనలు పాటిస్తే ఒక వేరుశెనగ మొక్క 30–40 కాయలు పండించగలదు!” కొందరికి అర్థం అయింది. కొందరు తలలు గోక్కున్నారు చెబుతుంటే!

★★★

తలమీద తట్ట పెట్టుకుని, ఏదో ఆలోచిస్తూ ఇల్లు దాటి పోతున్న పాపమ్మను మాట్లాడించింది పెద్దమ్మ

“ఏం పాపా, పిలుస్తాంటే అట్ల పోతానే ఉండావు?”

“అయ్యో, ఇనిపించల్యా పెద్దమ్మా!”

“యాదో యోచిస్తా పోతాంటే నేనరిచింది యాడినిపిస్తుంది?”

“ఏం పెద్దమ్మా తింటివా?”

“నేను తినేది సరేలే, ఏమట్లున్నావు?”

“పొయిన సారీ చెనిక్కాయల్లో బాగా నష్టమొచ్చ! అసలైనా రాల్యా, అది ఇంట్లో మాట్లాడుకుంటాంటే, నా చిన్న మరిది ఇనేసినాడు. నేరుగా మామ దగ్గిరికే వచ్చి ‘నాయనా, ఈ సారి నేను చెప్పినట్లు సేద్యం చేయండి, మంచి లాభాలు వస్తాయి’ అని అన్నాడో లేదో... ‘ఆ నువ్వు మాకు చెప్పేటోనివా... గుడ్డొచ్చి పిల్లను ఎక్కిరిచ్చినట్టు నువ్వేందిరా మాకు చెప్పేది?’ అని ఏమేమో అనేసినాడు”

“సదువుకున్నోడు వానికీ కొపమొచ్చింటాది”

"అయ్యో కోపమంటే సన్నగా రాల్యా... ఏం మాట్లాడకుండా గబాగబా వచ్చెనేమో, బట్టలు సర్దుకున్నేమో ఎల్లబారిపాయ"

"అందుకని నువ్వు మొగమేలాడేసుకోని పోతాండావా?"

"ఇంగేం చేద్దు పెద్దమ్మా... ప్రతిసారీ కారం బెట్టిన చెనిగిత్తనాలు, పాకం పప్పు, చెనిగిత్తనాల కారం అన్నీ చేసి పంపిస్తాంటి, ఈసారి య్యాదీ ల్యా వొట్టి చేతుల్తో ఎల్లి పాయ!"

"వాని కోపమెన్ని రోజులుంటుందిలే, మళ్ళా వొచ్చేస్తాడు"

"నీకు తెలిసీ మా పెళ్ళప్పుడు ఆ యప్ప ఆరోక్లాసు చదువుతాండ్య! నేనే వీపు రుద్ది నీళ్ళుపోస్తాంటి, వండినాముదం పెట్టి తల దువ్వుతాంటి, బిడ్డకంటే ఎక్కువ చూస్తి, బాధ లేకుండా ఎట్లుంటుంది చెప్పు!"

"అవున్లే సాకిన ప్రేమ యాడబోతుంది? అవునూ, ఎంకటసామి ఏమీ అన్లేదా?"

"ఎవురు నా మొగుడా... మామ ముందర నోట్లోంచి మాటన్నా వొస్తుందా! ఒగ వేళ అన్యా గానీ గెలుచుకుంటాడా!"

"మాట రాకనే నిన్నిచ్చి చేయమని గట్టిగా కూచుండెనా, అన్నేండ్లకు ముందే? అబ్బబ్బా ఎంత గొంతేసుకోని చెప్పినాడకున్నావు? ఆరోజు, ఆడ ఉన్నోళ్ళంతా నోరు తెరిచేసిరి, వీనికి యాడనుంచీ వొచ్చిందీ తెగింపు అని!"

"పో పెద్దమ్మా. నేను బాధలో ఉన్నానంటే సాలు, ఎట్లో ఒగట్ల యాదాదో చెప్పి నగిస్తావు. పుట్న పిల్లోళ్ళే... పెద్దోళ్ళైపాయిరి ఇబ్బుడు నా పెళ్ళి సుద్ద్యాల!"

"అందుకేనే పాపమ్మా నేనుండేది! మీయమ్మ ఎట్లా ల్యామా. పానాలున్నంత వరకూ, మా కండ్ల ముందు మీరంతా బాగుంటేనే మేమూ బాగుండేది! ఇంతకూ ఏమాయ?"

"ఏమీ కాలా. ముందేసి నట్లే ఇత్తనాలు చల్లేసిరి. పాపం నా మరిది సేద్యానికి సంబంధించిందే సదువు చదువుతాండాడంట! ఒగసారి ఆయప్ప చెప్పేది వింటే వీళ్ళ సొమ్ము ఏం బాయ?"

"అంతేనే పాపమ్మా! అదే మాట ఎవురన్నా పెద్దోళ్ళు చెప్పింటే ఇనిందురు. నీ మరిది ఎంత సదివినా ఇంటెనక చెట్టు మాదిరిగానే, ఎంత మంచి చెప్పినా ఇనరు"

"సేద్యంలో నష్టమొస్తాందని బాధపడి రానీకుండా చేద్దామని ఆ యప్ప తాపత్రయం"

"చూద్దాం అందరూ గుత్తికాయలే ఏసినారంట, ఏమైతుందో..."

★★★

"ఏయ్, ఇంగ సాలిచ్చు, ఎవురో సచ్చిపోయినట్లు ఏడుపులు ఏడస్తాండావు"

"పోయినసారి చూస్తే అట్లాయ, ఈసారి మళ్ళా ఇంత నష్టమొచ్చ, ఎంత కష్టము... ఎన్ని డబ్బులు అంతా నేలపాలైపాయ. ఇంగ ఏడ్చకుండా ఎట్లుండేది!"

"ఏడిస్తే నష్టం పూడుతుందా?"

"ఇల్లు ఇల్లంతా రాత్రీ పొగులూ కష్టపడితిమి ఇట్లైపాయ"

"ఇట్లైతుందని ఎవురికి తెలుసు?"

"పోయిన సారి ఇత్తనాలు ఏస్తానే అన్నీ మొలిచినాయి, బిడ్డల్లాగ పచ్చగా పైకి వచ్చినాయి ఏమైందో ఏమో అన్నీ రాత్రికి రాత్రే ఎవురో అగ్గిపెట్టినట్లే మాడిపాయ. ఈసారి అదేందో ఇత్తిన ఇత్తనం మొలచనే లేదు"

"మా నాయన సగినం చెప్పిస్తానన్యాడు"

"సగినం ఎందుకయ్యా"

"ఎందుకిట్ల ఏసిన పంట ఏసినట్లే నాశనం అయింది అని చెప్తారంట"

"పాపం శీనప్ప చెప్పేది ఎవురూ ఇనకపోతిరి, ఆయప్ప సదివేది సేద్యానికి సంబంధించిన సదువేనంట కదా. ఇంట్లో వాళ్ళే ఇననప్పుడు ఆ సదువు యాల సదివిచ్చల్ల?"

"మా నాయనకు తెలుసా, నీకు తెలుసా? ఆయన అన్నీ ఆలోచించే అనింటాడులే. నాకు అన్నం పెట్టేయ్ చేనుకాడికి పోయొస్తా"

"నిన్న టౌన్లో మన శీనప్ప కనిపించినాడంట, ఆ ఓబులేసు గాడు ఉన్నవీ లేనివీ చెప్పేసింటాడు. రేపే ఊరికి వస్తాను అన్యాడంట!"

"అయితే ఇప్పటికే వొచ్చిండాలే. సరే నాకు పెట్టెయ్ వాడొచ్చే టయానికి వచ్చేస్తా!"

పాపమ్మ ఇంకేం మాట్లాడకుండా అన్నం పెట్టింది వెంకటస్వామికి.

★★★

సాయంత్రం నాలుగ్గంటలకు ఊరికి చేరుకున్నాడు శ్రీను. నేరుగా చేనుకాటికే వెళ్ళి చెనిగిచెట్ల పరిస్థితి చూసి, అన్నతో పక్క చేను వాళ్ళతో మాట్లాడాడు. ఎవరెవరితోనో ఫోన్లో మాట్లాడి ఇంటికొచ్చాడు. తండ్రికి పంట గూర్చి వివరించబోతే ఆయన అంతగా ఆసక్తి చూపించలేదు.

"సరే నాన్నా. నా మాట వినకపోయినా పర్వాలేదు, ఆ సగినం చూపించడం మాత్రం చేయద్దు. పంట పాడైపోవడానికి సగినానికి సంబంధం లేదు. అసలు అవన్నీ మనం నమ్మకూడదు!"

"నువ్వు చదువుకున్నావు. నీకున్న తెలివితేటలు మాకు యాడుంటాయిలేప్పా! నీకు నచ్చిందేదో చెయ్యి" అనేసి బయటకెళ్ళిపోయాడు.

అన్న వెంకటస్వామితో కలిసి సర్పంచ్‌తో మాట్లాడాడు శ్రీను.

వ్యవసాయం గూర్చి సూచనలు ఇచ్చేదానికి టౌన్ నుంచి అధికారులు వస్తారని, అందరూ ఆ సభకు రావాలని సర్పంచ్ ఊరందరికీ కబురు చేరేలా చూసాడు

★★★

మరుసటిరోజు గ్రామసభ దగ్గర ఉదయం పదింటికి మీటింగ్ మొదలైంది. శ్రీను చదివే కాలేజీ ప్రొఫెసర్లు మాట్లాడారు. అంతకు ముందు శ్రీను చాలా చేన్లు తిరిగి, వేరుశెనగ చెట్లను తెచ్చి వాళ్ళకు చూపించాడు.

దాదాపుగా వందమంది దాకా సభకు వచ్చారు. పంటనష్టంతో బాధలో ఉన్నారు. వచ్చిన ప్రొఫెసర్‌లు ఏదైనా పరిష్కారం చెబుతారన్న ఆశతో ఆసక్తిగా వింటున్నారు.

ఒక ప్రొఫెసర్ మాట్లాడుతూ... "వేరుశెనగ జన్మస్థలం దక్షిణ అమెరికా. వేరుశెనగ ఉష్ణమండల నేలల్లో బాగా పండుతుంది. ఈ పంటకు గుల్లగా ఉండే వ్యవసాయ భూములు అనుకూలమైనవి. వేరుశెనగ లెగుమినస్ జాతికి చెందిన మొక్క. దీని శాస్త్రీయ నామం అరాచిస్ హైపోగేయా లెగ్యూమ్. వేరుశెనగ పుష్పాలు బయట ఫలదీకరణం చెందిన తర్వాత మొక్క మొదలు చుట్టూ భూమిలోనికి చొచ్చుకువెళ్లి, కాయలుగా మారతాయి!" అంటూ చెప్పుకుపోయాడు.

ఇంకొక ప్రొఫెసర్ మాట్లాడుతూ... "వేరుశనగ మొక్క పెరిగే కాలం 90–120 రోజులు. కొన్ని రకాలు 130– 140 రోజులు పడుతుంది. విత్తనాలలో రకాలున్నాయి వాటిలో ముఖ్యమైనవి... కదిరి 6 ధరణి కదిరి జె.సి 88, కదిరి 7 కదిరి 9 మొదలైనవి. రబీ సాగు కోసం సెప్టెంబర్ 15 నుండీ అక్టోబర్ 15 మధ్యలో విత్తుకోవాలి. వేసవి పంటైతే జనవరి 15 నుండీ ఫిబ్రవరి మొదటి వారంలోగా విత్తుకోవాలి. వేరుశెనగ కాయలను నిలువ చేసుకుని, విత్తే ముందు కాయలను ఒలిచి, గింజల పైపొర బాగా ఉండి సమానమైన రంగులో ఉన్న విత్తనాలను ఎంచుకోవాలి. అలా చేస్తే ఎకరానికి 15 సంచులు వేరుశెనగ పంట దిగుబడి వస్తుంది. వంటనూనె, డాల్డా తయారీ, సబ్బుల తయారీ, సౌందర్య పోషకాలు, కందెన లాంటి వాటిలో వేరుశెనగ ఉపయోగిస్తారు. వేరుశెనగలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, క్రొవ్వు పదార్థాలు, విటమిన్లు ఉన్నాయి. పశువులకు కోళ్ళకు దాణాగా ఎరువుగా వేరుశెనగ పిప్పి పనికొస్తుంది." అంటూ చెప్పాడు.

చివరగా ఒక ప్రొఫెసర్ శీనును దగ్గరికి రమ్మని పిలిచి "మీ అందరికీ నేను చెప్పేది ఒకటే! ఈ అబ్బాయి మీ ఊరివాడే. వ్యవసాయానికి సంబంధించిన చదువు ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు, చదువులో ఎంతో చురుకైన కుర్రాడు. ఇపుడు మీకు చెప్పిన విషయాలన్నీ ప్రాక్టికల్‌గా ఈసారి మీకు దగ్గరుండి చూపించి చెబుతాడు. ఆ విధంగా చేసి చూడండి, నష్టం మీ దరికి రాదు!" అన్నాడు

అందరూ చప్పట్లు కొట్టారు.

చివరలో కూర్చుని, ప్రొఫెసర్లు చెప్పింది శ్రద్ధగా వింటున్న నాన్నను చూసాడు శ్రీను. అందరితో పాటూ ఆయన కూడా చప్పట్లు కొట్టడం చూసి చిరునవ్వు మెరిసింది శీను ముఖం మీద.

సెప్టెంబర్లో శీను సలహా ప్రకారం విత్తన వేరుశెనగ పంట లాభాలను తెచ్చింది. ఎవరూ చూడకుండా మీసం మెలేసుకున్నాడు శీను నాన్న... గోడపైనున్న ఫ్యామిలీ ఫోటోలో శీనును చూసి.

అందరికీ మరిది గొప్పతనం గూర్చి చెప్పటంలో అసలు తీరికే లేకుండా పోయింది పాపమ్మకు!!

# చేయి చేయి కలిస్తే...

డా. మజ్జి భారతి

✆ 9440615206

*'పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లక్కడి పద్ధతులకు పూర్తిగా అలవాటు కాకముందే, మనం ఇండియా వచ్చేస్తే బాగుంటుందేమో! ఉన్న డబ్బుతో ఇక్కడే ఏదో చూసుకుంటే, పొలం అమ్మే బదులు వ్యవసాయం చేయించుకుంటే... బాగుంటుందేమో... నాకనిపించింది మీకు చెప్పేసాను. ఆపైన మీ ఇష్టం!'*

అమెరికా నుండి ఊర్లోకి రాగానే కలవాల్సినందరినీ కలిశాక, పాఠశాల ప్రహరీగోడను వెతుక్కుంటూ బయలుదేరాడు హరిబాబని పిలవబడే హరిశ్చంద్ర.

పాఠశాల చుట్టూ ప్రహరీగా ఎప్పుడో కట్టిన పాతకాలపు రాతి గోడ. గోడ వెనుకకు వెళ్లి చూస్తుంటే జ్ఞాపకాలు వెల్లువలా ముంచుకొస్తున్నాయి. వేరుశెనక్కాయలు దొంగతనంగా ఇంటినుండి తెచ్చి, నరసమ్మకు లంచమిచ్చి, ఈ గోడమీదే భోగిపిడకలు చెయ్యడం... అప్పట్లో ఈ గోడకు యజమానురాలు నరసమ్మేనని తాము గట్టిగా నమ్మడం... ఎందుకంటే గోడమీద ఆమె చేసిన పిడకలే ఉండేవి. అందుకని గోడ ఆమెదని తామనుకునేవాళ్ళు. తమ నమ్మకానికి ఏ మాత్రం భంగం కలిగించకుండా, రాజ్యాలు దానం చేసే మహారాజ్ఞిలా, తామిచ్చిన లంచమేదో తీసుకుని 'ఈ ముక్క చాలా?' అని బొగ్గుతో గీసి, తమ లంచాలను బట్టి, తమకు స్థలాన్ని కేటాయించేది, పండుగ పది దినాలూ... చిన్నప్పటి తమ అమాయకత్వానికి నవ్వొచ్చింది హరికి.

ప్రేమగా ఆ గోడను తడిమాడు. ఒకరి స్థలంలోకి ఒకరు రాకుండా, రాయితో కొట్టి ఆ గోడమీద చేసుకున్న హద్దుల ఆనవాళ్లు, గరుకుగా తగిలాయి. ఆత్మీయులను కౌగిలించుకున్నట్టు అనిపించింది. ఎవరి భోగిదండ ఎంత పొడవో పోటీలు పడడం... అన్నట్టు పోటీ అంటే గుర్తుకొచ్చింది. చదువులో పోటీ పడలేదేనాడూ! చెట్లెక్కడంలోనూ, ఈత కొట్టడంలోనూ, పరుగు పెట్టడంలోనూ వీటిల్లోనే పోటీ. జ్ఞాపకాలు పరిమళాలై చుట్టుముట్టాయి.

అవునూ! గోడేమిటి, ఖాళీగా ఉంది? ఊర్లో ఉన్నప్పుడు ఈ గోడ ఖాళీగా ఉండడం తానెన్నడూ చూడలేదు. నరసమ్మకు ఒంట్లో బాగోలేదా? పాఠశాల ముందున్న మామిడితోటల్లో నరసమ్మ గుడిసె! గుడిసె ముందు శరీరమంతా ముడతలు పడిపోయి, 'ఎవురాళ్లు...' అంటూ చిట్లించి చూస్తున్న కళ్ళు. ఇలాగైపోయిందేమిటి నరసమ్మ?

ఆ మాటే అంటే 'నా సంగతికేటి గాని, నువ్విలాగొచ్చావేటి? ఊరికెప్పుడొచ్చినావు?'అన్న నరసమ్మతో, గోడంతా ఖాళీగా ఉంది. పిడకలు కనిపించ లేదన్నాడు.

'ఉప్పుడు పిడకలెవరిక్కావాలి! అందరూ గేట్టవ్వులే... కుదరపోతే కిరసనాయిలు టవ్వులు. ఐనా ఉప్పుడు పశువుల్నెవురు పెంచతన్నారు?' నరసమ్మ సమాధానం వింటుంటే వెలితిగా అనిపిస్తుంది. భోగిదండల భోగిమంటలు కళ్ళముందు

కవ్విస్తున్నాయి. అందుకే కదా పిల్లలకు పల్లెటూరి అందాలు, మన పండుగలు, ఆచారాలు, మరీ ముఖ్యంగా భోగిదండలు... ఇవన్నీ చూపిద్దామని ఈ సంవత్సరమిక్కడకు వచ్చాడు. ఏమిటో అప్పటిలాగా పచ్చని పొలాలూ లేవు. ధాన్యపు కుప్పలూ లేవు. ఊరే మారిపోయింది.

అదివరకు ధనుర్మాసమంటే ఎలా ఉండేదీ? ప్రతి ఇంటిముందూ పేడనీళ్లతో కల్లాపి చల్లిన వాకిళ్లు ... వరిపిండితో తీర్చిదిద్దిన రంగవల్లులు... పేడతో చేసిన గొబ్బెమ్మలు. వీధంతా ముగ్గులతో నిండిపోయేది. ముగ్గులను చూస్తూ వాటిమీద కాలు పడకుండా నడవడమనేది, ఆ రోజుల్లో తమకు కత్తిమీద సామే... పొరపాటున ఏ ముగ్గుమీద కాలుపడినా... చీవాట్లే చీవాట్లు. ఇప్పుడవేవీ లేవు. ఇళ్ళముందు గచ్చు వాకిళ్లు. సుద్దముక్కతో గీసిన ముగ్గులు. కొన్నిళ్ళ ముందు రంగుముగ్గులు. ముగ్గంటే ఆనాడున్న అందమేదీ?



అప్పుడు వీధుల్లో చెత్తనేదే కనిపించేది కాదు. చెత్తను ఇంటి పెరటిలో ఉన్న, పెంటకుప్పలో వేస్తే అది కాస్త గెత్తంగా మారేది. శుభ్రానికి శుభ్రం, ఉపయోగానికి ఉపయోగం ఉండేదానాడు. ఇప్పుడో... ఎక్కడపడితే అక్కడే ప్లాస్టిక్ చెత్త.

అదివరకు ఆడా, మగన్న తేడా లేకుండా కబుర్లు చెప్పుకుంటూనే, ఏదో ఒకపని చేస్తుండేవారు. మరిప్పుడో... మగాళ్ళందరూ రచ్చబండ దగ్గరో, రామాలయం దగ్గరో, పంచాయితీ ఆఫీసుముందో ఊసుపోక కబుర్లు చెప్పుకుంటూనో, మూడు ముక్కలాడుకుంటూనో కనిపించారు. అసలు ఈ కాలంలో రైతుకు ఊపిరాడనంత పనుంటుంది. అటువంటిది అందరూ ఇంత ఖాళీగా... తన అనుమానాన్ని నరసమ్మ ముందు పెట్టాడు.

'ఎవసాయానికి గిట్టుబాటేది?

మదుపెక్కువ, కళ్ళసూసేది తక్కువ. కొన్నాళ్లు పక్కూరు సుగరు పేకటరీకి పనికెళ్ళారు. పని సరీగ్గా సెయ్యనేదని మేనేజరుబాబేదో అన్నాడని, చస్! పక్కూరోడి కింద మనం పని సేసేదేటని... పని సెయ్యనోడు మానెయ్యడమే కాక, మనూరు... మన పరువని మిగిలినోళ్ళను కూడా, అందరమూ పనిమానేత్తే, పేకటరీ మూతడిపోతాది, అప్పుడాడే వొచ్చి బతిమలాడతాడని ఉసిగొలిపితే... యీళ్లు పని మానేత్తే... సుట్టుపక్కల ఊళ్ళోళ్ళు పనికి సేరిపోనారు. సివరికి ఎవురికీ పనిలేకండా పోనాది. అది కక్కలేక మింగలేక... అప్పటి నుండి గొడవలు. ఐనా ఆ సంగతికేట్లే, ఊర్లో ఎప్పుడుండేవే! నువ్వొచ్చిన పనేటి?' అడిగింది నరసమ్మ.

'ఊర్లో ఎక్కడా భోగి పిడకలు కనిపించలేదే!' అన్నాడు హరి.

'పరాసికాలాడతన్నావా ఏటి? ఉప్పుడు బోగిదండలెవరు సేత్తన్నారు? కర్రలతో ఎవుడింటి ముందు, ఆడి బోగిమంటే!' నిట్టూర్చింది నరసమ్మ.

'ధాన్యంలేని గాదెలు, భోగిపిడకల్లేని భోగిమంట, పేడకల్లాపి, పిండిముగ్గులు లేని వాకిళ్లు... ఏమౌతుందీ పల్లెలకు?' హరి ఆలోచనలు ఎటో వెళ్లిపోయాయి.

నరసమ్మను పిలిచి, పిల్లలచే భోగిపిడకలు చేయించాడు.

'యాక్... కౌ డంగ్. మేము ముట్టుకోం' అన్న పిల్లలే... నరసమ్మ, హరి పోటీపడి భోగిపిడకలను గోడ మీద కొడుతుంటే, కుతూహలంతో వాళ్లూ చెయ్యడం మొదలుపెట్టారు. అమెరికా నుండొచ్చి భోగిపిడకలు చేస్తున్నారేమిటని, వాళ్ల ముందు ఓ గుంపు తయారయింది.

వారంరోజులకి ఎండిన పిడకలు తీసి దండలుచేసి తెచ్చింది నరసమ్మ.

'వావ్! వెరైటీగా ఉందిది' అన్నారు పిల్లలు. కొడుకు హైస్కూలు కొచ్చాడు. చిన్నది కూతురు. వీళ్లున్నారని చూడడానికొచ్చిన ఇద్దరక్కల పిల్లల్ని పిలిచి, భోగిదండలను చూపించి 'వీటిని మార్కెటింగ్ చెయ్యాలంటే, మీరేమి చేస్తారు, ఎలా చేస్తారో ఆలోచించి చెప్పండని' హోమ్ వర్కిచ్చాడు.

రెండురోజులు పోయాక వాళ్లు చూపించిన వీడియో చూసి ఎగిరి గంతేసాడు. భోగిపిడకల మధ్యలో కాగితపు పువ్వులు చేర్చి, జనపతాడుకు గుచ్చి, మధ్యమధ్యలో శుభభోగి, జన్మదిన శుభాకాంక్షలు, శుభ విహారయాత్ర... ఇలా క్యాప్షన్లు పెట్టి... ప్లాస్టిక్ డబ్బాలలో అమర్చిన, దండలను ప్రకటనల రూపంలో మూడు నిముషాల వీడియో తయారుచేశారు. విహారయాత్రలలో చలిమంట వేసుకోవడానికి కట్టెలు వాడే బదులు ఈ దండలు వాడితే మనం ఎన్నో వృక్షాలను రక్షించిన వాళ్ళమవుతాం, 'ఈ దండలు వాడి పర్యావరణాన్ని రక్షిద్దాం' అనే నినాదంతో రూపొందించిన ప్రకటన.

'మామయ్యా! నా ఫ్రెండ్ ఒకామె పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వస్తువులను అంతర్జాలంలో అమ్మే కంపెనీని సొంతంగా పెట్టింది. ఎక్కువ లాభం లేకపోయినా, పర్యావరణానికి ఏ కాస్త మేలు జరిగినా చాలని! ఆమె వీటి అమ్మకాలను ప్రోత్సహిస్తుందన్నాడు పెద్ద మేనల్లుడు. టూరిస్ట్ ప్లేసులను లక్ష్యంగా చేసుకుంటే అమ్మకాలు బాగుంటాయన్నాడు' మేనల్లుడు.

అమ్మయ్య! ముందొకరికి పని దొరికిందని సంతోషపడ్డాడు హరిశ్చంద్ర. కాని 'యేపకం తక్కువ, ఊసుపోకెక్కువ, అందుకే గొడవలు' నరసమ్మ మాటలు చెవులలో గింగురుమంటూనే ఉన్నాయా రోజు నుండి.

'ఏమిటండీ! ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉన్నారిక్కడికి వచ్చిన్నుండీ' అంటూ వచ్చిన భార్యతో, ఏమీలేదనేసాడు.

'సర్లెండి చెప్పాలనుకుంటే మీరే చెప్తారు. ఇంతకీ నేనొచ్చిన విషయమేమిటంటే, నా ఫ్రెండుకి అప్పడాలు, వడియాలు కావాలంట. ఎక్కడ మంచివి దొరుకుతాయో చూసి, ఓ నాలుగైదు ప్యాకెట్లు తెప్పించండి' అన్న భార్య మాటలకు, తన ఫ్రెండు కూడా అవి తెమ్మని చెప్పిన సంగతి గుర్తొచ్చింది.

అమెరికాలో అప్పడాలు, వడియాలు అంత మంచివి దొరకవు. తాము కూడా వాటికి ముఖం వాచిపోయేవాళ్ళు. అవే ఇక్కడ తయారుచేసి, అక్కడికి ఎగుమతి చేస్తే... ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు, నష్టాలు తక్కువ. కొంతమందికైనా పని దొరుకుతుందన్న నిర్ణయానికి వచ్చాక, హరిశ్చంద్రకు కాస్త మనశ్శాంతి కలిగింది.

పని దొరుకుతుంది సరే, ఊరి మాటేమిటి? ఇలాగే ఉంటే కొన్నాళ్లకు దేశంలో పల్లె అన్నమాట వినిపించదేమో! రాజ్యాల గురించి చదువుకున్నట్టు, భవిష్యత్తులో పల్లెల గురించి కూడా చరిత్ర పుటల్లో చదువుకోవాల్సి వస్తుందేమో! ఇరవయ్యేళ్ళ క్రిందట పల్లెటూర్లంటే... స్వచ్ఛమైన వాతావరణానికి మారుపేర్లు, పరిశుభ్రతకు ఆనవాళ్లు, ఆప్యాయతలకు ప్రత్యక్ష సాక్షులు, శ్రమైక జీవనానికి పట్టుగొమ్మలు.

మరిప్పుడో... పల్లె పల్లెలా లేదని, పల్లె పచ్చదనము మాసిపోయిందని, అప్పటిలా లేదన్న వాళ్లే అందరూ. ఎంతోమంది వ్యవసాయం చెయ్యడం లేదు. వ్యవసాయం చెయ్యడంలో వారి ఇబ్బందులు వారివి. కాని, అందరూ ఎవరో రావాలని, ఏదో చెయ్యాలని అనుకుంటున్నారే కాని, పల్లె బతకడానికి ఏమి చెయ్యాలోనని ఎవ్వరూ ఆలోచించడం లేదు.

అంతెందుకు? ఇన్ని రోజులు సెలవు పెట్టి తానెందుకు వచ్చినట్టు? కౌలుకిచ్చిన పొలము మీద రాబడి లేదని, అది అమ్మడానికే కదా తానొచ్చింది! అటువంటప్పుడు తనకేమి హక్కుంది, ఈ ఊరు అప్పటిలా లేదననడానికి? ఊరికోసం తానేమి చేస్తున్నాడు? ఇప్పుడు తెలిసింది లోపమెక్కడుందో? ఏదో కథలో చెప్పినట్టు, రాజుగారు ప్రతి ఇంటి నుండి చెంబుడు పాలుతెచ్చి దేగిసాలో వెయ్యమంటే, అందరూ పాలు తెస్తారు, తానొక్కడే తేకపోతే ఏమవుతుందని, ఎవరికి వాళ్లే అనుకున్నారట. ఆఖరికి చూడబోతే దేగిసాలో మొత్తం నీళ్లే ఉన్నాయట. అలాగుందిప్పుడు పరిస్థితి.

★★★

పంచాయతీలో గృహపరిశ్రమ కింద అప్పడాలు, వడియాలు తయారు చెయ్యడం గురించి చెబితే చాలామంది బాగుందన్నారు.

'ఊరికేదో చెయ్యగలిగిన నీలాంటి వాళ్లు, ఊరొదిలిపోతుంటే, అభివృద్ధి ఎలా వస్తుందన్నాడు' ప్రెసిడెంట్.

'నువ్వు మరీనూ! అమెరికాలో సదుపాయాలొదులుకుని ఇక్కడెందుకుంటారన్నా'డొక మెంబరు.

ఆ మాటలు హరిలో ఆలోచనల తుట్టను రేపాయి. వీళ్ళనుకున్నట్టు అక్కడున్నవి సదుపాయాలేనా! కష్టాలు లేవా? వెళ్లిన మొదట్లో బాగానే ఉంటుంది. ఆ తర్వాతే తెలుస్తుంది, అక్కడి కష్టాలేమిటో! కన్నవాళ్లకు ఏమైనా ఐతే, దగ్గరలేమన్న బాధ,

జీవితాంతం వెంటాడుతుంటుంది. కోవిడుతో తండ్రి చనిపోతే దగ్గర లేకపోయాడు. పగవాడికి కూడా వద్దటువంటి బాధ. కష్టమొస్తే ఎవరితో పంచుకోవాలో తెలియదు. ముఖ్యంగా పిల్లలు పెద్దవుతున్న కొద్దీ... వాళ్లు అక్కడి పద్ధతులకు అలవాటు పడిపోయి,మనకు దూరం అవుతారేమోనన్న భయం,నిద్రపట్టనీయదు..మనసంప్రదాయాలకు,అక్కడి సంప్రదాయాలకూ మధ్య నలుగుతున్నారు తనలాంటివాళ్లు.

పెద్ద దేశమన్న పేరే గాని అక్కడున్న వర్ణవివక్షత ఇంకెక్కడా ఉండదేమో! వాళ్ళ ఉద్యోగాలను బయట దేశస్థులు కొల్లగొడుతున్నారన్న కోపం, అభద్రతాభావం వారిలో! అందువలన జరుగుతున్న దాడులు. ఎప్పుడెవరి మీద ఎలా జరుగుతాయో తెలియని పరిస్థితి. ఈమధ్య ఇండియన్స్ మీద దాడులు విపరీతంగా ఉన్నాయి. బయటకు వెళ్లిన పిల్లలు ఇంటికి తిరిగి వస్తారో లేదోనన్న అభద్రత. బయటకు డాలర్లే కనిపిస్తాయి గాని, ఇన్ని అనుమానాలు, ఆందోళనల మధ్య, అక్కడ జీవితం ఉంటుందని ఎంతమందికి తెలుస్తుంది?

ఇన్ని ఆందోళనల మధ్య అక్కడ ఉండడమా! ఇండియా వచ్చెయ్యడమా! వస్తే పిల్లలిక్కడ ఎడ్జస్ట్ అవ్వగలరా, లేదా! పరిస్థితులు బాగా లేవు. సాఫ్ట్వేర్ ఉద్యోగాలెప్పుడు ఊడిపోతాయో తెలియదు. ఇన్ని చికాకుల మధ్య అక్కడుండాలని లేదు. అలాగని ఇక్కడికొస్తే ఎలా ఉంటుందో! ఆ సాయంత్రం తనలోని అంతర్మథనాన్ని స్నేహితులతో పంచుకున్నాడు. తనకూ అలాగే ఉందన్నాడు, అమెరికాలో ఉద్యోగం చేస్తున్న రాజు. విదేశాల్లోనే కాదు, స్వదేశంలోనే వేరే రాష్ట్రాల్లో ఉన్న వాళ్ళందరి ఆలోచనలూ ఇలాగే ఉన్నాయి.

'నలుగురూ చేతులు కలిపితే ఊరికేదైనా చెయ్యొచ్చు' అన్నాడొక ఔత్సాహికుడు.

'ఏదైనా చిన్న ఫ్యాక్టరీ పెట్టాలనుంది మన ఊరిలో' అన్నాడు దుబాయ్ రాము.

'అలాగైతే నేనూ కలుస్తానన్నాడు' అమెరికా రాజు.

ఇండియాలో ఉద్యోగం చేస్తూ మధ్య మధ్యలో వచ్చి వ్యవసాయం చేయిస్తే! భార్యని ఎలాగైనా ఒప్పించాలని అప్పుడే నిర్ణయించుకున్నాడు హరి.

★★★

రాత్రి గదిలో... 'ఏమండీ, మనం ఇండియా వచ్చేస్తే ఎలా ఉంటుందన్న' భార్య మాటలకు ఆశ్చర్యంగా చూస్తుంటే, 'పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లక్కడి పద్ధతులకు పూర్తిగా అలవాటు కాకముందే, మనం ఇండియా వచ్చేస్తే బాగుంటుందేమో! ఉన్న డబ్బుతో ఇక్కడే ఏదో చూసుకుంటే, పొలం అమ్మే బదులు వ్యవసాయం చేయించుకుంటే... బాగుంటుందేమో.. నాకనిపించింది మీకు చెప్పేసాను. ఆపైన మీ ఇష్టం!' అంటున్న భార్యను నమ్మలేనట్లు చూశాడు.

ఇండియా వచ్చిన దగ్గిర నుండీ తనకొచ్చే ఈ ఆలోచనలు భార్యతో ఎలా చెప్పాలో తెలియక, చెప్పాక ఆమె రియాక్షన్ ఏమిటోనన్న ఆలోచనలతో సతమతమవుతూ ఉన్నాడిన్నాళ్లూ. భార్య కూడా తనలాగే ఆలోచిస్తుంటే ఇంకేమి? పిల్లలకు నెమ్మదిగా నచ్చ చెప్పుకోవాలి. ప్రశాంతంగా పడుకున్నాడా రోజు హరి.

తెల్లవారితే భోగి.

భోగి కోలాహలం తెల్లవారుఝాము నాలుగునుండే మొదలైంది. హరి పిల్లల్ని చూసి, ఊర్లో పిల్లలు కూడా భోగిపిడకలు చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత, యీసారి ఊర్లో ఒకటే భోగిమంట వేశారు. హరిలాగే, విదేశాల నుండి వచ్చిన మరో నలుగురు ఆ ఊరివాళ్లు, భోగిమంట చుట్టూ చేరారు. వీళ్లందరినీ చూసి 'ఊరి నుండి వెళ్ళిపోయిన, నలుగురు రాగానే ఊరెంత కళకళలాడుతుందో' అంటూ, 'నువ్వు పొలమమ్ముతానన్నావట, పండగ పోయాక మాట్లాడడానికి వస్తానన్నారు!' అన్నాడు నారాయణ.

'లేదు దద్దా! వ్యవసాయం చేయిద్దామనుకుంటున్నాను!' చెప్పాడు హరిశ్చంద్ర.

'కొంతమందైనా ఇలా అనుకుంటే, పల్లె పల్లెలా ఉంటుంది!' అన్నాడు నారాయణ.

'వావ్! వాట్ ఏ బిగ్ క్యాంప్ ఫైర్. వై డోంట్ వుయ్ స్టే హియర్? వి లైక్ దిస్ ప్లేస్ వెరీమచ్' అన్న పిల్లల మాటలు, ఎన్నో ఏళ్ల తర్వాత నిజమైన సంక్రాంతిని తీసుకొచ్చాయి హరిశ్చంద్రకు.

## కృష్ణా పత్రిక

*నేడు మనకు కనిపిస్తున్న పత్రికల రూపానికి పునాది వేసిన రెండు పత్రికలలో కృష్ణాపత్రిక ఒకటి. ఇంకొకటి ఆంధ్రపత్రిక. 1902 ఫిబ్రవరి 1వ తేదీన ప్రథమపత్రిక వచ్చింది. కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంయుక్త సంపాదకత్వంలో విడుదలైన ఈ పత్రిక ముందులో పక్షపత్రికగా, తర్వాత వారపత్రికగా వెలువడేది. కృష్ణా జిల్లా వార్తలకే పరిమితంగా ఉండే ఈ పత్రిక, క్రమేపి దేశవ్యవహారాలను, సమస్యలను ప్రచురించడం ప్రారంభించింది. 1903 లో ముట్నూరి కృష్ణారావుగారు ఉపసంపాదకులుగా చేరి, 1905లో నారాయణరావుగారి మరణంతో సంపాదక బాధ్యత చేపట్టారు. ఆ రోజుల్లో అక్షరాస్యులలోనే కాకుండా నిరక్షరాస్యులలో కూడా రాజకీయాల మీద ఆసక్తి కలిగించినవి.. కృష్ణాపత్రిక సంపాదకీయాలే! రచ్చబండలపై ఒకరు చదువుతుంటే, ఎంతోమంది గుంపులు గుంపులుగా చేరి వినేవారుట. సంపాదకీయాలతో పాటు, కవిత్వం, కథలు, వెండితెర చరిత్ర.. వంటి అన్ని అంశాలతో ఈ పత్రిక సుమారు 2000 వరకు మనుగడ సాగించింది. దినపత్రికగా, వారపత్రికగా, పక్షపత్రికగా అవతారాలు ఎత్తి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించడమే కాకుండా, అగ్రస్థానంలో ఉండేది!*

# పైరగాలే నా శ్వాస

శ్రీమతి వేలూరి ప్రమీలాశర్మ

✆ 9492535415

***"ఏవండీ! అలా ఎంతసేపని గుమ్మంలోనే కూచుంటారు? ఆ దేవుడికి దణ్ణం పెట్టుకోవడం తప్ప, ఏమీ చెయ్యలేం. కాస్త ఎంగిలి పడండి. లక్ష్మి కూడా ఈరోజు గంజి పెట్టినా తాగలేదు. కడుపులో నిమ్మగా ఉందో... లేక బిడ్డ భూమ్మీద పడే వేళయ్యిందో. పిడుగులకి భయపడుతోంది. ఎలా అరుస్తోందో చూడండి!" దిగులుగా చెప్పింది సరోజ.***

"అమ్మగారూ! అమృతపాణీ గెల తయారైయిపోయింది. కోసెయ్ మంటారా? గోనెసంచి తొడిగుంచాను. ఇంకో రెండు రోజులాగితే కోతులుంచేలా లేవు. అరిటాకులు తెమ్మన్నారు... చిరుగులు లేని ఆకులు చూసి, కోసుకొచ్చాను. కట్ట ఈడ దింపమంటారా? కమ్మని వాసనొస్తోంది... గార్లు గాని యేస్తన్నారా? సుట్టాలొస్తన్నారేంటి? పనేదన్నుంటే చెప్పండి" సైకిలు మీద పెట్టుకుని తెచ్చిన అరిటాకుల కట్టను సావిట్లో పెట్టి, అక్కడే నుంచున్నాడు కుమారస్వామి.

"హమ్మయ్యా! ఆకులు తెచ్చావు కదా! ఇంకా రాలేదేంటా అని చూస్తున్నాను. ఉండు. వెళ్ళిపోకు... నాలుగు గారెలు చేతిలో వేస్తాను. అరటిగెల సాయంత్రంలోపు కొయ్యొచ్చులే. అలా రోడ్డుదాకా వెళ్లి మా చెల్లెలు, మరిది వస్తున్నారు... కాస్త పెట్టెలు సైకిలు మీద పెట్టి తెచ్చేద్దుగాని. ఈపాటికి బస్సు దిగేసి ఉంటారు. లగేజీ ఇంట్లో పెట్టేసి, కాస్త టీ చుక్క తాగి వెళ్దువు గాని!" చుయ్‌చుయ్ మంటూ చేతిమీదుగా జారిన గారెలు నూనెలో చప్పుడు చేస్తూ, తేలుతుంటే... చట్రంతో మరో వాయి తీస్తూ చెప్పింది సరోజ.

"బేక్కానీయండి. ఇంటికాడ మా ఆడది, తిండి తినకుండా నా కోసం ఎదురుచూత్తా ఉంటాది!" తలకు చుట్టుకున్న ఎర్రని వలగుడ్డలాంటి బట్టతో, మెడవెనుక పట్టిన చెమటను తుడుచుకుంటూ, గోడకి జారబడి అక్కడే కూచున్నాడు కుమారస్వామి.

"ఏరా! ఎంతసేపయింది వచ్చి? పొట్ట మీదున్న చేను వెన్నుకట్టేసింది. పాలు పోసుకునేదాకా నీళ్లు జాగ్రత్తగా పెట్టామంటే, ఇక ఈ పంట చూసుకోనక్కర్లేదు. ఈరోజు నేను బోరింగ్ తిప్పాను కానీ, కాస్త ఆయాసంగా ఉంటోంది... రేపు పొద్దుపొడవక ముందే వచ్చెయ్, ఇద్దరం తిప్పుదాం. రెండు రోజులు తిప్పామంటే, ఇక నీళ్లు పట్టడం ఆపేయొచ్చు" పొలం దగ్గర నుంచి ఇంటికి వచ్చి, సైకిల్ స్టాండ్ వేస్తూ చెప్పాడు సుబ్రహ్మణ్యం మాస్టారు.

"ఈ వయసులో ఇంకా ఎందుకండీ కట్టపడతారు? అబ్బాయిగారికి బంగారంలాంటి ఉద్యోగం. మీరడిగితే నెలకి పదివేలు పంపరా ఏంటి?" చేతిలోంచి సంచి అందుకుంటూ అడిగాడు కుమారస్వామి.

"బిడ్డ సంపాదన నాకెందుకురా? నేను చేసిన పోస్టుమాస్టర్ ఉద్యోగానికి జీతం పూర్తిగా వచ్చినప్పుడే, బతకడానికి సరిపోయేది కాదు. ఇప్పుడు రిటైర్ అయ్యాక, సగం జీతమే అయిపోవడంతో నెల మధ్యలోనే తడుముకోవలసి వస్తోంది. ఏదో మా నాన్నిచ్చిన ఈ రెండెకరాలూ కూడా ఉన్నాయి కాబట్టి, వెనక్కి తిరిగి చూసుకోకుండా సరిపోతోంది. నాకు చేతనైన

వ్యవసాయంతో ఏటా యాభై బస్తాలు నిలవేసుకోగలుగుతున్నాను. తిండి గింజలకు పోను, ఖర్చులకి చేతిలో కాస్త డబ్బు కనబడుతోంది. ఓపికున్నంతవరకు కష్టపడతాను. చేతి సాయానికి నువ్వున్నావుగా... ఇక భయం దేనికి?" నవ్వుతూ సమాధానం చెప్పిన సుబ్రహ్మణ్యం, తన రాకను పసిగట్టి పెరట్లోంచి అరుస్తున్న మహాలక్ష్మి లాంటి ఆవు దగ్గరికి వెళ్లి ప్రేమగా నిమిరాడు.



అరిటాకు ముక్కలో అరడజను గార్లు, అల్లం పచ్చడీ వేసి, పొట్లంకట్టి చేతిలోపెట్టి, కుమారస్వామిని పంపించేసి వీధి తలుపు దగ్గరగా వేసి, తానూ పెరట్లోకి వచ్చింది సరోజ.

"ఈరోజు కుడితి సరిగ్గా పెట్టలేదా? లక్ష్మి ఇంకా అరుస్తోంది" చిట్టూ, తవుడూ ఎత్తిన బస్తాలు గోడకి నిలబెడుతూ అడిగిన భర్త చేతికి, తాగడానికి కుండలోని చల్లని మంచినీళ్లు, రాగి గ్లాసుతో ముంచి తెచ్చి అందించింది సరోజ.

"ఎందుకు పెట్టలేదూ... మినపప్పు కడిగినవీ, బియ్యం కడుగునీళ్ళూ కూడా కుడితిలో పోసి పట్టించాను. చూలు కట్టింది కదా... ఆకలి ఎక్కువగా ఉన్నట్టుంది. ఆ మూలనున్న మోపులోంచి కాస్త జనుము తీసి వెయ్యండి. కాస్సేపాగి దానికి కూడా కుండలో నీళ్లు బకెట్లో పోసి తాగిస్తాను. తాపం తగ్గుతుంది!" ప్రేమగా ఆవుని నిమురుతూ చెప్పింది సరోజ.

ఆ పల్లె వాతావరణంలో స్వచ్ఛమైన నీరూ, కొబ్బరి బొండాలూ తప్ప, ఏ రకమైన డ్రింకులూ తాగడానికి ఇష్టపడని ఆ

దంపతులిద్దరూ, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. వేసవి తాపం తీరడానికి నల్లని మట్టికుండకి అడుగువైపు సున్నం పూసి, చుట్టూ తడిపిన తెల్లని వస్త్రాన్ని చుట్టి ఉంచుతుంది సరోజ. ఎండలోంచి రాగానే, ఆ చల్లటి నీళ్లతో గొంతు తడుపుకుంటే అలసటంతా మర్చిపోయి, హుషారుగా తిరిగే భర్తను చూసి మురిసిపోతుంది. రిటైరయ్యి పదేళ్లు దాటినా, రోజూ సైకిలు తొక్కుకుంటూ పొలం దగ్గరకి వెళ్లి, నీరు పెట్టడం దగ్గరనుండి, అన్ని పనులూ తానే స్వయంగా చూసుకునే భర్తకి, ఇష్టమైనవన్నీ వండి పెట్టి, సేవలు చేయడంలోనే సంతృప్తిని వెతుక్కుంటుంది సరోజ.

ఆరు సంవత్సరాల క్రిందట సరోజకి తీవ్రమైన అనారోగ్యం చేసినప్పుడు, కేవలం ఆవుపాలని మాత్రమే వాడమని చెప్పిన డాక్టర్ సలహా మేరకు, యాభైవేలు పోసి ఆవుని కొని తెచ్చాడు సుబ్రమణ్యం. ఆ ఆవు వచ్చిన దగ్గర నుంచీ, సరోజ ఆరోగ్యం కూడా చాలా మెరుగుపడింది. రోజూ ఉదయాన్నే నాలుగు గంటలకల్లా లేచి, లక్ష్మిని కట్టి ఉంచిన పాకను శుభ్రం చేసి, ఇత్తడి తప్పేలా తోమి, బావి దగ్గర గట్టుమీద బోర్లించి ఉంచి, లక్ష్మికి పెట్టడానికి చిట్టూ, తవుడు కలిపి సిద్ధం చేస్తుంది సరోజ.

వేపపుల్ల నములుతూ, చేదతో బావిలో నీళ్లు తోడుకుని దంతధావనం పూర్తిచేసుకుని, మరో రెండు చేదల నీళ్లు చిట్టు కలిపిన బకెట్ లో పోసి, లక్ష్మి ముందుంచి, గంగడోలు నిమిరే సుబ్రహ్మణ్యం చెప్పినట్టు వింటుంది లక్ష్మి. చల్లటి నీటితో పొదుగు శుభ్రం చేసి, రెండు కాళ్ళ మధ్యనా తప్పేలా ఉంచి, పాలు పితకడంతో సుబ్రహ్మణ్యం దినచర్య మొదలవుతుంది. గోపూజ చేస్తేనే కానీ కాఫీ కూడా ముట్టుకోదు సరోజ. ఆవుని సొంత బిడ్డలా పెంచుకుంటున్న ఆ దంపతుల్ని చూసి, ఊరివారంతా ముచ్చటపడేవారు.

పెద్దగా ఉరుములతో వచ్చే వర్షాలంటే లక్ష్మికి చాలా భయం. అలాంటి వర్షాలు పడుతుంటే అర్ధరాత్రి అయినా లెక్కచేయకుండా, లక్ష్మిని జాగ్రత్తగా తెచ్చి చూరు కిందకి ఉంచి, తెల్లవార్లూ అక్కడే గడిపేవాడు సుబ్రహ్మణ్యం.

“సాయంత్రం పొలం వైపు వెళ్ళినప్పుడు గట్టుమీది చెరుకురసం చెట్టువి కాయలేమైనా తయారయ్యాయేమో చూడండి. టెంక పడుతున్న కాయలతో, పెసర ఆవకాయ పెడితే మా చెల్లెలు మొగుడికి చాలా ఇష్టం. వాళ్ళు ఎలాగూ వస్తున్నారు కదా... నాలుగు కాయలు తొక్కి, తొక్కుడు పచ్చడి కూడా పెట్టి పంపిస్తాను. నేను పెట్టే కొత్త ఊరగాయ రుచి చూస్తేకానీ ముద్ద దిగదతనికి!” పెరట్లోవున్న భర్తకి వినపడేలా గట్టిగా చెప్పింది సరోజ.

“అలాగే. ఈరోజు అరటిగెల కూడా కొట్టించేస్తాను. మన లక్ష్మి కూడా అమృతంలాంటి ఆ అరటిపళ్లంటే మహా ఇష్టంగా తింటుంది. అదిగో... మీ భాను వాళ్లు వచ్చినట్టున్నారు. మాటలు వినపడుతున్నాయి. తలుపు తియ్యి!” అంటూ పెరట్లో తాడు మీద ఆరేసిన తువ్వాలు తీసి, భుజం మీద వేసుకుని వాకిట్లోకి వచ్చాడు సుబ్రహ్మణ్యం.

సరోజ చెల్లెలు భానుమతీ, ఆమె భర్త మూర్తీ వచ్చి నాలుగు రోజులున్నారు. ఆ నాలుగు రోజుల్లోనూ మూర్తి, పొలం పనుల్లో సుబ్రహ్మణ్యంకు చేదోడు వాదోడుగా ఉన్నాడు. చాలా ఏళ్లుగా తరచూ ఆ యింటికి రావడం, తోడల్లుడికి పనుల్లో సాయం ఉండడం వల్ల, ఆ ఇంటిమనుషులతో పాటు, ఆవు లక్ష్మికి కూడా బాగా అలవాటైపోయాడు మూర్తి.

★★★

చేను కోతలు కోయించి, ధాన్యం కళ్ళంలో రాసిపోసాక, అకస్మాత్తుగా ముసురు పట్టింది. ఈసారి ధాన్యం మిల్లుకి పంపకుండా, కళ్ళంలోనే బేరం పెట్టేసి, వచ్చిన డబ్బుతో పొలంలో నీరు తోడటానికి మోటారు కొందామనీ... సరోజ

పుస్తెలతాడు పెరిగిపోవడంతో, ఓ కాసు బంగారం కొని కొత్తది చేయిద్దామనీ అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. కానీ అకాల వర్షాలకు పంట మొత్తం కొట్టుకునిపోయేలా ఉండడంతో కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఏం చెయ్యాలో దిక్కుతోచక కాస్త తెరిపిస్తే, గొడుగేసుకుని, సైకిలు మీద పొలం వరకూ వెళ్లి చూసొద్దామని అరుగు మీదే కూచుండిపోయాడు.

"ఏవండీ! అలా ఎంతసేపని గుమ్మంలోనే కూచుంటారు? ఆ దేవుడికి దణ్ణం పెట్టుకోవడం తప్ప, ఏమీ చెయ్యలేం. కాస్త ఎంగిలి పడండి. లక్ష్మి కూడా ఈరోజు గంజి పెట్టినా తాగలేదు. కడుపులో నిమ్ముగా ఉందో... లేక బిడ్డ భూమ్మీద పడే వేళయ్యిందో. పిడుగులకి భయపడుతోంది. ఎలా అరుస్తోందో చూడండి!" దిగులుగా చెప్పింది సరోజ.

గోదావరి పోటుమీదుండడంతో లంక గ్రామాల్లో వరద ముంపు భయం పట్టుకుంది. ఇంట్లోనించి బయటకు కదల్లేని పరిస్థితి. చూరు నీళ్ల కింద పెట్టిన బకెట్టు నిండి, నీళ్లు పొర్లిపోతున్నాయి. పెరట్లోని మొక్కలన్నీ ధారగా కురుస్తున్న వర్షం ధాటికి నిలబడలేక, నేలమీదకి వంగిపోయాయి. దొడ్డంతా నీటితో నిండిపోయింది. లక్ష్మిని కట్టి ఉంచిన పాక వరకూ, నడకదారి కోసం వేసిన నాపరాళ్ల మీదనుంచి నీరు ప్రవహిస్తోంది. మెల్లగా దాటుకుంటూ, పాకలోకి వెళ్లి, భయంలేదన్నట్టు లక్ష్మి వీపు మీద చేత్తో ప్రేమగా నిమిరాడు సుబ్రహ్మణ్యం. దాలిలో ఉంచిన ఉలవలు తీసి, కుడితిలో కలిపి పట్టించాడు. తినడానికి అయిష్టత చూపడంతో, ఎండు గడ్డిని ఉండగా చేసి, మధ్యలో బెల్లం ముక్క ఉంచి, నోట్లో పెట్టి తినిపిస్తూ, చిన్నచిన్న తెలకపిండి ముక్కలు నోటికందిస్తూ, గంగడోలు నిమురుతుంటే... తనను వదిలి వెళ్ళద్దన్నట్టు కన్నీరు కార్చింది లక్ష్మి. ఆ మూగజీవి ప్రసవించే సమయం దగ్గరపడుతోంది!

కొబ్బరిచెట్టు పైన, మొదలు మీద మట్టల చాటుకి ఒదిగి కూచున్న కాకి, తడిసిన రెక్కల్ని మరింత దగ్గరగా ముడుచుకుని, చలికి వణుకుతోంది. కనపడని పొద్దుకోసం, ఒంటికన్నుతో వెతుకుతోంది. కాస్సేపటికి మెల్లగా విడుతున్న మబ్బుల్ని చూసి, రెక్కలు విదిలించుకుంది. చెట్టు దిగి, ఆవు తినకుండా వదిలేసిన ఉడికించిన ఎర్రని ఉలవల్ని ముక్కుతో పొలుపుతూ, ఆకలి తీర్చుకునే ప్రయత్నం చేస్తోంది.

"సరోజా! కొంచెం ఆవుని కనిపెట్టుకుని ఉండు. తాగించడానికి నీళ్లు కాచి, చల్లార్చి ఉంచు. అరగంటలో వచ్చేస్తాను"

కుండపోతగా కురుస్తున్న వర్షం కొద్దిగా తెరిపివ్వడంతో, చేను దగ్గర పరిస్థితి ఎలా ఉందోనన్న ఆందోళనతో సైకిలూ, గొడుగూ తీసుకుని బయలుదేరాడు సుబ్రహ్మణ్యం. పెడలు మీద కాలు బలంగా వేసి తొక్కితే కానీ సైకిలు ముందుకి కదలట్లేదు. రొప్పుతూ, ఆయాసంతో చేను దగ్గరకి చేరి, తడిసిన ధాన్యపు రాసుల్ని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు.

"ఈ టయంలో మీరెందుకొచ్చారు అయ్యగోరూ? నే సూత్తాను కదా. ఎవ్వరం చేసేదేటీ లేదు. గోదారి కట్ట తెగి ఊరి మీద యిరుచుకుపడేలాగుంది. ఇంటికాడ అమ్మగోరొక్కరే ఉన్నారు. ఈడకి రాడం మంచిది కాదు. మళ్ళీ చినుకు పెరుగుతాంది. తడుత్తం మంచిదికాదు. పదండి!" అంటూ కుమారస్వామి తొందరచెయ్యడంతో ఇంటిముఖం పట్టాడు సుబ్రహ్మణ్యం.

సైకిలు తొక్కుతుంటే ఆయాసం ఎక్కువయ్యింది. శ్వాస తియ్యడం కష్టంగా అనిపించి, మెల్లగా తొక్కుకుంటూ ఇల్లు చేరాడు. ఇన్నాళ్ళూ స్వచ్ఛమైన పైరగాలిని పీల్చి బతికిన ఊపిరితిత్తులు, వర్షపు గాలికి ఉక్కిరిబిక్కిరై భారంగా శ్వాసిస్తున్నాయి.

"హమ్మయ్యా! వచ్చారు కదా! లక్ష్మికి నొప్పులొస్తున్నాయి. తట్టుకోలేక అరుస్తోంది" ఏం చెయ్యాలో పాలుపోక గాభరాగా అటూ ఇటూ తిరుగుతున్న సరోజకి, భర్త రాక కొంత ఊరటనిచ్చింది.

ఆవు ఈనేదాకా దగ్గరుండి, వెచ్చచేసిన కొబ్బరినూనెను పొట్టకి రాస్తూ, అక్కడే ఉండిపోయాడు సుబ్రహ్మణ్యం. గబగబా కాసిని పచ్చిబియ్యం చేటనిండా పోసి తినడానికి లక్ష్మి ముందు పెట్టాడు. అప్పుడే పుట్టిన లేగదూడ తెల్లగా మెరిసిపోతుంటే, గుడ్డతో ఒత్తి, ఒళ్ళంతా తుడిచి శుభ్రం చేసాడు. ముర్రిపాలు చేపుతున్న దూడను, లక్ష్మి ప్రేమగా నాలుకతో స్పృశిస్తుంటే ఆనందంతో కళ్ళు తుడుచుకున్నాడు సుబ్రహ్మణ్యం.

చేతికందిన పంట కొట్టుకొనిపోవడంతో, దిగులుతో కుంగిపోయాడు. నెలరోజుల తర్వాత ఓరోజు ఉదయం ఇడ్లీ తింటుండగా పొలమారి, గుండె పట్టెయ్యడంతో, శ్వాస అందక గిలగిల్లాడిపోయాడు సుబ్రహ్మణ్యం. రెండు రోజులు, ఆయాసంతో బాధపడి, మూడవరోజు ప్రాణం వదిలేసాడు. కళ్లముందే భర్త ప్రాణాలు వదిలెయ్యడం చూసి, తట్టుకోలేకపోయిన సరోజ ఆ పదిరోజులూ అపస్మారకస్థితిలోనే ఉంది. కర్మకాండలు జరిపించి పితృ ఋణం తీర్చుకుంటున్న కొడుకు, పన్నెండవ రోజున దశదానాలతోపాటుగా గోదానంగా యింటి ఆవును, దూడను ఇవ్వాలని నిర్ణయించుకోవడంతో, వద్దని వారించాడు మూర్తి. కానీ సుబ్రహ్మణ్యం చనిపోయాక, ఆ ఆవుని చూసేవారు లేకపోవడంతో, చివరకు ఆవుని గోదానంగా ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.

యజమాని లేని ఇల్లు వదిలి వెళ్తున్న ఆ యింటి మహాలక్ష్మి మౌనంగా రోదించింది. సోంపిల్లి చేరిన లక్ష్మి రెండురోజుల్లో కట్లు తెంచుకుని, మళ్ళీ లంకలోని తన యింటికి చేరుకుంది. ఆ కుటుంబం నుంచి తనను విడదీయవద్దన్నట్టుగా కన్నీళ్ళతో 'అంబా' అని అరుస్తూ వేడుకుంటున్న ఆ ఆవునీ, దూడనీ ముప్పైవేలు చెల్లించి, తిరిగి తమవద్దకే తెచ్చుకున్నాడు మూర్తి. కొబ్బరిచెట్టు మీది కాకి, దూడ వీపుపై చేరి గెంతుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

సుబ్రహ్మణ్యం మాస్టారి ఫోటో ముందర, పెరట్లో పూసిన కైజారుమల్లి గుత్తినుంచి దణ్ణం పెట్టుకుంది సరోజ.

# సంక్షేమం

వి. రాజారామమోహనరావు

✆ 9394738805

***గ్రౌండ్ ప్లస్ ఆరంతస్తుల బిల్డింగ్ కట్టారు. గేటెడ్ కమ్యూనిటీ సౌకర్యాలతో, స్టేండ్ ఎలోన్ బిల్డింగ్ అది. ఒక్కో అంతస్తులో ఒక్కో కుటుంబం! ఎవరి స్వతంత్రం, ఎవరి కుటుంబం వారిదే! కానీ అందరి కాపురం ఒక్క ఇంట్లోనే! అందరి గృహప్రవేశం ఒకేసారి జరిగింది. తమ చిన్నప్పటి ఉమ్మడి కుటుంబంలా, సంతోషం, కలివిడి.., కావాలన్నప్పుడు కలిసి తింటున్నారు. పండగలు మళ్లీ పండగలయ్యాయి.***

"నా కన్నా ముందు మా ఆయన చచ్చిపోవాలి!" అంది రుక్మిణమ్మ.

"అదేమిటి?" అంది ఆశ్చర్యపోతూ పద్మ.

"మా పెళ్ళయిన ఈ యాభై ఆరేళ్లలో మొదటి నుంచి, ఈనాటి వరకూ అన్ని పనులూ ఆయనకి నేను చేయటమే! తాగిన మంచినీళ్ళ గ్లాసు కూడా, నేనే అందుకుంటాను. అలా చెయ్యటమే నాకు తృప్తి! ఆయనంతగా ఆయనకి చిన్న పని కూడా ఇంట్లో అలవాటు లేదు. నేను ముందు పోతే, ఆయనకి అలా చేసేవారెవరున్నారు? ఎవ్వరూ లేరు! ఆ పరిస్థితి వస్తే తనలో తనే కృంగిపోయి, నరకం అనుభవిస్తారు!"

'నాకన్నా ముందే మా ఆవిడ పోవాలి! బైట ప్రపంచం సరిగా తెలియని వెర్రి బాగుల్ది! నే లేని రోజు, ఒంటరిగా దానికి ఒక్కరోజు కూడా గడవదు!' ఇది పరమేశ్వర్రావు గారికి తరచుగా వచ్చే ఆలోచన!

తమ దగ్గర ఎవరూ లేక, ఇద్దరే జీవితాన్ని గడుపుతున్న వృద్ధ దంపతులు ఎందరెందరో!

ఇలాంటి రుక్మిణమ్మల్ని, పరమేశ్వర్రావుల్ని ఎందరెందర్నో పర్వతాలరావుగారు చూసారు. వాళ్ల గోడు తెలుసు!

పర్వతాలరావుగారి కుటుంబం వాళ్లు నగరంలో అయిదుగురున్నారు. అందరూ వృద్ధాప్యంలో ఉన్నవాళ్ళే! వారికి ఇద్దరు సోదరులు, ముగ్గురు చెల్లెళ్ళు. అందరూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా బాగానే వున్నారు. అందరివీ సొంత ఇళ్ళే. అవీ చిన్న సైజు బంగళాలు! పోతే ఒక్కటే చిక్కు. విపరీతంగా విస్తరించిన నగరంలో, అన్నీ తలో మూలా ఉన్నాయి! ఒకరొన్కరు చూసుకోటానికి కనీసం పాతిక కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి. పైగా అపరిమితమైన ట్రాఫిక్! ఓపికలు అంతంత మాత్రమే! అందుకే ఎప్పుడో కాని కలుసుకోలేకపోతున్నారు. అదీకాక అంత పెద్దవాళ్ళు కార్లు నడపటం, శుభ్రం చెయ్యడం కష్టంతో, శ్రమతో కూడింది. సరియైన కాలక్షేపం లేదు. ఎప్పుడూ దిగులు ఆలోచనలు.

ఇవన్నీ పర్వతాలరావుగారి మనసుని బాగా పట్టేసాయి. అందరూ ఒకే నగరంలో ఉన్నా, వేరే వేరే ఊళ్లల్లో బతుకుతున్నట్టు అనిపిస్తుంది. చాలా అసంతృప్తి అనిపించింది.

అందరూ కూడబలుక్కుని 'ఏదో ఒక వృద్ధాశ్రమంలో చేరిపోతేనో' అనిపించింది.

విదేశాల్లో ఉన్న పిల్లల్ని అడిగారు.

"అదేంటి నాన్నగారు, చక్కటి సొంతిల్లు వదులుకుని, మరో దారి లేనట్టు ఓల్డ్ ఏజ్ హోమా... వద్దు వద్దు!" అన్నారు.

వాళ్లు అలా అన్నా, పర్వతాలరావుగారి ఆలోచన ఆగిపోలేదు. ఆలోచిస్తూనే ఉన్నారు. సోదరులని, చెల్లెళ్ళని, వదినల్ని, బావల్ని సంప్రదిస్తూనే ఉన్నారు.

చివరికి ఓ మార్గం దొరికింది. అంతే... ఇక ఆలస్యం చేయలేదు. ఆ పనిలో పూర్తిగా మునిగిపోయారు.

ఏడాది తిరిగే లోపే, పర్వతాల రావుగారి కల సాకారమైంది. అన్ని సౌకర్యాలూ, ముఖ్యంగా వైద్యం అందుబాటులో ఉన్న ప్రాంతంలో విశాలమైన స్థలం కొన్నారు.




గ్రౌండ్ ప్లస్ ఆరంతస్తుల బిల్డింగ్ కట్టారు. గేటెడ్ కమ్యూనిటీ సౌకర్యాలతో, స్టేండ్ ఎలోన్ బిల్డింగ్ అది. ఒక్కో అంతస్తులో ఒక్కో కుటుంబం! ఎవరి స్వతంత్రం, ఎవరి కుటుంబం వారిదే! కానీ అందరి కాపురం ఒక్క ఇంట్లోనే!

అందరి గృహప్రవేశం ఒకేసారి జరిగింది. తమ చిన్నప్పటి ఉమ్మడి కుటుంబంలా, సంతోషం, కలివిడి... కావాలనప్పుడు

కలిసి తింటున్నారు. పండగలు మళ్లీ పండగలయ్యాయి. ఆ ఉత్సాహం, సరదా తిరిగి వచ్చాయి.

ముఖ్యంగా నేను పోతే, తనెలాగా… ఆ ఒంటరితనం ఎలాగా? అన్న ముసలి దిగులు పోయింది. అంతేకాదు, కాలక్షేపానికి లోటు లేదు. కొన్ని సంక్షేమ కార్యక్రమాలు మొదలుపెట్టారు.

ఇతరులు వాడిన, పారేయబోతున్న బట్టల కలెక్షన్ బాక్స్ పెట్టారు. ఆ కార్యక్రమం వీళ్ళ దగ్గర నుంచి ఆరంభించారు. ఆ బట్టలు దిక్కులేని పేదలకి పంపకం చేస్తున్నారు.

ఆ ఆవరణలో చిన్న సాయిబాబా గుడి కట్టారు. ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆ గుడికి వచ్చి వెళ్ళే వాళ్ళు, వాళ్ల ద్వారా ఆదాయాన్ని ఆ కార్యక్రమాలకే వాడుతున్నారు. కాలక్షేపంగా అందరికీ పనీ ఉంటోంది. ప్రయోజనకరంగానూ నడుస్తోంది. నలుగురు మెసులుతున్న సందడి ఉంది.

రకరకాలుగా పెరిగిన నగర నాగరికత చీకట్లో ఇది ఒక కొత్త వెలుగు!

ఆ ఇంటికి పర్వతాలరావు గారు “సంక్షేమ” అని పేరు పెట్టారు. తమకి ఇతరులకు కూడా మంచే. ఆయన నూతన యోచన అలా ఫలప్రదమైంది!

# ద గ్రేట్ ఇండియన్ మిడిల్ క్లాస్

అంగర శ్రీనివాస రవిశేఖర్

✆ 9490751275

> *“నిజమే.... మనకి కాకపోతే, తీసుకొని, అవసరం అయిన వాళ్ళకి ఇచ్చేయొచ్చు కదా”*
> *“పనిలో పని, మనవేం అరేంజ్ చేసామని చెప్పొచ్చు!”*
> *“ఊరంతా పంచుతుంటే, మన అపార్ట్మెంట్ వాళ్లని మాత్రం ఎందుకు వదిలేయాలని? మనమే అరేంజ్ చేసాం అని చెప్పుదాం, తప్పేంటి!”*
> *“తప్పేం లేదు, అలాగే చెపుదాం.”*
> *“మనం కూడ ఈ చిన్న సైజ్ గ్రామానికి నాయకులం అన్నట్టే కదా”*

రాత్రి 8.30కి విశాఖపట్నం వెళ్ళే ‘దురంతో’ ట్రైన్ సికిందరాబాద్ రైల్వేస్టేషన్‌లో చిన్న కుదుపుతో బయల్దేరింది. అప్పటికే తన బెర్త్ కింద సామాను సర్ది, ఓ ఇనుప గొలుసుతో సూట్‌కేసులన్నీ కలిపి, జాగ్రత్తగా బెర్తుకున్న కొక్కానికి కలిపి తాళం వేసి, సావకాశంగా కూర్చున్నాడు వాచస్పతి!

ట్రైన్ బయల్దేరిన వెంటనే టైమ్ చూసుకొని, “సమయానికే తీసాడు బండి! మరి సమయానికి వెళతాడో లేదో చూడాలి.” పక్కనున్న వాళ్ళ వైపు పలకరింపుగా చూసి అన్నాడు.

భార్య వైపు చూసి, “తినేస్తే ఓ పనైపోతుంది. బాక్సులు తియ్యి” పురమాయించి, ‘కాస్త అక్కడ కూర్చుంటారా?’ అన్నట్టుగా పక్కన కూర్చున్న అతనికి సైగ చేసి, జేబులోంచి సానిటైజర్ తీసి భార్య చేతిలో రెండు చుక్కలు వేసి, తనో రెండు వేసుకొని బెర్త్ మీద అడ్డంగా మఠం వేసుకొని కూర్చున్నాడు వాచస్పతి.

తెచ్చుకున్న రెండు బాక్సులు ఖాళీ చేసి, వాష్‌బేసిన్ దగ్గర కడుక్కొచ్చి, “బావులేదండీ, అస్సలు బావులేదు, ట్రైన్, టాయిలెట్ల మెయింటెనెన్స్ దరిద్రం!” పక్క వాళ్ళను చూసి కామెంట్ చేస్తూ, భార్యకి డబ్బాలు సద్దేయమని సూచించి, బెర్త్ మీద చతికిల పడ్డాడు.

అటుగా వెళ్తున్న కోచ్ అటెండెంట్‌ను ఆపి “ఏవయ్యా, బెడ్‌రోల్స్ ఇవ్వలేదు!” అడిగాడు వాచస్పతి.

పైనున్న కవర్లని చూపిస్తూ, “గలీబులు తెస్తా, ఉండండి!” చెప్పాడు అటెండెంట్.

“సరిగ్గా ఉతికారో లేదో చూడాలి. ఈ కాంట్రాక్టులంతా పెద్ద వ్యవహారం!” అంటూ, గతంలో రైల్వే మంత్రులు, ఎవళ్ళ హయాంలో ఏ చర్యలు చేపట్టారో, రైల్వే బడ్జెట్ల దగ్గర నుంచీ, కేంద్ర రాజకీయాలు వరకు ఏకబిగిన మాట్లాడేసాడు వాచస్పతి.

“కరప్షన్, అవినీతి, అదండీ అన్నిటికీ మూలం” ఓ తత్వవేత్తలాగా ముగించి, ఇక పడుకుందాం అంటూ పక్కనున్న అతన్ని లేవమని సూచించాడు.

★★★

ఉదయాన్నే వాకింగ్ పూర్తి చేసి, వస్తూ వస్తూ తెచ్చుకున్న తెలుగు పేపరు తెరుస్తూ సెక్యూరిటీ వాళ్లు వేసుకున్న కుర్చీలో కూలబడ్డాడు వీరబ్రహ్మం.

"ఏవయ్యా సూరిబాబూ, ఏవిటి విశేషాలు? అవతల గేటు దగ్గర ఆ కారుని రోజూ చూస్తున్నా, ఎవరిది?" అంటూ సెక్యూరిటీ అతనితో మాటలు కలిపాడు.

అది... ఆ ఊళ్ళో, ఓ పాష్ లొకాలిటీలో ఉన్న అపార్ట్మెంట్ బిల్డింగ్! ఎక్కువగా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వాళ్లు ఉండే ఏరియా! వీరబ్రహ్మం... ఆ అపార్ట్మెంటు సొసైటీ సెక్రటరీ. రోజూ తెల్లారేలోపే వాకింగ్ అంటూ దిగిపోతాడు. వాకింగ్ అయిన తర్వాత, ఇక్కడ సిటింగ్ వేస్తాడు. పేపరు చూస్తున్నట్టే ఉంటూ, అందరి విషయాలు, సెక్యూరిటీ వాళ్ళ దగ్గర్నుంచి కూపీలాగడం అతని దినచర్య!



మధ్య మధ్య పర్సనల్ టచ్ కోసం "అవునోయ్ సూరీ, ఈ మధ్య మీ ఊరు వెళ్లలేదా?" అంటూ ఊళ్లో విషయాలు ఎంక్వైరీ చేస్తాడు.

"ఎలా వెళుతున్నారయ్యా ఆ రోడ్ల మీద... అడగరా?" అంటూ వెంటనే టాపిక్ మార్చి "అన్నట్టు పింఛన్లు పెరిగాయట కదా!" అంటూ సానుభూతిగా, కళ్ళెగరేశాడు సూరిబాబు కేసి చూస్తూ!

ఇంకా పగటి డ్యూటీ చెయ్యాల్సిన 'చంద్రావ్ రాలేదేవిటా' అని చూస్తున్న రాత్రి డ్యూటీ సూరిబాబు ఏదో అర్థం కాకుండా నసిగాడు.

ప్రస్తుత ప్రభుత్వం , అంతకు ముందు, ఇంకా ముందు, 1983లో రాజకీయ ప్రభంజనం , ఆ తర్వాత సంక్షోభం, నల్లధనం, అసలు ఉచితాలు ఎప్పుడు ఎలా ఆరంభం అయ్యాయిలాంటి చరిత్ర పాఠం చెప్పి, "ఓ విషయం రాసి పెట్టుకో సూరీ... నే చెప్తున్నా ఈరోజు!"

ఇంతలో ఊబర్ టాక్సీ వచ్చి ఆగింది. అందులోంచి వాచస్పతి, వాళ్ళావిడ దిగారు!

"ప్రెసిడెంటుగారూ... హైదరాబాద్ ట్రిప్ అయిపోయిందా?" పలకరించాడు వీరబ్రహ్మం, తను చెప్తున్న మాట ఆపి.

వాచస్పతి ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్.

"మనం ఓసారి సాయంత్రం కూచోవాలండీ!" అంటూ వీరబ్రహ్మం వాచస్పతితో చెప్తూ, అతనితో పాటు లిఫ్ట్ ఎక్కి వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ ఒకే ఫ్లోర్‌లో ఉంటారు.

వాళ్ళిద్దరి పిల్లలూ విదేశాల్లోనే ఉండేది. వాళ్ల చదువులప్పుడు, డాలర్ రేట్ పెరిగి రూపాయి రేటు తగ్గినప్పుడల్లా, తెగ బాధపడిపోయి, అపార్ట్మెంటు గేటు దగ్గర నించుని, భారత ఆర్థిక వ్యవస్థ, రిజర్వు బ్యాంకు మీద గంటలు గంటలు మాట్లాడుకునేవారు. అప్పటి నుంచి మంచి స్నేహం ఇద్దరికీ.

ఇప్పుడు ఇద్దరి పిల్లలకి అక్కడే ఉద్యోగాలు! డాలర్ రేట్ పెరిగినప్పుడల్లా, ఇప్పుడు సంతోషంగా ఆ విషయం షేర్ చేసుకుంటారు. ఈమధ్యే ఇద్దరి పిల్లలు, రెండేసి కోట్లు పెట్టి అపార్ట్మెంట్లు కొన్నారు. ఇ ఎమ్ ఐ లు కట్టాలి కదా!

★★★

సెక్యూరిటీ చంద్రావ్ , ఇంటర్‌కమ్ ఫోన్‌లో, సెక్రటరీ వీరబ్రహ్మానికి ఫోన్ చేసాడు.

"సార్ ఎవరో వచ్చారు, బహుమతులు ఏవో, అన్ని ఫ్లాట్ల వారికి ఇవ్వాలి అంటున్నారు. మిమ్మల్ని కనుక్కొని పంపుతానన్నాను! కొంచెం రండి సార్!"

"ఎవరు?" అడిగాడు వీరబ్రహ్మం.

"ఎవరో పెద్దవాళ్ళే పంపినట్టున్నారు సార్, నాయకుడి తాలూకా అనుకుంటా!"

"సరే ఉండు" అంటూ లుంగీతోనే భుజం మీద తుండుగుడ్డ వేసుకుని కిందకి వస్తూ, ఎందుకైనా మంచిదని వాచస్పతిని కూడా వెంటబెట్టుకు వచ్చాడు.

అక్కడ గుట్టగా సంచులు ఉన్నాయి. వాటి మీద లోకల్ నాయకుడి ఫోటో, 'దసరా పండగ అభినందనలతో...' అని ప్రింట్ చేసి ఉంది. లోపల రెండు చీరలు కనబడ్డాయి.

సెక్యూరిటీ దగ్గర నిలబడ్డ వాళ్ళని చూస్తూ... "ఎవరండి మీరు?" అడిగాడు రామబ్రహ్మం.

"మా నాయకుడుగారు పంపారు సార్! వీటిని మీ అపార్ట్మెంట్ వాళ్ళకి పంచమని ఇచ్చారు సార్!" వచ్చిన వాళ్ళు వచ్చిన విషయం చెప్పారు.

ఇద్దరు కొంచం పక్కకు వెళ్ళి, "ఎలెక్షన్లు వస్తున్నాయిగా, ఆ బాపతనుకుంటా!" అన్నాడు రామబ్రహం.

"అదే... కాకపోతే మనం వద్దంటే, అపార్ట్మెంట్ వాళ్ళు మనల్ని ఆడిపోసుకుంటారు. వద్దనడం ఎందుకు?" అంటూ వాచస్పతి సంశయంగా అన్నాడు.

"నిజమే... మనకి కాకపోతే, తీసుకొని, అవసరం అయిన వాళ్ళకి ఇచ్చేయొచ్చు కదా"

"పనిలో పని, మనవేఁ అరేంజ్ చేసామని చెప్పొచ్చు!"

"ఊరంతా పంచుతుంటే, మన అపార్ట్మెంట్ వాళ్లని మాత్రం ఎందుకు వదిలేయాలని మనమే అరేంజ్ చేసాం అని చెప్దాం, తప్పేంటి!"

"తప్పేం లేదు, అలాగే చెబుదాం."

"మనం కూడ ఈ చిన్న సైజ్ గ్రామానికి నాయకులం అన్నట్టే కదా"

"సరే" అనుకుంటూ, ఇద్దరు మళ్ళీ వాళ్ళ దగ్గరకొచ్చి, "మావి ఇక్కడ ఇచ్చేసి, ఓ గంటలో అందరికీ ఇచ్చి వచ్చేయండి" అంటూ రామబ్రహ్మం చెప్పాడు.

"అన్నట్టు మా చెల్లిగారు ఇందులోనే నాలుగో ఫ్లోర్‌లో ఇరవయ్యో నంబర్ ఫ్లాట్ లో ఉంటారు. వాళ్ళు ఊళ్ళో లేరు, ఆ సంచీ కూడా నాకు ఇచ్చేయండి. వాళ్ళకి నేనిచ్చేస్తా" అంటూ వాచస్పతి రెండు సంచీలు అందుకున్నాడు.

"అవునండోయ్ మా తమ్ముడుగారు కూడా ఊరెళ్ళారు" అంటున్న రామబ్రహ్మం, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

సెక్యూరిటీ చందర్రావు పైకే గట్టిగా నవ్వేస్తున్నాడు.

ఇద్దరూ అతని వైపు చూసారు.

అతను మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రాంలో వస్తూన్న రీల్స్ చూస్తున్నాడు.

ఆ మధ్య హిట్టైన ఓ వెబ్ సీరీస్‌లో బిట్. "సాంప్రదాయిని... సుప్పినీ... సుద్ద పూసని..." గట్టిగా వినిపిస్తోంది.

పాటని, అతని నవ్వుని అర్థం చేసుకోడానికి వాళ్ళకి అట్టే సమయం పట్టలేదు!

లంచాలు, దేశ రాజకీయాలు, నైతిక విలువలు, అవినీతి, వంటి విషయాల మీద వాళ్ళిద్దరూ సెక్యూరిటీ వాడి దగ్గర ఇస్తున్న ఉపన్యాసాలు గుర్తుకు రాలేదు.

భుజాలమీద ఉన్న కండువాని తీసి, ఒక్కసారి దులుపుకుని సంచులు పట్టుకుని లిఫ్ట్ వైపు దారితీశారు.

# కధామంజరి
# బాలకధ

# జంబూకవనంలో ఒకరోజు

కథామంజరి బాలకథ

కె.వి. లక్ష్మణరావు

✆ 9014659041

> ***"కుందేలు మాటలు నమ్మకండి. తన మాటల్లో తేడా కనిపిస్తోంది. అడవికి రాజు కావాలని, కుటిల బుద్ధి ప్రదర్శిస్తోంది. కెంపును గట్టిగా నిలదీసి అడుగుదాం. మన మృగరాజును రక్షించుకుందాం!" జగడం గట్టిగా అనడంతో అడవి జీవులన్నీ, నక్కను సమర్థించాయి. "మా మృగరాజు ఎక్కడ?" అని కెంపును మళ్లీ గట్టిగా నిలదీశాయి.***

జంబూక వనం అనే అడవికి 'జగపతి' అనే సింహం రాజుగాను, 'కెంపు' అనే కుందేలు మంత్రిగాను ఉన్నారు.

ప్రతీరోజూ ఉదయం కెంపు, మృగరాజు ఉండే గుహ వద్దకు వెడుతుంది. అడవిలోని విశేషాలను, సమస్యలను, జగపతికి చెబుతుంది. అప్పుడు ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలుపరుస్తారు.

ఆ అలవాటులో భాగంగానే, కెంపు ఆ రోజు ఉదయమే, మృగరాజు ఉండే గుహ వద్దకు వెళ్ళింది.

"మృగరాజా!" అని పిలిచింది.

రోజూ అయితే, కెంపు వచ్చేసరికి, మృగరాజు గుహ పక్కనే ఉన్న రాతి బండ మీద కూర్చుంటుంది. కెంపును 'శుభోదయ' మంటూ పలకరిస్తుంది.

కానీ ఈ రోజు కుందేలుకు, మృగరాజు రాతి బండ మీద కనబడలేదు.

'ఇంకా నిద్రలేవలేదేమో?' అనుకుంటూ, గుహ లోపలకు వెళ్లి, "మృగరాజా!" అని కెంపు మళ్లీ పిలిచింది.

అయితే మృగరాజు, గుహలో కూడా, కనబడకపోయేసరికి కెంపు ఆశ్చర్యపోయింది.

అప్పుడే రాతి బండ పక్కనే ఉన్న చెట్టు మీదకు 'చిత్ర' అనే కాకి వచ్చి వాలింది.

"చిత్రా! మృగరాజును చూశావా?" కుందేలు, కాకి కేసి చూస్తూ అడిగింది.

"ఉదయం, ఆహారం కోసం బయటకు వెడుతూ, రాతి బండ మీద చూసాను. నన్ను పలకరించారు కూడా!" చిత్ర, కెంపు కేసి విచిత్రంగా చూస్తూ అంది.

"అవునా! మరైతే రాజు, ఒంటరిగా ఎక్కడకు వెళ్ళారో... ఏమిటో?" కుందేలు దిగాలుగా అంది.

"అయితే, రాజుగారిని అడవంతా వెతకమని మన తోటి జీవులతో చెప్పమంటారా?" కాకి , కెంపును అడిగింది.

"వద్దు. మన మృగరాజుకు అప్పుడప్పుడూ, ఉదయం నడిచే అలవాటు ఉంది. ఆ విషయం నాకు తెలుసు. అయితే రాజు ఇక్కడ లేరని తెలిస్తే, మన మీదకు వేటగాళ్లు సులువుగా దండెత్తడానికి వచ్చేస్తారు. కనుక మన అడవిలోని జీవులన్నింటికీ, 'మృగరాజు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ ఒక్కరూ రావాలని చెప్పు!" అంది కుందేలు.

'అలాగే'నంటూ, చిత్ర ఎగిరి వెళ్ళింది. సమావేశం గురించి, ఏనుగు, జింక, ఎలుగుబంటి, కోతి వంటి జంతువులకు, కోకిల, చిలుక, నెమలి వంటి పక్షులకూ... అందరికీ చెప్పింది.



కొంతసేపటికి అడవిలోని జంతువులూ, పక్షులూ అన్నీ సమావేశానికి వచ్చాయి.

కెంపు వారందరికీ ఎదురుగా ఉన్న రాతి బండ పైకెక్కి కూర్చొంది.

'జగడం' అనే నక్క కూడా సమావేశానికి అప్పుడే వచ్చింది.

మొన్న జరిగిన మంత్రి పదవికి, కెంపుతో పాటు జగడం కూడా పోటీ పడింది. కానీ తెలివితేటల్లో, కెంపు ముందు నిలబడలేక, పోటీ పడలేక ఓడిపోయింది. తనను మంత్రి కానివ్వకుండా అడ్డు పడిన కుందేలు మీద జగడానికి అప్పటి నుండీ అసూయ ఉంది.

"మృగరాజు సమావేశం ఏర్పాటు చేశారని, కాకి చేత కబురు పంపారు. కానీ మృగరాజు జగపతి ఎక్కడ ఉన్నారు? కనబడరే?' కుందేలు కేసి కోపంగా చూస్తూ అడిగింది జగడం.

"మృగరాజు చిన్న పని ఉండి, ఇప్పుడే బయటకు వెళ్లారు. తాను వచ్చేలోపు, మనల్ని ఆడమని, పాడమనీ చెప్పారు. కనుక జగపతి వచ్చేలోపు, వినోద కార్యక్రమాలు నిర్వహించుకుందాం. ఏమంటారు?" కుందేలు అన్ని జీవుల కేసి తేరిపారా చూస్తూ అడిగింది.

"అలాగే!" అడవి జీవులన్నీ హుషారుగా అన్నాయి.

ముందుగా కోకిల వచ్చింది. కమ్మని పాటలతో అందరినీ అలరించింది. ఆ తర్వాత చిలుక వచ్చింది. తన చక్కని పలుకులతో అందరినీ ఆకట్టుకుంది.

ఆ వెంటనే నెమలి వచ్చింది. తన అందమైన నాట్యంతో అందరినీ అలరించింది. తరువాత కోతి వచ్చింది. తన కుప్పిగంతులతో అందరినీ నవ్వించింది.

ఆటపాటలతో అలరిస్తున్న తోటిజీవులను "శహభాష్" అంటూ కెంపు మెచ్చుకుంది. మరోవైపు 'నడకకు వెడితే ఈ పాటికి వచ్చేస్తారు కదా! ఇంకా రాలేదంటే 'మృగరాజు ఎక్కడకు వెళ్ళారో? ఏదైనా ఆపదలో చిక్కుకున్నారేమో?' ఆలోచించసాగింది.

కుందేలు కలవరం కనిపెట్టిన జగడం ఒక్కసారిగా పైకి లేచింది.

"సమావేశం మృగరాజు ఏర్పాటు చేశారని చెప్పారు. కానీ ఇంకా మృగరాజు ఇక్కడకు రాలేదే? మిత్రులారా... ఆట, పాటలు ఆపండి! కెంపు మాటలు నమ్మకండి. నాకెందుకో అనుమానంగా ఉంది. గతంలో తన తెలివితో మృగరాజును కూడా బావిలో పడేసిన చరిత్ర కుందేలుకు ఉంది. మన మృగరాజు ఎక్కడ ఉన్నారో, అసలు బతికే ఉన్నారో, లేరో? కుందేలును, నిలదీసి అడగండి..." జగడం మాటలు విన్న అడవి జీవులన్ని ఆట, పాటలు ఆపాయి.

"మృగరాజు ఎక్కడ?" అంటూ కుందేలు కేసి కోపంగా చూస్తూ ఒక్కసారిగా అడిగాయి.

కానీ అందరూ ఒక్కసారిగా తనను నిలదీస్తున్నా, కెంపు అదరకుండా, "మృగరాజు ఎక్కడకు వెళ్ళారో నాకూ తెలియదు. మృగరాజు సమావేశానికి రమ్మన్నారని చెబితేనే మీరంతా వస్తారు. మంత్రి రమ్మన్నారంటే అంతా రారు. అందుకే అలా చెప్పాను. మీతో మాట్లాడుతూనే, మరోవైపు మృగరాజు కోసం ఎదురు చూస్తున్నాను!" అని అడవి జీవులన్నింటికి కెంపు చెప్పింది.

"కుందేలు మాటలు నమ్మకండి. తన మాటల్లో తేడా కనిపిస్తోంది. అడవికి రాజు కావాలని, కుటిల బుద్ధి ప్రదర్శిస్తోంది. కెంపును గట్టిగా నిలదీసి అడుగుదాం. మన మృగరాజును రక్షించుకుందాం!" జగడం గట్టిగా అనడంతో అడవి జీవులన్నీ, నక్కను సమర్థించాయి. "మా మృగరాజు ఎక్కడ?" అని కెంపును మళ్లీ గట్టిగా నిలదీశాయి.

"ఇదిగో, నేనిక్కడ!" అంటూ అప్పుడే అక్కడకు వచ్చిన మృగరాజును చూసి, నక్క, కుందేలుతో సహా అన్ని జీవులూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాయి.

జగపతి వెళ్లి రాతి బండ మీద కూర్చొంది.

“కుటిల బుద్ధి, కుందేలుకు లేదు. తాను మంత్రి కాలేక పోవడంతో, జగడం.. రోజూ నా వద్దకు ఎవరూ లేనప్పుడు వచ్చేది. మీరు లేకుండా ఒక్కరోజు కూడా, కుందేలు వేటగాళ్ళ బారి నుండి కాపాడలేదని, కెంపు అల్పజీవని, తనకన్నా బలమున్న నన్ను మంత్రిగా నియమించమని నాతో రోజూ అనేది. కుందేలు తెలివిని బయట పెట్టాలనే, ‘నేను వచ్చేవరకూ, ఎవరికీ నా గురించి ఎవరికి చెప్పవద్దని’ చిత్రతో చెప్పి, మీ అందరికీ కనబడకుండా దాక్కున్నాను. సమూహంగా ఉంటే వేటగాళ్ళు, గుంపులోకి రావడానికి భయపడతారు. కెంపు అందుకే అందరినీ సమూహంగా ఉంచింది. అందరినీ కాపాడింది. ఇప్పటికైనా కెంపు, ఆకారంలో చిన్నదే అయినా, ఆలోచనలో గొప్పదని ఒప్పుకుంటావా?” జగడం కేసి కోపంగా చూస్తూ అడిగింది సింహం.

జగపతి మాటలకు సమాధానం చెప్పలేక, జగడం తల దించింది.

“కుటిలబుద్ధి మానుకుని, అందరితో మంచిగా ఉంటే, నువ్వు కూడా మంత్రివి కాగలవు. తెలిసిందా?”

మృగరాజు మాటలు విని, అర్థమైందన్నట్టుగా తలాడించింది జగడం.

కెంపు తెలివితేటలను, మృగరాజుతో సహా అడవి జీవులన్నీ మెచ్చుకున్నాయి. అభినందనలు తెలిపాయి!

# అపాయంలో ఉపాయం

కథామంజరి బాలకథ

రాచపూటి రమేష్
✆ 9866727042

*మణికంఠుడు వణుకుతూ, 'మహాప్రభూ, నాకేమీ తెలియదు, నన్ను విడిచి పెట్టండి' అన్నాడు, భయంగా. ఈలోగా భటులు గదులు చూసి వచ్చి, 'అయ్యా, గదుల్లో ఎక్కడా ఆ గొలుసు లేదు' అన్నారు, రామశర్మతో. 'ఐతే పెళ్లికి వచ్చిన అతిథులను సోదా చేయండి, రామశర్మ ఆ గొలుసును వారెవరికో ఇచ్చి వుండవచ్చు. ఎవరి వద్ద దొరికినా వారికి జైలు శిక్ష తప్పదు. ఈ నేరం చేసింది ఎంతటి వారైనా, రాజుగారు క్షమించరు' అన్నాడు గంభీరంగా రామశర్మ.*

అవంతీదేశపు రాజైన విజయసింహుని ఆస్థాన ఉద్యోగి మణికంఠుడి కుమార్తె భామరేఖకు వివాహం కుదిరింది. తన ఏకైక కుమార్తె పెళ్లిని ఘనంగా చేయదలచి మణికంఠుడు సింహపు వీధిలో ఉన్న ఒక పెద్ద కళ్యాణమండపాన్ని పెళ్లివేదికగా ఎన్నుకున్నాడు. పెళ్లినాటికి మణికంఠుడి బంధుమిత్రులే కాక, పెళ్లి కుమారుడు సుధీరుడి బంధుమిత్రులు కూడా పెళ్లి మండపం చేరుకున్నారు.

కళ్యాణవేదికపై పెళ్లి తంతు జరుగుతూ వుంది. పెళ్లికొచ్చిన అతిథులు కొందరు తమ ఆసనాలపై కూర్చుని వుంటే కొందరు హడావిడిగా అటూ, ఇటూ తిరుగుతూ ఉన్నారు.

మరొక రెండు గంటల్లో పెళ్లి ముహూర్తం వుంది. మణికంఠుడు పెళ్లికి వచ్చిన అతిథులను ఆహ్వానిస్తూ, పెళ్లి వంటలను పర్యవేక్షిస్తూ, పనివాళ్లకు సూచనలిస్తూ, ఏర్పాట్ల హడావిడిలో అటూ, ఇటూ తిరుగుతూ ఉన్నాడు. ఇంతలో పెళ్లి కుమార్తె గది నుండి బయటకు వచ్చిన అతని భార్య సుశీల మణికంఠుని పక్కకు పిలిచి, పెళ్లి కుమార్తెకు అలంకరించవలసిన బంగారు గొలుసు కనబడడం లేదని కంగారు పడుతూ చెప్పింది.

మణికంఠుడు, సుశీల పెళ్లికూతురు గదితోపాటూ, చుట్టు పక్కల వెతికినా లాభం లేకపోయింది. అతను, అతని భార్య, దగ్గరి బంధువులు పెళ్లి పనుల్లో హడావిడిగా వుండగా ఎవరో గొలుసు దోచుకొని పోయారని అర్థమైంది మణికంఠుడికి. ఈ విషయం బయట తెలిస్తే బాగుండదనుకున్నాడు మణికంఠుడు. పెళ్లికి వచ్చిన అతిథులను సోదా చేసి అవమానపరచడం సబబు కాదనిపించింది అతనికి.

మణికంఠుడికి ఏం చేయాలో దిక్కు తోచలేదు. ఇంతలోనే అతనికి అదే వీధిలో నివసించే కొత్వాలు రామశర్మ గుర్తుకు వచ్చాడు. రామశర్మ తెలివైనవాడే కాక మణికంఠుడికి మంచి మిత్రుడు. ఈ విషయంలో తన మిత్రుడి సలహా తీసుకోవడం మంచిదనిపించింది మణికంఠుడికి.

మణికంఠుడు వెళ్లేసరికి, సమయానికి రామశర్మ ఇంట్లోనే ఉన్నాడు.

'నీ కూతురి పెళ్లికే వద్దామని తయారవుతూ ఉన్నాను. అంతలో నువ్వే వచ్చావు. ఏమిటి విషయం, కంగారుగా కనిపిస్తున్నావు' అన్నాడు రామశర్మ.

మణికంఠుడు తడబడుతూ గొలుసు పోయిన విషయం మిత్రుడికి వివరించాడు.

రామశర్మ కాసేపు ఆలోచించి, 'నువ్వేమీ దిగులు పడకు. ముహూర్తం సమయానికి గొలుసు దొరికేలా నేను చూసుకొంటాను, నువ్వు వెళ్లి పెళ్లిపనులు చూసుకో. మరొక పావుగంటలో నేను మండపానికి వస్తాను' అన్నాడు.



మణికంఠుడు పెళ్లి మండపానికి వెళ్లి పెళ్లి పనులు చూసుకుంటూ ఉన్నాడు. రామశర్మ అన్నట్లుగానే పావు గంటలో కళ్యాణమండపం చేరుకున్నాడు. అతని వెంట పదిమంది రాజభటులున్నారు.

రామశర్మ మణికంఠుని సమీపించి పెద్ద గొంతుతో, 'ఔరా, మణికంఠా, ఎంత సాహసానికి ఒడిగట్టావు! అంతఃపురానికి వెళ్లి వస్తూ, రాజకుమార్తె గొలుసునే చోరీ చేస్తావా' అన్నాడు ఆగ్రహంతో, చుట్టూ కలకలం రేగింది.

మణికంఠుడు వణుకుతూ, 'మహాప్రభూ, నాకేమీ తెలియదు, నన్ను విడిచి పెట్టండి' అన్నాడు, భయంగా.

ఈలోగా భటులు గదులు చూసి వచ్చి, 'అయ్యా, గదుల్లో ఎక్కడా ఆ గొలుసు లేదు' అన్నారు, రామశర్మతో.

'ఐతే పెళ్లికి వచ్చిన అతిథులను సోదా చేయండి, రామశర్మ ఆ గొలుసును వారెవరికో ఇచ్చి వుండవచ్చు. ఎవరివద్ద దొరికినా వారికి జైలుశిక్ష తప్పదు. ఈ నేరం చేసింది ఎంతటి వారైనా, రాజుగారు క్షమించరు' అన్నాడు గంభీరంగా రామశర్మ.

భటులు హడావిడిగా అతిథుల మధ్య తిరుగుతూ, సోదాలు చేయడం ప్రారంభించారు. కాసేపు గడిచింది.

ఈలోగా సుశీలమ్మ హడావిడిగా వచ్చి, మణికంఠుడి చెవిలో గొలుసును ఎవరో పెళ్లికుమార్తె గదిలో యథాస్థానంలో వుంచినట్లు తెలిపింది. మణికంఠుడి సైగనందుకున్నాడు రామశర్మ.

మరొక ఐదు నిమిషాల్లో రాజస్థాన ఉద్యోగి ఒకరు పరుగున వచ్చి రామశర్మతో, 'స్వామీ, రాజకుమార్తె గొలుసు ఎక్కడికీ పోలేదు. అంతఃపురంలోనే దొరికింది' అన్నాడు బిగ్గరగా.

రామశర్మ 'అనవసరంగా నిన్ను అనుమానించి నీతోబాటూ వచ్చిన అతిథులను కూడా వేధించాను మణికంఠా, నన్ను క్షమించు' అన్నాడు.

'ఫర్వాలేదు, భోజనం చేసి వెళ్లండి' అని ఆనందంగా అన్నాడు మణికంఠుడు.

గొలుసును పెళ్లికుమార్తె మెడలో అలంకరించారు. కాసేపటికి నిర్విఘ్నంగా పెళ్లి జరిగిపోయింది.

రామశర్మ ఉపాయాన్ని ఆ తరువాత మణికంఠుడు ఎంతగానో ప్రశంసించాడు.

# రిక్షా ప్రయాణం


## అర్నాద్

✆ 9391381601


***తను ఏ తండ్రికి పుట్టాడో తెలీదు. తల్లి జబ్బుతో పోవడం గుర్తుంది. గున్నయ్య కాఫీ హోటల్లో కప్పులు కడిగి, పప్పులు రుబ్బి పదేళ్ళు చాకిరీ చేసి, వాడి దగ్గర డబ్బు దాచుకుంటే... 'నీవు నా దగ్గర అసలు డబ్బేం దాయలేదు, ఫో పొమ్మన్నాడు'. తను పెళ్ళిచేసుకున్న లచ్చి ముగ్గురు పిల్లల్ని కన్న తర్వాత, కొవ్వెక్కి ఎవడితోనో లేచి పోయింది! తనకన్నీ ఇలాంటి దెబ్బలే! మనిషి మంచితనం మీద నమ్మకమెప్పుడో పోయింది. ఇక ప్రేమా, దయా, అనురాగం, ఆప్యాయతా... ఇవంటే ఏమిటో, ఎలా ఉంటాయో తెలీదు. కాని యిప్పుడు... ఈ అనుభవం కొత్తగా ఉంది.***

"అమ్మా రిక్షా కావాలా" తైల సంస్కారం లేని ఉంగరాల జుట్టు, కోల ముఖంలో చురుకైన కళ్లు, సూది ముక్కు, బండ పెదవులు, మెడలో మురికిపట్టిన తాడు, దానికి వేళాడుతూ ఏడుకొండలవాడి ప్లాస్టిక్ బిళ్ళ, చిన్నచిన్న బొక్కల బనీను, రెండు పెద్ద పేచ్లున్న బిగుతు ఆఫ్ ఫేంటు, బనీన్ని ఫేంటుని కలుపుతూ మురికి పట్టిన నల్లని తోలు బెల్టు, నల్లని ఒళ్ళు. చెప్పులు లేని కాళ్ళు. ముప్పయి మూడేళ్ళ వయసు. పేరు నర్సిమ్మ. నరిసిగాడంటారు అంతా.

"రిక్షా తల్లీ రిక్షా..." గోదావరి ఎక్స్‌ప్రెస్ చాలా ఆలస్యంగా వచ్చింది. అందులో ఆశ్చర్యం లేదు. అదేం అద్భుతం కాదు. ఎప్పుడూ ఉన్న న్యూసెన్సే గాబట్టి పెద్ద బాధాకరమైన విషయం కూడా కాదు. ఆ మాటకొస్తే సీటూ బెర్తు రిజర్వేషనూ... వీటికన్నా ఇదిగో ఈ ఊళ్ళో స్టేషన్నించి ఇంటికి వెళ్ళడమే అసలైన బాధ. సిసలైన గాథ!

"రిక్షా కావాలేటమ్మా?"

ఆ ప్లాటుఫారం అవతల ఉండాల్సిన రిక్షావాడు ప్లాటుఫారం టికట్ లేనే లేకుండా ప్లాటుఫారం మీదికి ప్రవేశించి, బిలబిలమంటూ రైలు దిగిన జనాన్ని దేవేస్తున్నాడు. పట్టే యత్నంలో పోటీలో రెండూ, మూడు చిక్కినట్టు చిక్కి, చేజారి పోయేయి. నిరాశ ఆ క్షణం! ఆశ మరుక్షణం. మళ్ళీ ప్రయత్నం. పరుగు పట్టు.

"అమ్మా రిక్షా..." అమ్మని వదిలేలాలేదు రిక్షా నరిసిగాడు.

ఆయమ్మ 'అమ్మ' అంటే అమ్మకాదు. అమ్మమ్మ .. నరిసిగాడికి కాదు. ఆమె చెంగు పట్టుకొని నడుస్తున్న చిన్నారి చిట్టికి. ఏడేళ్ళ బూరిబుగ్గల పెద్దకళ్ళ చిట్టికి!

చిట్టి అమ్మమ్మని పట్టుకు నడుస్తుంటే, అమ్మమ్మ ట్రంకు పెట్టిని పట్టుకు నడుస్తోంది.

పెట్టిని మోస్తుంటే చేయిలాగేస్తోంది ఆమెకి. పదడుగులు నడిచింది. పెట్టె నేల దించింది. పెట్టిని కుడిచేతి నుంచి ఎడమచేతికీ, చిట్టిని ఎడమచేతి నుండి కుడిచేతికి మార్చుకు నడుస్తోంది. మనిషిని చూస్తే, అలాంటి బరువు పెట్టెలు పది ఒక్కసారే మోసేయగలదు అనిపిస్తుంది. కాని ఆమె తన వొళ్ళు తనే మోయలేకపోతోంది. ఆమె శరీరం యినపరాయిలా గట్టివొళ్ళు

కాదు. గాలి నింపిన బెలూన్లో నీరు పట్టిన వొళ్ళు. నాలుగడుగులు నడిస్తే చాలు కాళ్ళు పొంగుతాయి. ఆమె వయసు యాభై అయిదేళ్ళు. పేరు సోములమ్మ. కాని అంతా దిబ్బమ్మ అంటారు.

"ఎక్కడికమ్మా ఎల్లాల?"

వెళ్ళాల్సిన చోటు ఇక్కడా, అక్కడా లేదు. చాలా దూరం. ఆటో అయితే పదో, పన్నెండో అడిగే దూరం. బస్సయితే రూపాయి తీసుకొని పది పైసలు తిరిగిచ్చే దూరం.

తను వెళ్ళాల్సిన సిటీ బస్సు దొరికే బస్టాండు దిబ్బమ్మకి తెల్సు. ప్లాటుఫారం అంచు నుంచి చూస్తే అదిగో, అల్లదిగో



కనిపిస్తోంది... పెట్రోలు బంకు పక్కన నడిస్తే అయిదు నిమిషాలు.

ఆమె నడిచేయగలదు... కాళ్లు పొంగినా ఖాతరు చేయకుండా! ఈ గుంట పాప, ఆ ట్రంకు పెట్టె లేకుంటే నడిచేసును.

తను వెళ్లాల్సిన బస్టాండు చెప్పి, చూపించి 'ఎంతిమ్మంటావు?' అనడిగింది.

"రెండ్రూపాయిలిప్పించండి"

రిక్షావాళ్లు అడిగే రేట్లు చూస్తే సింహాచలం, పెందుర్తి అయినా నడిచి పోవాలనిపిస్తుంది. అది అనిపించడం వర్కే! నసిగో, గుణిసో, ముక్కో, మూలిగో వాహనం ఎక్కకుండా వెళ్ళలేం మనం చివరికి. ఈ నాగరికత ఎలాంటి దూరాన్నయినా నడిచిపోగలమనే సంగతి మనం మర్చిపోయేట్టు చేసింది. మన పూర్వీకులు కాశీకి నడిచి వెళ్లారంటే తెల్లమొగాలు వేయడం వేరే సంగతి. పెదవాల్తేరు నుంచి పూర్ణా మార్కెట్ కి ఏమీ కాకుండా నడిచేసిన వాళ్ళు. సిటీబస్సు కోసం గంటల కొలదీ వెయిట్ చేసి, నలిగిపోతూ, వేలాడ్డానికే ఇష్టపడుతున్నారిపుడు. కాలం!

“ఏటీ రెండడుగుల దూరానికి రెండు రూపాయలా! అవ్వ! ఏం ఆశరా?”

“అదేటి తల్లీ అలాగంటారు! రెండు రూపాయల్కి శేరునూకలు రావడం లేదు.”

ఆమె అన్నది వేరు. వాడు చెప్పింది వేరు. కాని రెంటికీ లింకు ఉందనేది వాస్తవం.

అంచేత రిక్షావాడి రేటుబట్టి ఆ పట్నం కాస్ట్ ఆఫ్ లివింగ్ ఏ స్థాయిలో ఉందో ఈజీగా చెప్పేయవచ్చంటారు. ఒకే దూరానికి రిక్షావాడు రాజమండ్రిలో అర్ధరూపాయికి కడ్తాడు. విజయవాడలో ముప్పావలాకి కడ్తాడు. వైజాగులో అర్ధలూ, పావలాలు నైజానా! ‘మూడు రూపాయలవుద్ది, యిష్టమైతేరా, కష్టమైతే పో’ అంటాడు.

రెండు రూపాయలివ్వడం దిబ్బమ్మకి తన జరుగుబాటు బట్టి పెద్ద కష్టమేమీ కాదు. కాని కనిపించే ఆ మాత్రం దూరానికే రెండు రూపాయలు అర్పించాలంటే యెవరి మనసైనా ఎలా ఒప్పుతుంది?

దిబ్బతనం “సుఖంగా, హాయిగా కష్టబడకుండా బతికేస్తున్నాడు” అనే దానికి సాక్ష్యం, సంకేతం. కాని దిబ్బమ్మ కష్టజీవి. ఆమె కష్టపడి సంపాదించడాన్నే నమ్ముకుంది. ప్రేమిస్తుంది, ఇష్టపడుతుంది. కోరుకుంటుంది. ఏడేళ్ళ కిందట జబ్బు పడి ఒళ్ళు వచ్చింది గాని అంతకుముందు రివటలా లేకపోయినా లావు మాత్రం కాదు.

తను కష్టం చేసి తను బతగ్గలిగింది.

పిల్లా, పాపని పెంచగల్గింది. కాని ఒక్క పైసా కూడా కూడబెట్టలేక పోయింది. తన శ్రమంతా ఏ గంగలో కలిసిపోయి ఎవరి పూలతోటలు పెంచిందో ఇంకెవరి పళ్ళ తోటలు పెద్ద చేసిందో ఆమెకి తెలీదు. దగాలు, దోపిడీలు... వీటి అర్థాలు తనకి ఇప్పటికీ సరిగా తెలీవు. తను చేసే పని — కూలి పని. ఎంతో నిక్కచ్చిగా, నిజాయితీగా చేసేది. ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ ఉండడం ఇష్టం ఉండేది కాదు. రోడ్డుమీద పేడని కూడా ఊరికే పోనిచ్చేది కాదు. పిడకలు పెట్టి అమ్మేది. బొరిగతో చకచకా గడ్డికోసి గంపలకి గంపలెత్తి అమ్మేది. కాని కూతురికి పావుతులం బంగారం కొనలేకపోయింది.

అయితే ఇప్పుడు ఆ కూతురు మెడలోనే పది తులాల బంగారం పెట్టగల్గింది. అది తన కష్టంతోకాదు — అదృష్టం వల్ల. తనకి అదృష్టం, రోగం ఒకేసారి వచ్చేయి. అదృష్టం ఆస్తి తెచ్చింది. రోగం వంటికి నీరునెక్కించింది. సోములమ్మగా ఎవరికీ తెలీని తను దిబ్బమ్మగా ఆ ఊళ్ళో ప్రసిద్ధి కెక్కింది. తన పెనిమిటి పదిహేనేళ్ళు మిలటరీలో సేవచేసినందుకు ఐదెకరాల బంజరు పొలం బహూకరించింది... ప్రభుత్వం. ఎందుకూ పనికిరాని ఆ భూమి పక్కనే ఐదువేల మంది పనిచేసే ఫేక్టరీ లేచింది. దాంతో ఆ భూమికి ఎక్కడలేని గిరాకీ వచ్చింది. ఒక ఉద్యోగి వచ్చాడు. ఆ భూమిని ప్లాట్లు వేసి అధిక లాభానికి అమ్మి పెడతానన్నాడు. అందులో నూటికి 10 రూపాయల కమీషన్ ఇమ్మన్నాడు. ఆ వ్యవహారాలు తెలీక తన పెనిమిటి అందుకు ఒప్పుకున్నాడు. చివరికి ఆ ఉద్యోగి కమీషన్ డబ్బుతోనే ఇల్లు కట్టేయగలేడు. వాడు ఏదో మాయ చేశాడని చాలామంది

అంటారు గాని – తనకా లెక్కలు తెలీదు గనక "అవును. మాయచేసే ఉంటాడు దొంగ సచ్చినోడు' అని అనుకోవడం ఆమె ఇష్టపడదు. డబ్బు తమకీ బాగానే వచ్చి పడింది. కమ్మలిల్లు పెంకుటిల్లుగా మారింది. కూతురికి 5 వేల కట్నంతో, 10 తులాల బంగారంతో పెళ్ళి చేసింది.

దిబ్బమ్మకి ఒక్కతే కూతురు. నలుగురు పిల్లలు పుట్టిపోయారు. కూతురు పెళ్ళయి, అత్తవారింటికి పోయేక తనూ పెనిమిటీ ఇద్దరే ఉంటున్నారు. ఇప్పటికీ కూర్చొని తినడం ఆమెకి ఇష్టముండదు. తనకిప్పుడు ఎనిమిది గేదెలున్నాయి. ఆ పాలు కంపెనీ క్వార్టర్సులో ఉన్న ఉద్యోగస్తులకి పోస్తుంది. పాలు పితకడం కాడనించి, గేదెల్ని, గేదెలుండే పాకని శుభ్రం చేయడం వర్కూ అంతా తనే చూస్తుంది. తనకి పెనిమిటి చేసేది సాయం మాత్రమే.

తను కూలికెళ్ళిన రోజుల్లో రోజంతా కష్టపడితే రెండు రూపాయలు సంపాదించడం బ్రహ్మాండమైపోయేది. అలాంటిది రిక్షావాడికి ఆపాటి దూరానికే రెండు రూపాయలు కావాలట! అయినా రోజులు మారిపోయేయి. ధరలు మండి పోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయన్న బాధతో బాటు అసలు బజార్లో పూర్తిగా దొరక్కుండా మాయమై పోతాయేమోనని భయం.

రిక్షా నరిసిగాడు రెండడిగేడు. దిబ్బ సోములమ్మ రూపాయి ఇస్తానంది. సెటిలుమెంటు రూపాయిన్నరకయింది.

ఏం చేస్తుంది? అర్ధరూపాయి తగ్గేడు అదే చాలనుకుంది. ఏమంటే ఈ రిక్షా వాళ్ళతో గొప్ప పేచీ. 'రిక్షా అబ్బాయ్, నీ వడిగిన బేరం నేనివ్వలేను, తప్పుకో' అంటే తప్పుకోడు. మనకి తోవ ఇవ్వడు. మరో రిక్షా దగ్గరకి వెళ్ళనీయడు. మనల్ని వెంటాడుతాడు. వెంట వాడు ఉండగా మరో రిక్షావాడు ముందుకి రాడు. గొప్ప హింస పెట్టేస్తారు. ఎలాగోలా వాడితో దెబ్బలాడి దూరంగా ఉంచి – మరో రిక్షావాడి దగ్గరకెళ్ళి బేరమాడితే... వాడూ అంతే! అదే రేటు చెబుతాడు. అంతా ఒకే రేటు. ఒకే కట్టు.

ఎవడైనా కట్టుతప్పి, రేటు తగ్గించడానికి కక్కుర్తి పడ్డాడో – ఇక వాళ్ళలో వాళ్ళు కొట్టేసుకుంటారు. ఇక ప్రయాణికుడి పని అంతే!

ఈ గొడవలేం పడకుండా నరిసిగాడి రిక్షాయే బేరం సెటిల్ చేసుకుంది. రిక్షావరకూ పెట్టె పట్టుకోడానికి నర్సిగాడికివ్వలేదు. ఫర్వాలేదు, తనే పట్టుకుంటానంది దిబ్బమ్మ. అతను పరుగెత్తలేదు. వాడు పెట్టె పట్టుకొని తుర్రున పారిపోతేనో! అమ్మో ఇంకేమయినా ఉందా!

ట్రంకు పెట్టె పైకలా కనిపిస్తోంది గాని... దాని ఖరీదు పదివేలు! –

రిక్షా ఎక్కడమంటే చిట్టికి చెడ్డ సంతోషంగా ఉంది. కాని సీటంతా మామ్మే ఆక్రమించేయడంతో ఏనుగు పక్కన ఎలకలా నక్కి, నలిగిపోవడంతో ముఖం చిన్నబోయింది.

దిబ్బమ్మకి రైలుదిగిన కాణ్ణించి దాహంగా ఉంది. రిక్షాను ఆపించి ఏ కొట్టు దగ్గరైనా సోడా తాగుదామనుకుంది. కాని కొట్లు మూసేసి ఉన్నాయి. పోనీ స్టాండు దగ్గర తాగొచ్చు అనుకుంది.

స్టాండుకొస్తే – తీరా అక్కడా లేవు కొట్లు! లేకపోతే లేకపోయాయి వెధవ కొట్లు, సోడా తాగడం మానేస్తాం.

కాని బస్సులు కూడా ఉన్నట్టు లేవే!

పిట్టమనిషి కూడా లేదు. రెండు కుక్కలు మాత్రం సరదాగా కరుచుకుంటూ, దొర్లుకుంటూ స్టాండును ఆక్రమించేశాయి. జంక్షనులో హార్బరుకెళ్ళే రోడ్డు కిరువైపులా, ఎల్లవేళలా పచ్చపచ్చగా మెరిసిపోతూ జీవనదులు; ఆ నదుల పైనుంచి వీస్తున్న గాలి మాత్రం 'ముక్కుల్ని మీరు మూసుకోపోతే మీ ఖర్మ' అంటోంది. దిబ్బమ్మకి ఎందుకో గాభరా వేసింది. రిక్షా దిగలేదు. రిక్షావాడు దిగుదిగు అనలేదు. తెల్లబోతూ, బెదురుచూపులు చూస్తున్న ఆమె ముఖం చూస్తుంటే నరిసిగాడికి నవ్వొస్తుంది.

వాడికి అంతా తెల్సు. కొట్లు లేకపోవడం ఏటో, బస్సులు రాక పోవడం ఏటో తెల్సు! తెల్సు.. అంతా తెల్సు వాడికి! ఇక్కణ్ణించి మళ్ళీ తనే కట్టక తప్పదనీ, దానికి మళ్ళీ వేరే బేరమనీ. పెద్ద ఆశే ఉంది వాడికి.

నరిసిగాడు తనకేమీ తెలీనట్టు నడిచిపోతున్న ఒకతణ్ణి ఆపి అడిగేడు 'ఏటి బాబు ఏటయింది? కొట్లూ, బస్సులు, ఆటోలూ... ఏటీ లేవేటి? ఏటయ్యిందో!"

"ఈ రోజు బందయ్యా బంద్. ఇంకేం బస్సులు, ఇంకేం కొట్లు, ఇంకేం హోటల్లు! అధిక ధరలకి నిరసనగా బంద్ అని వారం రోజుల్నించి గోలపెడుతున్నారు గదయ్యా!" అంటూ వెళ్ళిపోయాడు అతడు.

దిబ్బమ్మ గుండెల్లో రాయి పడింది. "ఇపుడేం దారి దేవుడోయ్" అనుకుంది.

బందుల నుంచి రిక్షావాళ్ళకి మినహాయింపు ఉంది. 'రెక్కాడితే గాని, డొక్క నిండని బతుకులు. తొక్కుకోనియ్.. వాళ్ళనెందుకు ఇబ్బంది పెట్టడం' అని వదిలేస్తారు బంద్ నిర్వాహకులు.

ఇప్పుడా అవకాశం తీసుకుని, బేరంలో మరో అయిదో, ఆరో కొట్టేయాలని ఆశ పడుతున్నాడు నరిసిగాడు.

అవకాశం వచ్చినప్పుడు ఎదుటివాణ్ణి అందినంత మేరకి బలిచేసుకోడమే! ప్రస్తుతం అమల్లో ఉన్న లోక న్యాయం! అందులో లింగభేదం లేదు. వర్గభేదం లేదు. 'తప్పు, దోచుకోవడం తప్పు, తప్పు' అని వచ్చే ఛాన్సు నుంచి తప్పుకుంటే, భవంతులు కట్టడం సంగతికేం గాని, బతకం కష్టమైపోతున్న మాయదారి రోజులు!

"ఎక్కడకెళ్ళాలమ్మా?"

"నాతయ్యపాలెం బాబూ".

"ఏటి... నాతయ్యపాలెవా! అయ్యబాబోయ్ అంత దూరవే... సరిపోయింది! తను ఏ పోర్టు క్వార్టర్స్ ఏ షిప్‌యార్డో అనుకున్నాడు గాని, ఎక్కడో బి.హెచ్.పి.వి. దగ్గరున్న నాతయ్యపాలెవంటే ఎవడు వొస్తాడు! తగలగా, తగలగా ఎలాంటి బేరం తగిలిందిరా బాబూ!" అనుకున్నాడు నరిసిగాడు చిరాగ్గా

"బాబూ! ఎలాగోలా నీవే రిక్షా కట్టి పున్నెం కట్టుకో నాయనా" ప్రాధేయపూర్వకంగా అడిగింది దిబ్బమ్మ.

"నాది పిట్రోలు కాత్తల్లీ, రక్తం... నానంత దూరం రాలేను తల్లోయ్" అని బుర్ర అడ్డంగా ఊపేసాడు.

చుట్టూ చూసింది. చుట్టుపక్కల మరేం రిక్షాలు లేవు! ఈ రోజు రిక్షాల డిమాండు అలా ఉంది మరి.

చావుల మదుం కింద నుంచి ఓ పోలీసు వ్యాను వెళ్ళిపోతోంది. నేవెల్ బేసుకి ఏదో జీపు పోతోంది. ఎదురుగా శ్మశానంలోంచి శవం కాలుస్తున్న పొగ వస్తోంది. కుష్టివాడిని ఒక చక్రాల తొట్టెలో లాక్కు పోతున్నాడు ఏ కుష్టు లేని పదేళ్ళబాలుడు... కూలికి!

"అలాగ అనేయకు బాబు. ఎంతకైతే కడతావో అడుగు. అంతేగాని కట్టమనేస్తే మేం చచ్చిపోవాఁ" అంది దిబ్బమ్మ.

నరిసిగాడు తల గోక్కొని, ముఖం అదోలా పెట్టి అన్నాడు "ఇరవై అవుద్దమ్మా... ఈ రూపాయిన్నర కాక!"

'కడ్తానన్నాడు' అదే సంతోషం అనుకుని "మళ్ళీ రూపాయిన్నర యెందుకు? మొత్తం ఇరవై చేసుకో బాబూ" అంది.

"అదేం కుదర్దు" అన్నాడు నరిసిగాడు. "సరే, పోనియ్ బాబు" అంది దిబ్బమ్మ.

స్టాండుకి రూపాయిన్నర పోయడానికి గిజగిజలాడిన దిబ్బమ్మ, మరో ఇరవైకి వెంటనే ఒప్పేసుకుంది. ఒప్పుకోక చస్తుందా!

దిబ్బమ్మ యెంతంటే అంతకి ఒప్పేసుకోడంతో, 'మరో అయిదు ఎక్కువ అడిగి ఉండాల్సింది, అయ్యయ్యో!' అని బాధ పడ్డాడు నరిసిగాడు.

ఎండ తీక్షణంగా ఉంది. ఇంటికెలా చేరాలనే భయం. కలవరపాటులో తన దాహం సంగతే మర్చిపోయింది.

చావులమదుం కిందనుంచి చావుడప్పుల బాజాలతో ఊరేగి వసోంది ఒక శవం! పాడెవెనకాల పడుతున్న పైసల కోసం నలుగురు దిసమొల కుర్రాళ్ళు పడి కొట్టుకు చస్తున్నారు. స్టాండులో ఉన్న రెండు కుక్కలు, ఆడుతున్న ఆటలు ఆపేసి దీనంగా, భయంకరంగా అరవడం మొదలు పెట్టాయి. దిబ్బమ్మ ఆ కుక్కల అరుపులు భరించలేక 'ఛీ' 'ఛీ' అని కేకలు వేసింది. ఆ కేకలకి కుక్కలు చలించలేదు. రిక్షా కదలడానికి గ్రీన్‌సిగ్నల్ యిచ్చినట్టు మదుం మీద నుంచి రైలు కూత పెట్టింది.

రిక్షాకి పాడె ఎదురు రావడం యిష్టం లేదు దిబ్బమ్మకి. గబగబా దాటించేయమంది రిక్షాని.

చిట్టి... పెళ్ళిపల్లకీని చూసి ఆనందించినట్టే, ఆ పాడెను కూడా క్యూరియస్‌గా, కళ్ళార్పకుండా చూస్తోంది. ఇంటికెలా చేరాలనే భయమే కాదు, ఏ బాధా, భయంలేని వరంలాంటి వయసు ఆ పాపది!

రిక్షా కదులుతుండగా దిబ్బమ్మ మనసులో ఏడుకొండలవాణ్ణి తలచుకుంది. 'ఇంటికి క్షేమంగా చేర్చు తండ్రీ, ఈ పసిపిల్లతో, ఈ ట్రంకు పెట్టెతో నన్ను ఒడ్డుకి పడేయ్ తండ్రి' అని ప్రార్థించింది.

ధరల పెరుగుదలకి నిరసనగా బంద్ జరుపుతున్నందుకు దిబ్బమ్మ విసుక్కోవడం లేదు. దురదృష్టవశాత్తు బంద్‌కి దొరికిపోయినందుకు తనను తాను నిందించుకుంటోంది. తనలాంటి ఏ ఒక్క వ్యక్తో ఇబ్బందుల పాలవుతారని ప్రజల ఉద్యమాలనే తప్పు పట్టడం తప్పు కాదూ?

జరుగుతున్న బంద్ ధరల పెరుగుదలకే కాదు, క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితికి కూడా నిరసన అని ఆమెకి తెలీదు. మనిషికి సెక్యూరిటీ అంటూ ఒకటి లేకుండా పోయింది. గుండె మీద చేతులేసుకుని ఎవరూ నిద్రపోలేకపోతున్నారు. నిర్భయంగా, నిశ్చింతగా ఉండలేకపోతున్నారు. ఎక్కడ చూసినా అత్యాచారాలు, అలజడులు, దుర్మార్గాలు, ఇంటి నుంచి

బయటికెళ్ళిన పెనిమిటి, తిరిగి ఇంటికి చేరేవరకు ఇల్లాలికి పీచుపీచు భయం! 'ఇంట్లో ఒంటరిగా ఉన్న తన ఇల్లాలిపై ఏ అత్యాచారాలు సాగుతాయో, ఇంటిపై ఏ రాబందులు వాలేయో' అని అవతల భర్త భయం. బతికే బతుకంతా భయం, భయం అయిపోయింది.

ఒంటరిగా ప్రయాణం చేస్తున్న ఆడమనిషిపై జరిగే అత్యాచారాలకి అంతే లేదు. ఆరేళ్ళ పసిపాపనే కాదు, ఎనభయ్యేళ్ళ ముసలమ్మనే మానభంగాలు చేసేస్తున్నారు. బంగారం కోసం చెవుల్నీ, ముక్కుల్నీ కూడా నిర్దాక్షిణ్యంగా కోసేస్తున్నారు. ఈ పరిస్థితిలో ఏ మగతోడు లేకుండా ఒంటరిగా పదిమైళ్ళ దూరం ప్రయాణం చేస్తోంది దిబ్బమ్మ. ఎన్ హెచ్ 5 రోడ్డుకి టర్నయి, కాకాని నగర్ దాటేక, నాతయ్యపాలెం చేరేదాకా ఒక్క యిల్లుగాని, పిట్టమనిషి గాని కనిపించరు! దిబ్బమ్మ చెవులకి పోవుఁలున్నాయి. ముక్కుకి నత్తు ఉంది. మెళ్ళో గొలుసు ఉంది. చిట్టిచెవులకి రింగులున్నాయి. అంతేకాదు పెట్టెలో బంగారం ఎనిమిది తులాలు ఉంది!

అల్లుడు చేస్తున్న ఉద్యోగం మానేసి ఆ బంగారంతో ఏదో వ్యాపారం చేస్తానంటున్నాడు. అప్పటికే రెండు తులాలు ఆర్పేశాడు! కూతురుకది ఇష్టం లేక, మిగతా బంగారం మొగుడెక్కడ లాగేసుకుంటాడోనని, తల్లి చేతికిచ్చేసి "నీ దగ్గరే ఉంచమ్మా. తీసుకు వెళ్ళిపో" అంది. బంగారం మోసుకెళ్ళడం ఇంత ఇబ్బందని అనుకోలేదు. సిటీబస్సే ఉంటే ఇబ్బందే అన్పించక పోను!

ఎండ నిప్పులు చెరుగుతోంది. రోడ్డుమీద తారు మెత్తగా కరుగుతోంది. ఎక్కడో ఇళ్ళంటుకున్నట్టున్నాయి.. ఫైర్ సర్వీస్ లారీలు గణగణ గంటల చప్పుడుతో తాపీగా పోతున్నాయి! రోడ్డుకిరువైపులనున్న దుకాణాలు మూసేసి ఉన్నాయి. మెడికల్ షాపువాడు నా దుకాణంకేం ఫర్వాలేదు అని ధైర్యంగా తెరిచే ఉంచాడు. ఒకటి, రెండు చోట్ల కొద్దిగా తలుపులు తెరిచి తొందర, తొందరగా, భయం భయంగా అమ్మకాలు చేస్తున్నారు.

బంద్ తోపాటు భీకరమైన ఎండ కాస్తుండటం చేత రోడ్డు మీద జనం లేరు. అక్కడక్కడ పోలీసులు లాటీలు, తుపాకులతో ఉన్నారు. అయిదు నిమిషాల క్రితమే కర్ఫ్యూ సడలించి, 144వ సెక్షను పెట్టినట్టు నిస్తేజంగా ఉంది రోడ్డు.

దిబ్బమ్మకి బెంగగా, గాబరాగా ఉంది. రిక్షా వెళ్తూంటే తోవలో పైడితల్లమ్మ గుడి తగిలింది. నరసిగాడి చేతిలో పావలా పెట్టి 'బాబూ ఆ యమ్మ హుండీలో వేసిరా బాబూ' అంది. తర్వాత రామమందిరం తగిలింది. రిక్షాలోంచే దండం పెట్టుకుంది. రిక్షా అప్ ఎక్కేక ముత్యాలమ్మ గుడి... తను లెంపలు వాయించుకు దండం పెట్టింది. పక్కనే శివుడి కోవెల! తనే కాక చిట్టిచేత దండం పెట్టించింది. దండం పెడుతున్న చిట్టికి ఏం జ్ఞాపకం వచ్చిందో ఏమో 'మామ్మా! ఆకలి' అంది. 'ఇదిగో ఇంటికొచ్చేసేం' అంటూ మరిపించడానికి మనవరాలిని మాటల్లోకి దించింది మామ్మ. ఆ చిట్టి ఆపకుండా ఏవేవో పిచ్చి, పిచ్చి ప్రశ్నలు వేసి వేధిస్తోంది. సాధ్యమైనంతవరకూ చిరాకు పడకుండా, పిల్ల యక్షప్రశ్నలకి సమాధానం చెబుతోంది దిబ్బమ్మ.

రిక్షా కీచుకీచుమని వెళుతోంది. స్పీడు లేదు. నరిసిగాడు హుషారుగా ఫెడలు వేసినప్పటికీ, చక్రాలు సర్రున పరుగుదీయడం లేదు. డొక్కు రిక్షా! పోనీ డొక్కుకైనా ఏనాడైనా ఆయిలింగ్ చేసిన పాపానికి పోతేనా! గట్టిగా పెడలు వేస్తున్నప్పుడు చైను ఫట్ ఫట్ మంటోంది. వాడికి దిబ్బమ్మ నెక్కించుకొని రిక్షా తొక్కడం... నడుం మీద వంద కేజీల బియ్యం బస్తాని వేసుకు మోస్తున్నట్టే ఉంది!

రోడ్డంతా ఎగుబోటు!

మరిక ఫెడలు వేయడం కష్టమయి 'దీనమ్మ' అని కిందకి దిగేడు. కాళ్ళు చుర్రుమంటున్నాయి. తారు చురకలు పెడుతోంది. ఎడమచేయి హేండిలు మీద వేసి, కుడి చేయి వెనుక ఐరన్ ఫ్రేమ్ మీద వేసి బలంగా లాగుతున్నాడు. తన శక్తినంతా కూడదీసి వంగోని లాగుతుంటే, తనకి ముందు చక్రం మూడు చక్రాల్లా కన్పిస్తోంది. కళ్ళ మీద చెమటపడి మసక కమ్మేస్తోంది. మోచేతి బనీనుకి ముఖం తుడుచుకుంటూ రిక్షాని ముందుకి పోనిస్తున్నాడు. నుదుటిపై చెమటబొట్లు రోడ్డుపై పడి, అంతలో ఆవిరైపోతున్నాయి.

రిక్షాకి అడ్డంగా గజ్జి కుక్క వచ్చింది. 'ఛత్తల్లి... నీయమ్మ' అని దాన్ని ఒక్క తాపు తన్నేడు. అది కుయ్ కుయ్ మని పరిగెట్టింది. రిక్షాని అంత కష్టంగా లాగుతున్నప్పుడు నరిసిగాడికెంతో కసిగా, కచ్చగా ఉంటుంది. ఆ కసి, కచ్చ ఎవరి మీదో తెలీదు. ఆ సమయంలో కుక్కేకాదు... లారీ. రిక్షా, మనిషి... ఏ అడ్డొచ్చినా, ఎవరు అడ్డొచ్చినా, ఎగిరిపోయి బూతులు అందుకుంటాడు.

'గంట సేపు తొక్కితే, ఇంకా సగం దూరమైనా రాలేదు. ఛత్తిరి! ఇరవై రూపాయలకి కక్కుర్తి పడిపోయి తొక్కలేని దూరానికి ఒప్పుకున్నాను. అంతా ఎగుబోటు. ఎదురు గాలి, మిట్ట మధ్యాహ్నం. కూర్చున్నది దిబ్బది! రిక్షా డొక్కుది... ఏదైనా రిక్షాకి తన బేరం అప్పగించేసి, తప్పుకుంటే బాగుణ్ణు అనిపిస్తోంది. అడివిలోంచి ఎడారిలో కెళ్ళడానికి తను కాబట్టి ఒప్పేసుకున్నాడు గాని... బుద్ధి, బుర్రా ఉన్న ఏ రిక్షా నా కొడుకు కట్టడు, కట్టడు' అనుకున్నాడు నరిసిగాడు.

తెల్లారి కొట్టిన గిన్నెడు చద్దన్నం ఏ మూల కెళ్ళిపోయిందో... లోన పేగుల్ని ఎలుకలు కొరికేస్తున్నాయి.

దిబ్బమ్మకి చెమటలో తడిసిన వాడి కండలు యినప దిమ్మలా కన్పిస్తున్నాయి. చేతులపై నరాలు ఎత్తుగా ఉబ్బేయి. పొట్టి నిక్కరులోంచి తొడలు, పిక్కలు రాళ్ళలా కన్పిస్తున్నాయి. గోడకి పోస్టరు అంటించినట్టు బనీను వీపుకి అతుక్కుపోయింది. బనీను మీద కన్నాలు అయిదు లెక్క పెట్టింది చిట్టి.

చిన్నకొండలా ఉన్న కొత్త రోడ్డు బ్రిడ్జి దాటేటప్పటికి పన్నెండు సైరను ఊదింది. రిక్షా సింహాచలం రోడ్డు దాటి ఎన్ హెచ్ 5 రోడ్డులో ఉందిప్పుడు. బ్రిడ్జ్ కింద వంకర వంకరగా తిరిగి ఉన్న పట్టాలు, పాదరసం పరుగుతీస్తున్న గొట్టాల్లా ఉన్నాయి. తాగేసో, లేక మూర్ఛపోయో ఒకడు పక్కన పడి ఉన్నాడు. ఆ బ్రిడ్జి దగ్గర అర్బన్ ఏరియా దాటి రూరల్ ఏరియాలోకి వెళ్ళిపోతున్న వారికి మున్సిపాలిటీ 'థాంక్యూ' అని బోర్డు కట్టి చెబుతోంది.

ఆ రిక్షా బ్రిడ్జినెక్కడం ఎంత కష్టమయిందో, దిగడం అంత ఈజీగా ఉంది, కాని ఎదురుగాలి అటకాయిస్తూనే ఉంది.

ఇక ఎదురుగా ఎడారి. రోడ్డు పక్కన ఒక ఇల్లు లేకపోతే పోనీ, నీడనిచ్చే ఒక చెట్టు కూడా లేదు. అంతా డ్రయ్ ఏరియా. ఈ ఎడారిలో గంట సేపు ఈదుకెళ్తేగాని నాతయ్యపాలెం అంచులు దొరకవు. చిట్టి సీటులో ఒద్దికగా కూచోకుండా నించొని, పెట్టె తొక్కి, అటు కదిలి, ఇటు కదిలి, స్టాండు పట్టుకు ఊగి ఎంత అల్లరి చేసినా భరించింది దిబ్బమ్మ. అడిగిన లక్షయక్ష ప్రశ్నలకీ జవాబులు ఇచ్చింది. చిట్టిది పట్టిందే పట్టు... దాహం. ఆకలి అనడం లేదు. అదే చాలు అనుకుంటోంది. నెమ్మదిగా ఇంటిదాకా ఓపిక పడితే ఏదైనా గబగబా వండి పడెయ్యొచ్చు.

కాని అనుకున్నట్టు జరగలేదు. అకస్మాత్తుగా ఆకలేస్తోందని రాగం తీయడం మొదలుబెట్టింది చిట్టి. ఎంత నచ్చచెప్పినా, ఎన్ని మాయమాటలు ఆడినా వినిపించుకోలేదు. పోనీ ఏదైనా కొని పడేద్దామన్నా గడ్డి తప్ప ఎక్కడా ఏమీలేదు. అయిదు

నిమిషాలు నచ్చజెప్పచూసి, విసిగి వీపు మీద రెండు బాదులు బాదింది. నెత్తి మీద రెండు మొట్టికాయలు మొట్టింది. ఆ చిట్టి గొప్ప మాటకారి. చిట్టిచేత ఏవేవో మాట్లాడించుకుని, వినడం, మురిసిపోవడం దిబ్బమ్మకి ఇష్టం. స్కూలు సెలవులివ్వడంతో చిట్టిని వెంటేసుకు వచ్చింది.

ఎప్పుడూ కొట్టని మామ్మ కొట్టడంతో చిట్టికి కోపం, రోషం వచ్చింది. "నీ జట్టు పీస్... నీవు నా కొద్దు. మా అమ్మకాడికెళిపోతాను" అంది.

"ఎళ్లిపోయే సిగురుగుంట... ఒవుల్నే బెదిరిస్తావు?"

"అవుతే నన్ను దిగబెట్టేయి మా ఇంటికి."

"ఆఁ! నాకు పట్టింది బాధ" అంది ఒళ్ళు మండి. అంత మంటలోనూ మనవరాలితో వాదన సరదాగా వున్నట్టుంది దిబ్బమ్మకి.

"నాకేం బయ్యివేఁటి? నేనెళ్ళి పోగల్ను."

"పో అయితే."

"డబ్బులియ్యి."

"తొంగుడున్నాయి."

డబ్బులు తొంగుడోడవేవిఁటో చిట్టికి అర్థం కాలేదు. మొత్తానికి డబ్బులివ్వనంటుందని అర్థమయ్యింది.

"అవుతే, మా నగలిచ్చేసేయ్"

"ఏం నగలు? మీ బాబూ సంపాయించేడా? మీ యమ్మ సంపాయించిందా"..

"అదేం కాదు... మా అమ్మవి, ఇచ్చేయ్" రోషంగా మామ్మ గుండెల మీద రుద్దుతూ అంది. మనవరాలితో అలా గుండెల మీద గుద్దించుకోవడం సరదాగానే ఉన్నట్టుంది దిబ్బమ్మకి.

"ఇస్తావా, లేదా?"

"తచ్చాడుతున్నాయి లచ్చోరం సంతలో".

సంతలో తచ్చాడ్డం ఏమిటో అర్థంకాక "అదేం కాదు, నాకు తెల్సు. ఇగో ఈ పెట్టెలో ఉన్నాయి మా అమ్మ నగలు" తెలియజేసింది గొప్పగా.

ఆ దెబ్బతో దిబ్బమ్మకి మురిసిపోతున్న మనవరాలి ముచ్చటా, గిచ్చటా ఎగిరిపోయేయి. ఆమె గుండెలు ఒక నిమిషం పాటు కొట్టుకోవడం మర్చిపోయేయి. 'రిక్షావాడు వినేశాడు... వినేశాడు. అవునే వినేశాడు. అమ్మ నాయినో ఇంకేం ఉంది. అదిగో రిక్షా ఆపేశాడు... ఎంత పని చేశావే గుంటా? ఇంకేం ఉంది... అయిపోయింది, అంతా అయిపోయింది. దేవుడోయ్...

అయిపోయింది... పెట్టెలంకించుకు పోతాడు. ఇక నేనేం చేతును దేవుడోయ్...' చిట్టిని శుభ్రంగా రెండు చేతుల్తో దబదబా మొత్తేసింది. 'చావే గుంటా, చావు' అని జుత్తు పీకేసింది.

నరిసిగాడు రిక్షాని ఆపేడు.

రోడ్డుకి ఎడమవైపున పచ్చపచ్చగా మెరిసిపోతూ పొలాలు. ఆ పచ్చని పొలం పక్కనే గాలివాన తుప్పలు, తుమ్మచెట్లతో నిండిపోయిన బీడు నేల. కాళ్ళూ, చేతులూ, ముక్కూ, ముఖం చెక్కేసినట్టున్న తవ్వినంత తవ్వి వదిలేసిన మొండి కొండ! విశాలంగా లేని చిన్ని ఏరోడ్రాంలో పెద్ద పక్షి ఏదో వాలినట్టు విశ్రాంతి తీసుకుంటున్న విమానం! రోడ్డు కిరువైపులా కాస్త దూరంలో దట్టంగా పెరిగిన సరివిడి తోట. ఆకాశం అంచుల్ని వంకరటింకరగా కత్తిరించినట్లు చుట్టూ కొండలు, కొండలు! సింహాచలం కొండ వెండి జరీ తలపాగా చుట్టుకున్నట్టు శిఖరాన్ని చుంబిస్తూ తెల్ల మబ్బులు! చెట్లు, తుప్పలు. రాళ్ళ గుట్టల మధ్య నుంచి కొండచిలువలా పాకుతూ రైలు... చిట్టి అంత ఏడుపులోనూ రైలుని దీక్షగా కళ్ళార్పకుండా చూస్తోంది.

"ఎందుకు తల్లీ పిల్లనలా బాదేస్తావు?" అన్నాడు నరిసిగాడు. అంటూ దగ్గరకొచ్చేడు. ఒక చేయి పెట్టె మీద వేశాడు.

"అమ్మా. కొద్దిగ లేస్తారా?" తనని దింపేసి రిక్షాలో పిల్లనీ, పెట్టెనీ పట్టుకు ఉడాయించేస్తాడా? చిట్టిని ట్రంకు పెట్టెమీద నించో బెట్టేడు. "మిమ్మల్నేనమ్మా... కొద్దిగ లెగండి..." దిగకపోతే తోసేస్తాడేమో!

దిబ్బమ్మ గుండె దబదబ కొట్టుకుంటోంది. కాళ్ళు తడబడుతున్నాయి. నెమ్మదిగా రిక్షా దిగింది. నరిసిగాడు సీటుని పక్కకి తప్పించేడు. బల్లచెక్కను తీసేడు. చిన్న అరలా ఉంది. అందులో మాసిన గుడ్డ పీలికలు, సైడు కర్టెన్లు ఉన్నాయి. చేత్తో లోపల దేవుతున్నాడు.

'కత్తిగాని తీస్తాడా...' వణికిపోతోంది. దిబ్బమ్మ

చివరికి దొరికింది చేతికి... పచ్చగా జామికాయ! జామికాయ చిట్టిచేతిలో పెట్టి, బల్లచెక్కను సర్ది, సీటువేసి, దానిపై ఒక చరుపు చరిసి, 'కూర్చోండమ్మా' అన్నాడు దిబ్బమ్మని!

దిబ్బమ్మ నిట్టూర్చి, గుండెల మీంచి చేతులు తీసేసింది. రిక్షా ఎక్కింది. రిక్షా కదిలింది.

రిక్షావాడు ఇచ్చిన జాంకాయ దగ్గర... అంత బంగారం తీసుకట్టుగా, విలువ లేనిదిగా అన్పించింది దిబ్బమ్మకి!

ఎదురుగాలికి రిక్షా కదలడం లేదు. అయిదు నిమిషాలకి రిక్షా పది గజాల దూరమెళ్ళడం గగనమవుతోంది. గాలి బొయ్‌బొ౦య్ మని రాక్షస చప్పుడు చేస్తోంది. రిక్షా టాపు టప్‌మని కొట్టుకుంటోంది. ఎదురుగా ఒకడు సైకిల్ తొక్కకుండా, ఫెడలు వేయకుండా, హేండిల్ మీద చేతులు వదిలేసి మరీ పోజుగా వస్తున్నాడు!

మేఘాలు చెదిరి పీలికలై ఎగిరిపోతున్నాయి. సూర్యుడూ, గాలీ పోటీపడి ఎవరి ప్రతాపం వాళ్ళు చూపిస్తున్నట్టు... తీవ్రంగా ఎండ! వేడి, వేడి గాల్పులు కొడుతూ ఎదురుగాలి. ఒక్కొక్కసారి ఆ గాలికి రిక్షా తట్టుకోలేక ఒక మిల్లీమీటరైనా ముందుకెళ్ళడం కాదు. వెనక్కి వెళ్ళిపోతోంది. వడగాలి కొడ్తున్న చెంప దెబ్బలకి సరివిడి చెట్లు గిజగిజలాడిపోతున్నాయి.

నరిసిగాడికి కొండ ఎక్కుతున్నట్టుగా ఉంది. ఎక్కలేకపోతున్నాడు కొండ. ఎక్కాలి, అదిగో కనిపిస్తోంది శిఖరం... అందుకోవాలి! ఎదురుగాలితో యుద్ధం చేస్తున్నాడు నరిసిగాడు.

మధ్యలో విశ్రాంతి తీసుకోడానికి చెట్టునీడ ఒక దగ్గర కాపోతే ఒక దగ్గరైనా లేదు. నాలిక పిడచకట్టుకు పోతోంది. కాళ్ళూ, చేతులూ లాగేస్తున్నాయి. తేలిపోతున్నాయి. కళ్ళు తిరిగిపోతున్నాయి. శ్వాస తీయడానికి ఉక్కిరిబిక్కిరి అయి పోతున్నాడు.

'ఇక రిక్షా నడపలేను తల్లీ! ఎలాగెలావో ఎల్లమ్మా... ఇక నా తరం కాదు, ఏ డబ్బులూ వద్దుగాని తల్లీ, ఇకనే తొక్కలేనమ్మ!' అని అనేయాలనిపిస్తోంది.

రిక్షా ఆపేశాడు. రిక్షా వెనక్కి వెళ్ళిపోతోంది. రాయితీసి వెనక చక్రానికి అడ్డంగా పెట్టేడు.

రిక్షా వదిలేసి రోడ్డు దిగిపోతున్న రిక్షావాడికేసి గాభరాగా చూసింది దిబ్బమ్మ.

నరిసిగాడు తాగినవాడిలా జోగుతూ మదుంకేసి నడిచేడు. మూత్ర విసర్జనకా! దిబ్బమ్మకి అటువైపు చూడాలో, చూడకూడదో తెలియకుంటోంది.

మదుం కిందనుంచి గెడ్డ పారుతోంది. నీళ్ళు తేటగా ఉన్నాయి. కింద తెల్లటి ఇసుక స్పష్టంగా కనిపిస్తోంది. తళుకులీనుతోంది. నరిసిగాడిని చూసి భయపడి రెండు కప్పలు నీటిలోకి గంతేశాయి.

ఆదమరచి నిద్రపోతున్న తల్లి వక్షం మీదకి... ఆకలేయగానే గబగబా బంగురుకుంటూ వచ్చి అమాంతంగా పడిపోయి పాలుకుడిచే పసిపాపలా.. నరిసిగాడు అతి నెమ్మదిగా పారుతున్న ఆ నీటిలో అడ్డంగా పడిపోయేడు. నిక్కరు తడవకుండా, బొడ్డు వరకు మాత్రమే నీరు తగిలేలా పడిపోయేడు. చేతులతో నీరు తీసి ముఖానికి దబదబా కొట్టుకున్నాడు. దోసిళ్ళో పట్టుకు నీళ్ళు తాగేడు. తర్వాత చేతులతో కాకుండా ఏకంగా నీటిలో నోరు పెట్టే తాగేడు. చెమటకి పూర్తిగా తడిపిన తువ్వాలుని నీటిలో ముంచి కాళ్లు, చేతులు తుడుచుకున్నాడు. బనీను తీసి పిండుకొని మళ్ళీ వేసేసుకున్నాడు. కొంత ప్రాణం లేచి వచ్చింది!

ప్రక్కనే ఉన్న పొదల్లోకి వెళ్ళి పెద్ద ఆకులు తెచ్చేడు. ఆ రెండు ఆకులని కోన ఆకారంలో చుట్టి నీళ్ళు పట్టుకొచ్చి దిబ్బమ్మ కిచ్చేడు. నీళ్ళు ఆమె రెండు గుక్కలు తాగి మిగతాది ముఖం మీద దిమ్మరించుకుంది. చిట్టి అప్పటికే మామ్మ ఒడిలో నిద్రపోతోంది! లేకుంటే చిట్టిని తీసుకెళ్ళి నీళ్ళు తాగిద్దామనుకున్నాడు.

ఆగిపోయిన స్కూటరు, రిజర్వులో ఉన్న పెట్రోలుతో ముందుకు కదిలినట్టు రిక్షా కదిలి, మదుం దాటేక రోడ్డు ఎడమకి తిరగడంతో ఎదురుగాలి దురుసుతనం తగ్గింది. సరివిడి చెట్లు... ఆడుతున్న అల్లరి పిల్లల్లా గోల చేస్తున్నాయి. పచ్చని చేను విరగబడి అటూ, ఇటూ ఊగుతున్నాది. దూరంలో తాటిచెట్టుపై నుంచి కిందకి మట్ట పడింది. మట్ట చప్పుడికి ఉడుత జడిసి తుర్రుమంది. రాయిమీద నిలబడిన తొండ వస్తూన్న రిక్షాని నిక్కినిక్కి చూస్తోంది.

రిక్షాకి ఎదురుగా... కాస్త దూరంలో కొండమీదున్న గుడి అందంగా కనిపిస్తోంది. గుడికన్నా ముందే నాతయ్యపాలెం తగులుతుంది. 'ఊరు, అదిగో వచ్చేసింది. వచ్చేసింది' అన్నదే ఊపిరై రిక్షా ముందుకు పోతోంది.

నాతయ్యపాలెం రిక్షాని చిరునవ్వుతో ఆహ్వానించింది.

"నీయమ్మ, రెండు గంటలపాటు నన్ను సంపినావు గదే' అనుకున్నాడు నరిసిగాడు, ఊరి ఆహ్వానాన్ని మన్నిస్తూ! ఇంచుమించు ఒకే దగ్గర ఉన్న మూడు బ్రాందీ కొట్లని చూసి 'ఊరు బాగానే ఉందే...' అనుకున్నాడు.

ఎక్కడినుంచో మంచి పాతపాటని తెరలు తెరలుగా మోసుకొస్తోంది గాలి! రోడ్డుకి కుడి వైపునున్న రెండిళ్ళ అవతల ఇల్లే దిబ్బమ్మ యిల్లు. తిన్నగా ఇంటి దగ్గరే ఆగింది రిక్షా.

తన ఊరునీ, ఊళ్ళో తన ఇల్లునీ చూడగానే దిబ్బమ్మకి కన్నతల్లిని కావలించుకున్నంత ఆనందమై పోయింది. గోదావరి పొంగి పొరలి ఊరుని ముంచేస్తుంటే... తనని రక్షించి, పడవ ఎక్కించి ఒడ్డుకి దింపిన తమ్ముడిలా కన్పించాడు నరిసిగాడు.

దిబ్బమ్మ చిట్టిని ఎత్తుకొని దిగింది. రిక్షా నరిసిగాడు పెట్టెని పట్టుకున్నాడు.

'అమ్మో!' అనుకొని నవ్వుకుంది! పాడు మనిషిని, ఏ పాపం ఎరుగని రిక్షావాణ్ణి యేవేవో అనుమానాలతో ఊహించుకొని భయపడినందుకు సిగ్గుపడింది. కాని ఆ పరిస్థితిలో భయం సహజం అన్నది ఆమె గుర్తించడం లేదు.

దిబ్బమ్మని చూడగానే దిబ్బమ్మ మొగుడి ముఖం దిబ్బరొట్టంతయిపోయి, గేటు తెరిచాడు. పాకలో కూర్చొని కునుకుపాట్లు పడుతున్న గేదెలు లేచి సంతోషంతో చెవులు ఊపేయి, వరండాలో నులకమంచం వేసి దుప్పటి పరిచేడు దిబ్బమ్మ మొగుడు. పడుకున్న చిట్టిని మంచం మీద వేసింది దిబ్బమ్మ.

నరిసిగాడు పెట్టెని వరండాలో వారగా, గోడ పక్కన పెట్టి బయట కొచ్చి నిలబడ్డాడు. తువ్వాలు తీసుకొని ముఖం, చేతులు తుడుచుకుంటున్నాడు. ఓ చెంబుడు నీళ్ళు తెచ్చి తాగమని ఇచ్చింది దిబ్బమ్మ. చెంబు ఎత్తిపెట్టి గుటుక్, గుటుకమని నీళ్ళన్నీ తాగేశాడు. 'ఇంకా కావాలా?' అనడిగింది. చాలన్నాడు. "ఇక వెళ్తానమ్మా" అన్నాడు. –

"వెళ్తువుగానిలే బాబు, చూస్తే... నీర్సంతో ఎక్కడో పడేపోయేటట్టున్నావు. అందాక ఆ అరుగు మీద నడుం వాల్చు!" అంది దిబ్బమ్మ.

అవును, తను వెళ్ళే స్థితిలో లేడు, కాసేపు నడుం వాల్చాలనే ఉంది... ఆ అరుగు మీదకి వెళ్ళేడు.

దిబ్బమ్మ గేదెలు దగ్గరకెళ్ళి ఒకసారి వాటిని పలకరించి చేతుల్లో నిమిరి వంటగదిలోకి వచ్చింది. రెండు పొయ్యిలు వెలిగించి గబగబా ఒక గంటలో వంట చేసింది.

వంట చేసేసి, మగత నిద్రలోకి జారిపోయిన నరిసిగాణ్ణి లేపింది. వాడు తుళ్ళిపడి లేచాడు. ఒళ్ళంతా పచ్చి నొప్పిగా ఉంది. ఆఁ' అని చప్పుడు చేస్తూ ఆవలించాడు. బద్ధకంగా చేతులు విరిచాడు. కళ్ళు నలుముకున్నాడు.

చేతులూ, ముఖం కడుక్కోమని నీళ్ళిచ్చింది. నరిసిగాడికి ఏదో కలలో ఉన్నట్టే ఉంది. కాళ్ళూ, చేతులూ కడుక్కుని వచ్చేడు. ఎదురుగా విస్తరిలో భోజనం! దిబ్బమ్మ మొగుడు మగ్గుతో సారా అందించేడు! ఇంకేముంది!

అడిగి, అడిగి ఆప్యాయంగా వడ్డిస్తున్న దిబ్బమ్మ ముఖంలోకి ఎందుకో నరిసిగాడు చూడలేక పోయేడు. కళ్ళనీళ్ళు తిరిగేయి. గతం గుర్తుకొచ్చింది.

తను ఏ తండ్రికి పుట్టాడో తెలీదు. తల్లి జబ్బుతో పోవడం గుర్తుంది. గున్నయ్య కాఫీ హోటల్లో కప్పులు కడిగి, పప్పులు రుబ్బి

పదేళ్ళు చాకిరీ చేసి, వాడి దగ్గర డబ్బు దాచుకుంటే.., 'నీవు నా దగ్గర అసలు డబ్బేం దాయలేదు, ఫో పొమ్మన్నాడు'. తను పెళ్ళిచేసుకున్న లచ్చి ముగ్గురు పిల్లల్ని కన్న తర్వాత, కొవ్వెక్కి ఎవడితోనో లేచి పోయింది! తనకన్నీ ఇలాంటి దెబ్బలే! మనిషి మంచితనం మీద నమ్మకమెప్పుడో పోయింది. ఇక ప్రేమా, దయా, అనురాగం, ఆప్యాయతా... ఇవంటే ఏమిఁటో, ఎలా ఉంటాయో తెలీదు. కాని యిప్పుడు... ఈ అనుభవం కొత్తగా ఉంది.

"తిను బాబూ."

"తింటాను తల్లీ, తింటాను" కళ్ళు తుడుచుకొని తినడం మొదలెట్టాడు.

విస్తరిలో ఒక్క మెతుకు కూడా మిగల్చకుండా ఊడ్చుకు తినేశాడు. వేళ్ళకి అంటుకున్న అన్నాన్ని నాలుకతో నాకేశాడు. చెంబుడు నీళ్లు తాగి తృప్తిగా త్రేన్చేడు.

భుజం మీద తువ్వాలుతో చేతులు తుడుచుకొని, చేతులెత్తి దండం పెట్టి "వస్తాను తల్లీ" అన్నాడు.

దిబ్బమ్మ నవ్వింది. "అదేంటి బాబూ! 20 రూపాయలొద్దా! అన్నట్టు ఇరవయ్యేం? రూపాయిన్నరొకటివ్వాలి కదా..."

"డబ్బుకేఁవుంది, తల్లీ. దయతో కడుపునిండా అన్నం పెట్టారు. అదే సాలు. ఆ సల్లదనం ముందర ఇరవై రూపాయలు కాత్తల్లి... లచ్చరూపాయలు కూడా నిలబడ్నేవు తల్లీ!" అన్నాడు.

తను ఎన్నాళ్ళగానో రిక్షా తొక్కుతున్నాడు. రిక్షా ఎక్కినోళ్ళంతా మనుషులేనని మొదట్లో అనుకున్నాడు.

కాని రిక్షా ఎక్కినవాళ్ళెవరూ తనని మనిషి కింద లెక్క చేయకపోవడంతో, సాటి మనిషిగా చూడకపోడంతో, 'అవును ఎందుకు సూడాల? సూడాల్సిన అవుసరవేఁటి? అలాగే నానెందుకు సూడాల? నాకేటి అవుసరం? వొవుడి సొద ఆడిది. వొవుడి బతుకు ఆడిది!' అనుకున్నాడు. అయితే,

ఆ నరిసిగాడే ఇప్పుడు 'దయా దాచ్చిన్నం ఇంకా బతికే ఉన్నాయి. ఎదటి కడుపు సొద ఎరిగిన అమ్మలు, ఇంకా యీ బూమ్మీదున్నారు' అనుకున్నాడు. అదే ఆమెతో అన్నాడు. అలా అనేటప్పుడు నరిసిగాడి కళ్ళు ఆనందం వల్లో, కృతజ్ఞత వల్లో తడితడిగా అయ్యేయి!

'పిచ్చోడా! నాదేదో దయ, నాదేదో మంచి మనసు అంటావు గాని నీ మంచితనవేఁటో, నీ గొప్పతనవేఁటో నీకు తెల్దు! ఈ ఎడారిలో, ఎండలో, ఎదురుగాలిలో... రెండు గంటల పాటు పడ్డ నీ కష్టం కాడ, అదునుకి పిల్లకిచ్చిన జాంకాయ కాడ, అదునుకి ఆకుదోనె నిండా నీవిచ్చిన నీళ్ళకాడ... నా దయేపాటి? నా దాచ్చిన్నవేఁపాటి? నువ్వు సేసిన మేలుకి కొంతలో కొంతైనా రునవుఁ తీర్సుకుందారని వొన్నం పెట్టినాను గాని, ఆపాటి దానికే రునం సెల్లిపోదు! అయినా చేసిన మేలుకి వొన్నం పెట్టడం గొప్ప కాదయ్యా! మేలు సెయ్యడవేఁ గొప్ప! అంతేకాదు, ముందిస్తిరాకు, కష్టజీవికే ఎయ్యాల.. నానేటి? వొవులైనా సరే... ఆ దేవుడైనా సరే... కష్టం చేసినోడి కాలికి తలొంచి దండవెట్టాల' అనుకుంది దిబ్బమ్మ.

దిబ్బమ్మ అలా అనుకోడంలో ఆశ్చర్యం లేదు. ఏవంటే... కష్టం చేసినోళ్ళకే కష్టమంటే ఏవిఁటో తెలుస్తుంది. కష్టం చేసినోళ్ళకే కనికరమంటే ఏవిఁటో తెలుస్తుంది. కరిగినా, మరిగినా కష్టపడేటోళ్ళ గుండెలో కదుల్తుంది. మెదుల్తుంది!

దిబ్బమ్మ కష్టం చేసిన మనిషి!

దిబ్బమ్మ చిక్కంలోంచి డబ్బు తీసి యిచ్చింది.

రూపాయిన్నర ప్లస్ యిరవై యివ్వక తప్పదని డిమాండు చేసిన నరిసిగాడు ఆ డబ్బు తీసుకుంటూ... ఎందుకో సిగ్గుపడ్డాడు. ఇరవయ్యే తీసుకుని రూపాయిన్నర జోలికి వెళ్ళగూడదనుకున్నాడు!

కాని దిబ్బమ్మ నరిసిగాడి కిచ్చింది యిరవయ్యా కాదు, యిరవై మీద ఒకటిన్నరా కాదు!

పాతిక అవును. పాతిక!

స్టేషన్లో అర్ధరూపాయి కోసం, అరగంట బేరమాడిన దిబ్బమ్మ, 'ఒరే! ఏం ఆశరా!' అన్న దిబ్బమ్మ. 'రూపాయిన్నర అడక్కుండా మొత్తం ఏకంగా యిరవై చేసుకో' అన్న దిబ్బమ్మ... వాడు ఏ డిమాండు చేయకుండానే పాతిక రూపాయలిచ్చింది!

తను యిచ్చినది వాడి కష్టానికి కట్టిన విలువని కాదు.. తనకి తోచినది.

తను సంతోషం కొద్దీ ఇచ్చినది.

*(1981 వ సంవత్సరంలో ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంక్రాంతి కథలపోటీలో ప్రథమ బహుమతి పురస్కారం అందుకున్న కథ... పునర్ముద్రణ)*

# మడతపేచీ

## కీ. శే. భమిడిపాటి కామేశ్వరరావు

> ***"మీ వాటాలు ఇద్దైపోనూ, అల్లానే చూడచ్చు లెండ్రా! నీ, ఇంకా ఎంతమందికి బహుమతీలో వాటాలున్నాయో కనుక్కుని మధ్యవర్తుల్ని పెట్టి వ్యాపార పరిష్కారం చేయిత్తాం, ముందు అసలు మనిషి దాటిపోకుండా పట్టుగుందాం నడవండి" అని నేను గట్టిగా అన్నాను.***

ఒకసారి చందన బస్తీపత్రికలో ఒక చాటింపు పడింది: "లక్షారావుగారు ప్రమాదం వల్ల పడిపోయారు. వారి నడుం మడత పడిపోయింది. చిట్టిచిట్టి ఉపాయాల వల్ల గుణం లేకుండా ఉంది. ఇక్కడికి వచ్చి కుదర్చగల వైద్యుడికి, వెయ్యిరూపాయలు పైగా ఉండే బహుమతీ ఇస్తారు. ప్రజ్ఞగల వైద్యులు కావాలి. స్వయంగా వచ్చి మాట్లాడుకోవచ్చును. వివరాలకి వ్రాయవచ్చును. చిరునామా, పత్రికాధిపతి: చందన బస్తీ" అని!

అ బస్తీకి ఒక పూట నాటు ప్రయాణంలో కరూరు అనే పట్నం ఉంది. ఆ ఊళ్లో వైద్యాభ్యాసం చేస్తూన్న డాక్టర్ ధనాధన్‌గారు కూడా, అందరికి మల్లేనే, పత్రికలోపడ్డ ఘోషణ చదివి చప్పరించి ఊరుకున్నాడు. కాని, ఆ మర్నాడే పత్రికాధిపతి దగ్గర్నించి ఆయనకి ఓ పెద్ద ఉత్తరం వచ్చింది. అందులో రోగిగారిని గురించిన వివరాలన్నీ ఉన్నాయి.

ఆయనకి ఆశ్చర్యం వేసింది. ఇంతమంది ఘనవైద్యులు ప్రపంచంలో ఉంటూంటే, తన పేరు అప్పుడే పత్రికాధిపతికి ఎట్లా తెలిసిందో గదా అని ఆయన అనుకుని, లోపల సంతోషించుగుని, భార్యని కేకేసి, మీసం ఉండవలిసిన చోట తర్జన్యం గుష్ఠాలతో గాల్ని మెలిపెడుతూ, "చూశావా, మన తఢాఖా!" అంటూ ఆ ఉత్తరం చూపెట్టాడు.

తక్షణం ఆవిడ నవ్వేసి, "తఢాఖాలానే ఉంది. మొన్ననేను పత్రికాధిపతి పేర రాయగా, ఆయన తబిసీళ్లు రాశాడు గావును. ఇంతమాత్రానికే పొంగిపోకండి మరి!" అంది.

ఆయనకి కొంచెం చిన్నతనం వేసినా, మాట్లాడ్డానికి వీల్లేక ఊరుకున్నాడు. బహుమతీ ఆశ ఎవడి కుండదూ? ఆయన నిలబడ్డపాట్న ఆ కేసు అంగీకరించి ఉండేవాడే కాని, అతనికి ఆ ఉత్తరంలో చాటింపులో లేని షరతు ఒకటి మహాపాపిష్ఠిది కనిపించింది. "ఏమంటారా, వైద్యానికి కుదురుకున్న వారు.. వంద రూపాయలు ధరావతు కట్టిం తరవాతే వైద్యం ప్రారంభించవలసి ఉంటుందని! ఎక్కడేనా చక్కటి బజానా ముందు పుచ్చుగుని పని ఒప్పుగుంటారు గాని, ఇవ్వడం ఏమిటి?" అన్నాడాయన!

"పెద్దవాళ్లతో వ్యాపారం ఆమాత్రం బరువుగానే ఉంటుందని గ్రహించుగోవాలి" అందావిడ.

'ఆ బహుమతికి ఓ అరదణ్ణం పెట్టి మనపని మనం చూసుకుంటే నయం' అని ఆవిడతో నయాన్నీ భయాన్నీ చెప్పి చూద్దాం అని ఆయన యత్నించాడు.




ఆవిడ ససేమిరా వినిపించుకోలేదు. సరిగదా..

భార్య: మనకి బ్యాంకిలో నిలవ ఎంతుంది?

డాక్టర్: నూరు పైనే ఉంటుంది.

భా: రేప్పొద్దున్న అది పుచ్చేసుగుని వెళ్లి మీరు ఈ బేరం అచ్చుగోండి.

డా: అక్కడ ఎంతమంది ఉన్నారో పోటీకి?

భా: ఏ కాళ్ళో పట్టుగుని బేరం చేచిక్కించుకోవాలి. దాచపెట్టుగుంటే ఓరికేసి ఓరు చూస్తూ కూచోవాలి.

డా: నాకింకా వైద్యపరంగా చెయి తిరగలేదు, అర్థపరంగా గుక్క తిరగలేదు! మన స్థితికింకా ఎక్కడా గాలి తిరగ లేదు.

భా: మృతనష్టపు కేసులు ఎన్నని చేసి సంపాదిస్తే అంత అవుతుంది?

.. అని వాదించింది.

డాక్టర్ ధనాధన్ పనివాడే గాని, మాటశూరుడు కాడు. అందులో, ఇవతల మనిషి భార్యగాని, మరొకరూ మరొకరూ కాదు. అందుకని, మర్నాడు డబ్బా డవాలీ కట్టి, బ్యాంక్ కెళ్లి డబ్బు తెచ్చి జాగర్త చేసుగుని, ఓ రోగి కాస్త మార్గంలో పడడం చూసుగుని ఒక వారంలో మళ్లీ వస్తానని చెప్పి, ఆయన చందనబస్తి వెళ్లిపోయాడు. ఆయన వెళ్లగానే, స్నేహితురాలి ద్వారా ఆవిడ దగ్గిరికి ఒక బంగారపు గొలుసు, పాతిక్కాసుల్ది, బేరాని కొచ్చింది. మషాగతు కలిసిరావడం వల్ల కొంచెం రాహితుగా వస్తువు దొరుకుతోందనిపించి, 'బహుమతీ రాగానే పూర్తిగా సొమ్ము గిరవాటెయ్యచ్చుగదా' అనే ధైర్యం చొప్పున, ఆవిడ, మాస వాయిదాల మీద డబ్బు చెల్లించే షరతుకి ఆ గొలుసు పుచ్చుగోడానికి ఒప్పుగుని బజానా ఇచ్చింది.

కాని, డాక్టర్ ధనాధన్‌గారు వారం లేదు, గీరం లేదు. మర్నాడు సాయింత్రానికి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి పడ్డాడు. 'అంత పెందరాళే ఆయన వచ్చెయ్యడం ఆవిడికి కొంచెం ఆశ్చర్యం అయింది. అయినా ఆవిడ,"చూశారా! ఈ గొలుసు ఎంత ఇంచక్కా ఉందో!" అంది.

"ఇంచక్కానే ఉంది' అని ఆయన కూలబడి చెప్పుగొచ్చాడట:

"ఆ ఊళ్లో ఉన్న సత్రంలో రాత్రి మకాం వేశాను. ఉదయాన్ని కాఫీ కానిచ్చుగుని వచ్చి, మరి 'ఆ రోగి దగ్గిరికి ఎల్లానా వెళ్లి పడడం' అని నేను గుంజాటన పడుతూండగా, కోర్టు పని మీద ఆ వూరొచ్చి అక్కడ బసగా దిగిన ఒకాయన సాయం చేశాడు. ఆయన నన్ను వెంటబెట్టుగుని తిన్నగా లక్షారావుగారి గుమాస్తాకి అంటించి వెళ్లాడు. మొదట్లో, ఆ గుమాస్తా, రేగటి బెడ్డల్లాగ మహా గుచ్చుకొనేటట్టు మాట్లాడాడు. కాని, కాస్త తడి తగిలించేసరికి ఎక్కడిలేని మెత్తదనం కనపరిచి, తక్షణం నన్ను వెంటేసుగుని రోగిగారింటికి తీసికెళ్లాడు. రోగిగారిది పెద్దమేడ. ఒక గదిలో ఒక సాగుడు మంచం మీద ఆయన శాలువ కప్పుగుని పరున్నాడు. ఆయన బాధతోనే నాతో ప్రసంగించాడు.

రోగి: కూచోండి. తమదే గ్రామం?

నేను: కరూరు. మీకు ఒంట్లో ఎట్లా ఉంది?

రో: ఒంటి కేమండీ, పిక్కలా ఉంది. నడుమే!

నే: అసలు సంగతేమిటండి ?

రో: మా బస్తీ ప్రముఖులు ఈ మధ్య రోడ్ల మీద పిల్ల కాలవలు తవ్వారు.

నే: ఎందుకూ?

రో: మంచినీళ్ల గొట్టాలకనీ, మురుగునీటి తూములకనీ, చెట్లు పాతడానికనీ, స్తంబాలు స్థాపించడానికనీ, బళ్లవాళ్ల మీద కసి కొద్దీననీ, హెచ్చుతగ్గు లొచ్చినప్పుడు, దూరాభారం వెళ్లక్కర్లేకుండాననీ జనం చెప్పుకున్నారు. ఆ వయినం ఇంకా తేల్నే లేదు.

నే: సరిపోయింది. మీరల్లాంటి గోతులో గాని పడ్డారా ఏమిటి?

రో: మరే.

నే: పోన్లేస్తురూ, మీ అజాగర్తా మీరూనూ! కాస్త కిందూ మీదూ చూసుగుని నడవక్క ర్లేదుటండీ, మీ రెంత

సామంతులైనా! చిన్న వారూ చితగవారు గనకనా ఇదవడానికి!

రో: అయ్యో! అయ్యో! అబ్బ! అబ్బ!

నే: ఏం ఏం? నెప్పా? తగ్గిస్తాగా! వెధవ నెప్పి!

రో: మరేనండి. గట్టిగా మాట్టాడేసరికి ఖరేలు మనడమూనూ అక్కణ్ణించి ధనువాయిపోటూనూ! కదులుదాం

అనుకునేసరికి కలుక్కుమంటుంది.

నే: అయితే పోన్లెండి. కాస్త నిమ్మళించుగుని మరీ చెప్పండి.

రో: ఒకనాడు నేను రాత్రి షికారెళ్లి కార్లో వచ్చాను.

నే: మీరు రాత్తెళ్లు కారుషికారు వెడతారా?

రో: రోజూ కాదు. తోచనప్పుడు వెడుతూంటాను. ఆ వేళ కారు దిగి ఇంట్లోకి వస్తూ, ఈపక్కా ఆపక్కా కనిపించే

పాతాళపు గొయ్యిలాంటిది చూసి కళ్లు తిరిగిపోయి పడిపోయాను. ఆ పడిపోడంలో ఆ తవ్విన కాలవకి సరీసుగా అడ్డంగా డాముపంతెనలా పడ్డానేమో, నా నడుం మడతడిపోయింది. అసలు విరిగి ముక్కలై పోవలిసినమాటే! ఆ తరవాత ఏం జరిగిందో నాకు తెలియదు. కాని కిట్టని కుంకలకి పన్లేక, నాకు పడడానికి పూర్వమే స్పృహ లేదనీ, నేనేదో తాగొచ్చి పడిపోయాననీ, లేనిపోని అపవాదలు నా మీద వేశారనీ మా గుమాస్తాకి తెలిసిందిట! నడుం సర్దుకోడంతోటే, నడుంకట్టి వాళ్ల పని పడతాను.

నే: పోన్లెండి, అదంతా ఎందు కిప్పుడు? తక్షణం మీరు తోమించకపోయారా?

రో: అయ్యో! తోమించాం.

నే: ఏదేనా మందు పామించకపోయారా?

రో: అయ్యో! పామించాం.

నే: బెణుకు వైద్యులకీ, యిరుకు వైద్యులకీ చూపించారా?

రో:చూపించాం.

నే: కాపించారా ?

రో: కాపించాం. ఉప్పు, నిమ్మకాయి...

నే: పట్లు?

రో: పట్లూ వేయించాం.

నే: లోపలికి మందు ఏమన్నా కుట్టించారా?

రో: ఆ కుట్టించాం.

నే: పథ్యం ఏమన్నా చేస్తున్నారా?

రో: అక్కర్లేదన్నారు. సరేగానండి, తమది కూనీవైద్యం కాదుగదా!

నే: అంటే?

రో: అంటే కూనీయే.

నే: చ.. ఛ.. తమకి తెలియదు. అది 'హైడ్రోపతి'. నాకు అదీ తెలుసు.

రో: అయితే తమరు దయచెయ్యండి. ఇల్లా ఉండనీ బాబూ, పోయినప్పుడే పోతాను. కూనీ కావడం ఎందు కొచ్చింది?

నే: అది జలవైద్యమయ్యా! అది కర్త పేరు.

రో: పేరా? అయితే మాత్రం.. ఏమిటంత మరీ నిర్మోహమాటప్పేరు!

న: పైగా నా కది ఆట్టే బాగా రాదు. సరా!

రో: మీది సీసామందు వైద్యమా?

నే: "అలోపతీ" తెలుసు.

రో: 'ఉమాపతీ' తెలుసా ?

నే: దాన్ని'హోమియోపతీ' అనాలి.

రో: ఈ కాలంలో 'ఉమాపతీ' అంటేనే పుణ్యం. మీకేం తెలుసు?

న: పోనీలెండి. ఉమాపతీ తెలుసు.

రో: ఇంక మరేమీ తెలియవుకద, ఇన్నింటి తాలూకు పథ్యాలూ చెయ్యాలేమో?

నే: నాకు 'లక్ష్మీపతీ', 'వనస్పతీ' తెలుసు. 'ఎలెక్ట్రోపతీ' తెలుసు. కొన్ని చోట్ల దాన్ని 'న్యాయతీ' అని కూడా అంటున్నారు.

రో: అయితే మీరు ఎక్కువ ఇష్టంగా వాడేరకం ఏది?

నే: నాది 'బృహస్పతీ' వైద్యం అంటాను.

రో: అంటే?

నే: మిక్కిలి గొప్పది.

రో: సరే. మీరు గుమాస్తాగారికి అడ్వాన్సు చెల్లించండి.

నే: ధరావతు ముట్టినట్టు రసీదు రాసి యిప్పించండి. కుదరడంతోటే నా బహుమతీ నాకు స్వాధీనపరిచే అంగీకారంతో కాగితం కూడా నాకు పారేయించండి. నేను ఈ వేళే ప్రారంభిస్తాను.

రో: ఇన్నాళ్లకి నాకు ధైర్యం వచ్చింది. సరే, మీరు భోజనం చేసుగుని రండి. వైద్యానికి ఇక్కడ బాగుండేటట్టు లేదు. అవతల వీధులో నా మేడ మరోటి ఖాళీగా ఉంది. నేను అక్కడికి మారతాను. వసతి మారుస్తే రోగం సహుమట్టుకు తమాయిస్తుం దని శాస్త్రం. మీరు దగ్గిరుండి, నన్ను ఎలాగో జాగర్తగా కార్లోకి ఎక్కించాలి. కారు సున్నితంగా నడవాలి. ముందు కోట దాకా వెళ్లి, రావాలి.

నే: కోట ఏమిటి?

రో: ఈ ఊళ్ళో కచేరీలన్నీ ఉండే చోటు.

నే: అక్కడి కెందుకూ?

రో: ఈ వేళ కోర్టులో వాయిదా ఉంది. ఆ తరవాత నన్ను ఎల్లానో ఆ మేడలో దింపాలి.

నే: సరే లెండి. వస్తాను.

అని నేను వచ్చేస్తూంటే గుమాస్తా, దేవతార్చనకి నన్ను తన యింటికే లాక్కెళ్లాడు. ఎక్కడి కక్కడికే అనుకుని, నేను రానని బెట్టు చెయ్యలేదు. భోజనం అయి వచ్చాం. ఆయన్ని ఆపళంగానే ఒక బల్లచెక్క మీదికి జరిపి, ఆ బల్ల చెక్క పళంగానే ఆయన్ని కార్లో ప్రతిష్ఠించాం. ఆ రోజున కారుడైవరు కార్యాంతరం మీద వెడతానని, సెలవు అడిగితే లేదన్నారట, కొరకొర లాడిపోతూ ఉన్నాడు. నేను ఎదటికెళ్లి డ్రైవరు పక్క కూచోబోయాను. అతడు నన్ను వెనక్కి వెళ్లి దయచెయ్యమన్నాడు. అధికారవర్గంలో వాళ్లు కిరాయి బస్సు డ్రైవర్లని బెదిరించి, వాళ్ల చేత బస్సులు ఖాళీ చేయించి, స్వంత పని మీద ఫ్రీగా ఎక్కినప్పుడు, వాళ్లకి సరియైన సమ్మానం జరగడానికి డ్రైవర్లు వాళ్లని వీలైనంత వెనకే కూచో పెడతారులే!

కారు బయల్దేరేటప్పుడే పెద్ద సింహగర్జన చేసింది. డ్రైవరు వాలకం చూస్తే అతడేదో అవాంతరం తెచ్చిపెట్టేటట్టు కనపడింది.

నిమిట్లో పెద్దరోడ్డుమీంచి తప్పుగుని కారు పక్కవీధిలో పడింది. అది సందులా ఉన్నా పసందుగా కూడా ఉంది.

వెనుక కతకలపోటీలో ఒక రోడ్డుకి మట్టి 'షీల్డు' బహుమతీ యిచ్చారని విన్నాం. అల్లాంటి రోడ్డది. గాలీ, వానా, వాహనాలూ, అధికార్లు, మధ్యవర్తులూ అంకినంతవరకు రక్తం పీల్చేసుగుని మాంసం నల్చేసుగుని వొదిలేసిన శల్యాల్లాగ కంకరరాళ్లు,

కతకలూ, గోతులూ, కయ్యలూ, గాళ్లూ, రొంపీ, దిబ్బలూ దిరుగుండాలూ, మట్టీ మశాణం, పెంటడబ్బా — దానిచుట్టూ శాఖోపశాఖలుగా వ్యాపించి ఉన్న తుక్కు సంతానం – ఇల్లాగా భయమేస్తూ ఆరోడ్డు జీభూతంలా ఉంది. ఆ డ్రైవరు తెలివి ఏమిటోగాని; కారు, వెనక్కీ ముందుకీ కూడా నడిచింది. అది ఒక్కొక్కసారి కప్పలా దాటేది. ఒక్కొక్కసారి పీతలా నడిచేది. ఉండి ఉండి, పొట్టేలులాగ కొన్ని గజాలు వెనక్కిపోయేది. మరొకసారి తూటాలాగ ఉన్నచోటే గిజగిజా కొట్టుకునేది. నేను పచ్చడై పోయాను. పచ్చడీ మెతుకులూ నోట్లో కొచ్చాయి. రోగిమాట అల్లా ఉండగా నా నడుం విరిగేట్టు కనపడింది. రోగి, ఏక మూలగడం, కుయ్యడం, అరవడం, ఏడవడం. ఓమాటు రోగి డ్రైవరు మీదికి ఒరిగాడు, మళ్లీ యథాస్థానంలో పడ్డాడు.

మరోమాటు, మేం యిద్దరం డ్రైవరుమీద పడి వెనక్కొచ్చాం. ఇంతలో నేనున్న వేపు గాడిలో దిగడి, రోగి వచ్చి నా పొట్టమీద పడ్డాడు. పడ్డవాడు ఊరుకోకూడదూ, రోగమా? 'బాబో, బాబో' అని ఏడుపు.

ఆపళంగా అతడు అసలుచోటి కెళ్లి పడేటట్టు ఒక్క గెంటు గెంటాను. మరికాసేపట్లో రోగివేపు చక్రాలు రొంపిలాంటిదాల్లో కూరుకు పోయేసరికి, డ్రైవరు 'గేరు' మీద కార్ని లాగించాడు. దాంతో నేనున్న వేపు పైకి లేచిపోయి, నే వెళ్లి అమాంతంగా రోగి మిాద పడ్డాను. కారు బోల్తా వేసింది. రోగి 'చచ్చాను, చచ్చాను, నీతాడు తెగా, నామీద పడకురోయ్' అని గోల.

నాశక్యమా? డ్రైవరు జాగర్తపడి ముందే దూకేశాడు. చాలామంది జనం పోగై నన్నూ రోగినీ పైకి తీశారు.

ఈ గలభాలో నాకు మోకాళ్లూ మోచేతులూ కొంచెం కొట్టుగుపోయాయి. కాని, ఆ రోగి నడుం బాగుపడి నిత్రాడులా అయి ఊరుకుంది, వీడి అదృష్టం కాలా! అతడు, 'అమ్మయ్య' అనుకుంటూ సాగి వెళ్లిపోబోయాడు. "నా బహుమతీ నా కిచ్చెయ్యండీ!" అని నేనడిగాను.

"నువ్వు కుదిర్చిందేమిటి? ఇంటి కెళ్లి ఇచ్చేస్తాలే" అన్నాడు.

తన డ్రైవింగు మహత్యంవల్ల ఆయనకి నడుం కుదిరింది గనక, బహుమతీ ఛీదాగా తనకే రావలిసి ఉంటుందని డ్రైవరు మొదలెట్టి నన్ను అటకాయించాడు. నేను కొంచెం తెల్లపోయి ఆగిపోయాను. ఆ స్థలానికి ఒకవేపున ఇల్లుగల కూచయ్య తన యింటి యెదట లక్షారావు నడుం కుదిరింది గనక తనకే ఆ బహుమతీ రావాలన్నాడు.

రెండోవేపు కాపరం ఉన్న మాచయ్య వచ్చి, తన యింటికి కూడా ఆ స్థలం యెట్టయెదటిదే గనక, తనకి చెరిసహమేనా వాటా ఉండాలన్నాడు. దాంతో, కూచయ్య, లక్షారావు తన యిల్లున్న పక్కనే కార్లో కూచుని ఉండడంవల్ల తనకే యావత్తు బహుమతీ గాని, మాచయ్యకి పూచికపుల్లేనా వెళ్లకూడదన్నాడు.

ఆ స్థలం పేరుకి కూచయ్య వేపుదైనా, పగలు తన పిల్లలూ రాత్రి తన పెద్దలూ బాహ్యానికి భుక్త పరుచుగుంటూండడంవల్ల, తనదే బహుమతీ అని మాచయ్య కేకలేశాడు. అక్కణ్ణించి ఓ పోలీసు "బీటు" కనిష్టీపు వచ్చి, ఆరోడ్డు అక్కణ్ణించి ఎడా పెడా వంద గజాలు తనదే గనక, తనకే బహుమతీ రావాలన్నాడు. వెంటనే, ఎక్కడ తెలిసిందో, వెనక ఆ రోడ్డు వేయించిన కంట్రాక్టరు వచ్చి, "అయ్యా! ఈ రోడ్డు ఇంత మహత్యం గలిగి ఉండేటట్టు తయారు చేయించింది నేను. ఇల్లా రోడ్డు లేకుండా ఉంటే కారు ఇన్ని పిల్లిమంత్రాలు వేసిఉండదు, అది అల్లా వేసి ఉండకపోతే, మీకు నడుం కుదిరి ఉండదు. అందుకని బహుమతీ నాది' అన్నాడు. ఆ రోడ్డు స్వయంగా తవ్వి చేసిన వాళ్లొచ్చి తమకీ బహుమతీలో వాటా ఉందన్నారు. కాస్సేపటికి బస్తీపాలక సంఘంవారు మనుష్యుల్ని పంపి, రోడ్డు తమదే గనక బహుమతీ తమదే అన్నారు. ఇది పబ్లిగ్గా జరిగిన పని

గనక, డీ. పీ. డబ్లుయూ వారు రాకుండా ఉంటారా అని కొందరన్నారు. ఈలోపల కొందరు బోర్డు వారికీ, ప్రభుత్వానికీ, చక్రవర్తికీ టెల్లిగ్రాపులు కొట్టి. వార్నొచ్చి బహుమతీ కోసం దెబ్బలాడమని సలహాయిస్తాం అన్నారు. ఈ దెబ్బలాటలో లక్షారావు చాలాదూరం వెళ్లిపోయాడు.

నన్ను కదల్నీకుండా వీళ్ళంతా పిశాచాల్లా పట్టుకున్నారు. “మీ వాటాలు ఇదైపోనూ, అల్లానే చూడచ్చు లెండర్రా! నీ, ఇంకా ఎంతమందికి బహుమతీలో వాటాలున్నాయో కనుక్కుని మధ్యవర్తుల్ని పెట్టి వ్యాపార పరిష్కారం చేయిత్తాం, ముందు అసలు మనిషి దాటిపోకుండా పట్టుగుందాం నడవండి” అని నేను గట్టిగా అన్నాను.

అతడు కోటవేపుకి వెళ్లాడని కొందరన్నారు. కార్ని ఆ రోడ్డుమించి గెంటి, పెద్దరోడ్డు మీదికి ఎక్కించి, అంతా కిటకిటలాడుతూ కార్లోనూ, కారు మీదా ఎక్కికూచున్నాం. క్షణంలో కారు కోట దగ్గిర వాలింది. లక్షారావు ఏ కోర్టులోకో వెళ్లి అప్పుడే తిరిగి వచ్చేస్తున్నాడు. కొందరెళ్లి వాకబు చేశారు. వాడి కోర్టు చల్లగా ఉండా, అది దివాలాల కోర్టుట. వాడి వాయిదా అక్కడ అని, డాక్టర్ ధనాధన్ వైద్యవృత్తాంతం చెప్పి ఆగాడట.

‘పోనీ మీరు అడ్వాన్సుగా కట్టిన సొమ్ము తెచ్చుగున్నారా?’ అని ఆయన భార్య అడిగిందిట.

ఆ సంగతి తను అప్పట్లో మరిచా ననిన్నీ, మళ్లీ వెళ్లి తెచ్చుకోవాలనిన్నీ ఆయన అన్నాడట.

*(భారతి, బాహుధాన్య సంవత్సరం, పుష్యమాస సంచిక నుంచి పునర్ముద్రణ)*

# కథల పండగలు

పండగంటేనే సంబరం ... పండగంటేనే సందడి.

వానలొచ్చినా, వరదలు ముంచెత్తినా, ఉప్పెనలొచ్చినా, ఊళ్లు మునిగినా...

వినాయకచవితి మొదలు ఉగాది వరకు ... పండగలే పండగలు తెలుగు ప్రజలకు.

ఈ పండగలను పురస్కరించుకుని వివిధ పత్రికలు ఒకరితో ఒకరు పోటీపడుతూ కథల పోటీలను నిర్వహిస్తూండటం వలన తెలుగు కథకులకు కూడా ఇవి పండగ రోజులే.

ఒక్కొక్క పండగకు ఒక ప్రత్యేకమైన వంటకం, ఒక్కొక్క పోటీకి ఒక ప్రత్యేకమైన అంశం.

తినేవారి దంతసిరిని బట్టి పదార్థానికి రుచి ఒనగూడుతుంది... చదివేవారి మనస్థితిని బట్టి కథకు ప్రాచుర్యం ఒనగూడుతుంది.

కథావస్తువు, కథాగమనం, శిల్పం, అభివ్యక్తీకరణ ఏ కథలో ప్రతిబింబిస్తాయో ఆ కథలు కలకాలం పాఠకుల మనోక్షేత్రంలో నిలుస్తాయి.

తమ చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ వ్రాసిన కథలు పాఠకుల్లో సంస్కారవంతమైన ఆలోచనలను రేకెత్తించడానికి దోహదపడతాయి.

కథలను సాకల్యంగా పరిశీలించి చదివేవారి మదిలో పదికాలాలు పాటు నిలిచే కథలను మాత్రమే ఎంపిక చేస్తూ పాఠకుల అభిమానాన్ని, మన్ననలను అందుకుంటోంది కథామంజరి.